ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
సోమవారం 11, నవంబరు 2024



వయోలీనం

ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన శాస్త్రీయ సంగీత విభావరి అలరించింది. పద్మశ్రీ అవసరాల కన్యాకుమారి వయోలిన్ కచేరి శ్రవణానందకరంగా సాగింది. కార్యక్రమం ఆసాంతం ప్రేక్షకులందరూ లీనమైపోయారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు



పెళ్లి బస్సు బోల్తా

ఏడుగురికి స్వల్ప గాయాలు

6





గేట్లు వేసి ఉన్న ఒంగోలులోని మినీ స్టేడియం

క్రీడాకారులతో ఆడుకున్నారు!

- వైసీపీ పాలనలో క్రీడారంగం చతికిల
- ఆటగాళ్లపై ఫీ'జులు'ం

జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వివిధ పోటీల్లో రాణించి అనేక మంది మట్టిలో మాణిక్యాల్లా మెరిశారు. పలు పతకాలతో జిల్లా ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో క్రీడారంగం మసకబారింది. క్రీడాకారులకు ప్రోత్సాహం లేకపోవడం, అస్తవ్యస్త విధానాలు, అరకొర నిధుల కేటాయింపు అందుకు కారణమైంది. ఆటలపైనా నాటి ప్రభుత్వం ఫీ'జులుం' ప్రదర్శించింది. 'పే అండ్ ప్లే' విధానాన్ని ప్రవేశపెట్టి క్రీడాకారుల నుంచి రూ.లక్షలు దండుకొంది. ప్రాక్టీస్‌కు అవసరమైన మైదానాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో క్రీడాకారులు చతికిలపడ్డారు. ఈనేపథ్యంలో కూటమి అధికారంలోకి రావడంతో ఆటల అభివృద్ధిపై ఆశలు పెంచుకున్నారు. ప్రభుత్వం మారి నాలుగు నెలలు కావస్తున్నా పే అండ్ ప్లే విధానం కొనసాగుతుండటంపై క్రీడాకారులు, కోచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలు (కార్పొరేషన్), నవంబరు 10 : క్రీడాకారులతో గత వైసీపీ పాలకులు ఆటలాడుకున్నారు. క్రీడల అభివృద్ధిని విస్మరించారు. ఆటలను కూడా ఆదాయమార్గంగా మార్చుకున్నారు. 'పే అండ్ ప్లే' విధానాన్ని తీసుకొచ్చి ప్రవేశ, ప్రాక్టీసు ఫీజులు వసూలు చేశారు. కోచ్‌లకు టార్గెట్లు నిర్ణయించి ఆమేరకు క్రీడాకారులను రప్పించాలని హుకుం జారీ చేశారు. ఆటగాళ్ల నుంచి వసూలు చేసిన నిధులకు లెక్కాపత్రం లేదు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభించక, అవసరమైన మైదానాలు లేక ఐదేళ్లుగా జిల్లాలో క్రీడారంగం పరాజయం బాటన నడిచింది.

యూజర్ చార్జీల పేరుతో శాప్ వసూళ్ల పర్వం

వైసీపీ అధికారంలోకి రాకముందు వరకు టీడీపీ పాలనలో క్రీడారంగం

మిగతా 6లో...

- ప్రవేశానికి, నెలవారీ శిక్షణకు రుసుం నిర్ణయించి వసూళ్లు
- మైదానాల గురించి పట్టించుకోని దైన్యం
- గత టీడీపీ హయాంలో నిర్మించిన స్టేడియాలు నిరుపయోగం
- కొన్నిచోట్ల ప్రైవేటు కార్యక్రమాలకు వేదికలుగా మారిన వైనం
- పేఅండ్‌ప్లే రద్దు చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి

కల్యాణ వైభోగమే!

- ఖరీదైన 'మూడు ముళ్ల బంధం'
- పిలుపుల నుంచే ఆర్భాటం... హంగులు..
- ఖర్చులో పోటీ పడుతున్న తల్లిదండ్రులు

7



తేలని పంచాయితీ



- పూర్వపు డీపీవో ఇష్టారాజ్య ఫలితం
- పోస్టింగ్‌లు లేక గాలిలో ఉన్న 56 మంది ఉద్యోగులు
- 50 రోజులుగా ఎదురుచూపులు
- పీఆర్ కమిషనర్‌కు కలెక్టర్ లేఖ రాసినా స్పందన కరువు
- సర్వీసు కోల్పోతామని గ్రేడ్-5, 6 సచివాలయ ఉద్యోగుల ఆందోళన

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేసే గ్రేడ్-5, 6 (సచివాలయ) ఉద్యోగుల పోస్టింగ్‌ల విషయంలో ప్రతిష్ఠంభన కొనసాగుతూనే ఉంది. 50 రోజులుగా నడుస్తున్న పంచాయితీ ఇంకా తేలలేదు. పూర్వపు డీపీవో, కొందరు ఉద్యోగుల అవినీతి, అక్రమాల కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. దీంతో 56 మంది ఉద్యోగులకు ఎక్కడా పోస్టింగ్‌లు లభించక గాలిలోనే ఉండిపోయారు. వారంతా ప్రస్తుతం దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తాము సర్వీసు కోల్పోతున్నామని వారు వాపోతున్నారు.

బదిలీల్లో భారీగా అక్రమాలు

ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అన్నిశాఖల్లో ఆ ప్రక్రియను సాఫీగానే పూర్తి చేశారు. అయితే జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో మాత్రం అవినీతి, అక్రమాలు భారీగా చోటుచేసుకోవడంతో గందరగోళం నెలకొంది. బదిలీల ఉత్తర్వులు ఇచ్చేందుకు

మిగతా 6లో...

కలెక్టర్ ప్రొసీడింగ్స్‌కు భిన్నంగా బదిలీలు

ఉద్యోగుల బదిలీలను కలెక్టర్ అన్సారియా ఇచ్చిన ప్రొసీడింగ్స్‌కు భిన్నంగా చేసినట్లు గుర్తించారు. దీంతో 56 మంది ఉద్యోగులకు పోస్టింగ్‌లు లేక గాలిలో ఉండిపోయారు. వారంతా కలెక్టర్‌తోపాటు ప్రస్తుత జిల్లా పంచాయతీ అధికారిని కలిసి గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో జిల్లాలో ప్రస్తుతం గాలిలో ఉన్న ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు పంచాయతీరాజ్ కమిషనర్‌కు 15 రోజుల క్రితం కలెక్టర్ లేఖ రాశారు. ఇప్పటి వరకూ అక్కడి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గాలిలో ఉన్న ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

త్రిపురాంతకం ప్రాంతంలో మిర్చిలో కలుపు తీస్తున్న కూలీలు





కొండపిలో పొగాకు విడుపులు వేస్తున్న కూలీలు

సాగు జోరు

- ముమ్మరంగా రబీ పనులు
- ఊపందుకున్న పొగాకు, మిర్చి, వరినాట్లు
- కళకళలాడుతున్న ఖరీఫ్ పైర్లు
- మరోసారి వర్షం కురిస్తే శనగ, పొగాకు మరింత పెరిగే అవకాశం

ఒంగోలు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. రబీలో కీలక పంటలైన పొగాకు, వరి, మిర్చి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న వంటివి కళకళలాడుతున్నాయి. ఆపైర్లతోపాటు రబీ ఆరంభంలో వేసిన వరి, మిర్చి పొలాల్లో ముమ్మరంగా కలుపు తీత, ఇతరత్రా పనుల్లో రైతులు, కూలీలు బిజీ అయ్యారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం నెలకొనడంతో పూర్తిస్థాయిలో పంటలను రైతులు సాగు చేయలేకపోయారు. ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 2.02 లక్షల

మిగతా 6లో...

దుర్వినియోగమైన నిధులు రికవరీ చేయండి

సంతనూతలపాడు

- ఈవోఆర్డీకి కలెక్టర్ ఆదేశం
- మాజీ సర్పంచ్‌కు నోటీసు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు గ్రామ పంచాయతీలో గతంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా సీరియస్ అయ్యారు. ఆర్ఆర్ చట్టాన్ని ఉపయోగించి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఈవోఆర్డీని ఆమె ఆదేశించారు. అదేసమయంలో మాజీ సర్పంచ్ అంకారావుకు నోటీసు ఇచ్చారు. అంకారావు సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయని ఆ గ్రామానికి చెందిన కుంచాల వీరబ్రహ్మయ్య కలెక్టర్‌తోపాటు, రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఈనేపథ్యంలో అప్పటి జిల్లా పంచాయతీ అధికారి విచారణకు ఆదేశించారు. విచారణలో రూ.30,48,373 దుర్వినియోగమైనట్లు తేలింది. దీంతో మాజీ సర్పంచ్‌కు కలెక్టర్ నోటీసు ఇవ్వడంతోపాటు నిధులను ఏపీ రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేయాలని ఈవోఆర్డీని ఆదేశించారు.

హైవేకు బీటలు



రోడ్డును ఆనుకొని నిలిచి ఉన్న నీరు

రియల్టర్ల ఆగడాలకు అంతులేకుండా పోయింది. జాతీయ రహదారి-565 వెంబడి మార్కాపురం మండలం రాయవరం నుంచి పెద్దారవీడు మండలం దేవరాజు గట్టు మధ్యలో వర్షపు నీరు బయటకుపోయే కాలువలను కూడా ఆక్రమించారు. దీంతో రోడ్డు పక్కన పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ఇక వర్షం పడినప్పుడు రోడ్డుపైనే పారుతోంది. దీంతో ఇప్పటికే పలు చోట్ల రోడ్డు బీటలు వారింది. కుంటలలో నీరు కారణంగా నేల కుంగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే రోడ్డు మనుగడే ప్రశ్నార్థకం కానుంది.



బీటలు వారిన రోడ్డు

6

104 ఉద్యోగుల ఆందోళన

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ 104 ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ 104 ఉద్యోగుల విషయంలో అరబిందో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. వారిని బానిసలుగా చూస్తున్నదని మండిపడ్డారు. కనీస వేతనాలు ఇవ్వకపోగా ప్రభుత్వం అంగీకరించిన స్లాబ్ సిస్టం

మిగతా 6లో...



కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న 104 సిబ్బంది

సాగు జోరు

(5వ పేజీ తరువాయి)



త్రిపురాంతకంలో వరిపంటలో తెగుళ్ల నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు

హెక్టార్లు కాగా సుమారు లక్షా 62వేల హెక్టార్లలో మాత్రమే వేశారు. అందులో సుమారు 70వేల హెక్టార్లలో ప్రధాన పంట అయిన కంది ఉంది. 22 వేల హెక్టార్లలో మిర్చి, 12వేల హెక్టార్లలో పత్తి, దాదాపు 10వేల హెక్టార్లలో వరి, మరో 6వేల హెక్టార్లలో సజ్జ సాగు చేశారు. సజ్జ కోతలు పూర్తయ్యింది. ఇతర పంటలు పూత, పిందె దశల్లో ఉన్నాయి. గత నెలలో విస్తారంగా కురిసిన వర్షాలు ఈ పంటలకు బాగా లాభించాయి.

32,315 హెక్టార్లలో రబీ పైర్ల సాగు

రబీ సాగు కూడా జిల్లాలో ముమ్మరమైంది. ఈ సీజన్ సాధారణ విస్తీర్ణం లక్షా 61వేల హెక్టార్లు కాగా ఇప్పటి వరకు దాదాపు 32,315 హెక్టార్లలో పంటలు పడ్డాయి. ఈ సీజన్‌లో ప్రధానంగా సాగు చేసే పొగాకు, వరి, శనగ, మినుము, అలసంద, మిర్చి పంటలను ముమ్మరంగా వేస్తున్నారు. ఇప్పటికే సుమారు 9వేల హెక్టార్లలో మినుము, ఆరువేల హెక్టార్లలో పొగాకు, మూడున్నర వేల హెక్టార్లలో వరి, మూడున్నర వేల హెక్టార్లలో శనగ, ఐదున్నర వేల హెక్టార్లలో అలసంద వంటివి సాగు చేశారు. గత నెలలో కురిసిన వర్షాలు సాగుకు బాగా ఉపకరించాయి. పుష్కలంగా సాగర్ నీరు వస్తుండటం కూడా లాభించింది. మరోసారి ఒక మోస్తరు వర్షం కురిస్తే మరింత విస్తారంగా పొగాకు, శనగ పంటలను రైతులు సాగు చేయనున్నారు. మొత్తంగా జిల్లాలో ప్రస్తుతం ఏప్రాంతంలో చూసినా వ్యవసాయ పనులతో రైతులు బిజీబిజీగా కనిపిస్తున్నారు.

104 ఉద్యోగుల ఆందోళన

(5వ పేజీ తరువాయి)

అమలు చేయలేదని మండిపడ్డారు. ఉద్యోగులకు సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐలలో యాజమాన్యం వాటా కట్టకుండా మోసం చేసిందని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని ఆ సొమ్మును రికవరీ చేసి కార్మికుల ఖాతాలో జమచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే కొత్త ఉద్యోగాలలో 104 సిబ్బందికి వెయిటేజ్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 104 ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి కె.రవివర్మ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ నెలరోజులుగా వివిధ పద్ధతుల్లో ఆందోళనలు చేస్తున్నా అరబిందో యాజమాన్యం కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు అబ్బూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో శ్రీధర్‌రెడ్డి, నరేంద్ర, సుబ్బయ్య, శ్రీకాంత్, ఉదయభాస్కర్, వెంకటేశ్వర్లు, శ్వేత, స్వాతి, పావని తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో ఆడుకున్నారు!

(5వ పేజీ తరువాయి)

విజయం వైపు దూసుకెళ్లింది. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు, నియోజకవర్గాల వారీగా మినీ స్టేడియాల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో దాదాపు రూ.2కోట్లకు పైగా ఖర్చు చేసి స్టేడియం నిర్మించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మైదానంలో అడుగు పెట్టాలంటే ఓ రేటు, అడ్మిషన్ పొందాలంటే మరో రేటు, శిక్షణ పొందాలంటే నెల వారీ ఫీజు చెల్లించాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో శాప్ యూజర్ చార్జీలు అంటూ ఇలాంటి అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవడంతో క్రీడారంగం ఓటమిపాలైంది.

పోటీలు, పతకాలు కరువు

జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు, ప్రభుత్వ హాస్టల్స్‌లో ఉండే బాల, బాలికలు వారికి సమీపంలో ఉన్న మైదానాల్లో శిక్షణ పొందుతుంటారు. వ్యాయామోపాధ్యాయులు క్రీడలపట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులకు శిక్షణ అందించి ఎంపిక చేస్తారు. అత్యధికశాతం మంది గ్రామీణ ప్రాంత, పేద, క్రీడాకారులే ఉంటారు. అయితే 2019 సంవత్సరం వరకు వారు పైసా చెల్లించకుండానే అందుబాటులో ఉన్న మైదానాలు, కోచ్‌లు, ఆట పరికరాలతో శిక్షణ పొంది గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగారు. అయితే ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు వారితో ఇష్టారాజ్యంగా ఆడుకున్నారు. అవసరమైన నిధులు కేటాయించకుండా పోటీలను దాతల సహకారంతో నిర్వహించుకోవాలని, క్రీడాకారుల నుంచి ఫీజులు వసూలు చేయాలని ఉత్వర్వులు జారీ చేశారు. దీంతో నాలుగున్నరేళ్లుగా పోటీలు లేకపోవడంతో పతకాలు కూడా కరువయ్యాయి.

ప్రైవేటు కార్యక్రమాలకు వేదికగా మినీ స్టేడియం

జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మినీ స్టేడియంల నిర్మాణాలు చేపట్టింది. ఒంగోలులో క్రీడామైదానం కోసం నగరానికి చెందిన పర్వతరెడ్డి ఆనంద్ రూ.కోటి విరాళంగా ఇవ్వగా, ఆతర్వాత ప్రభుత్వం అదనంగా రూ.కోటికిపైన కేటాయించింది. అనంతరం షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో శిక్షణకు అవసరమైన చర్యలు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ప్రస్తుతం అది పేరుకు మాత్రమే అన్నట్లు ఉంది. మైదానంలో పోటీల నిర్వహణకు పలు క్రీడా సంఘాలు విన్నవించుకుంటున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు, చీఫ్ కోచ్‌లు ఫీజులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక నగరపాలక సంస్థ పాఠశాలలకు చెందిన క్రీడామైదానాలలో నిర్వహించుకుంటున్నట్లు పలువురు కోచ్‌లు, వ్యాయామోపాధ్యాయులు వాపోతున్నారు. ఇదిలా ఉంచితే ఈ మైదానం ఇప్పుడు ప్రైవేటు కార్యక్రమాలకు వేదికగా మారింది. అత్యధిక జనాభా పట్టే మినీ స్టేడియంలో ఒకరోజు కార్యక్రమానికి సుమారు రూ.20వేల నుంచి 25వేలు వసూలు చేస్తుండటంపై క్రీడా సంఘాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

కోచ్‌లపై అదనపు భారం

క్రీడాప్రాధికార సంస్థకు చెందిన కోచ్‌లు నిత్యం సంబంధిత ఆటల్లో శిక్షణ ఇవ్వాలి. పే అండ్ ప్లే విధానంతో ఫొటోలు అప్‌లోడ్, యాప్‌లలో సాధించిన ప్రగతిని ఉదయం, సాయంత్రం తెలియజేయాల్సి వస్తోంది. దీనికితోడు క్రీడాకారుల వద్ద నుంచి ఫీజులు వసూలు చేయడంతోపాటు, పాఠశాలలు, కళాశాలలు నగదు చెల్లించి తిరిగి క్రీడాకారుల స్టేడియానికి వచ్చేలా మరో అదనపు పనిభారాన్ని మోపారు. దీంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఫీజు చెల్లించలేని విద్యార్థుల ఫీజులను కూడా కోచ్‌లు భరించాల్సిందేనని ఇక్కడి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు ఆదేశించడంతో అదనపు భారం మోయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో క్రీడాభివృద్ధిపై ఆశలు పెంచుకున్నారు. కానీ ఇప్పటి వరకూ పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఆ విధానాన్ని తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆటల అభివృద్ధికి తోడ్పాటు అందించడంతోపాటు, మైదానాల మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని క్రీడాకారులు, కోచ్‌లు, విద్యార్థులు కోరుతున్నారు.

మిరపకు స్వస్తి.. పొగాకుపై ఆసక్తి

● మండలంలో పెరిగిన బర్లీ సాగు ● నష్టాలతో రూటు మార్చిన రైతులు

పంగులూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బర్లీ పొగాకు సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మిరప సాగు తగ్గడం, రైతులు విస్తారంగా పొగాకు సాగుకు సన్నద్ధం కావడంతో పొగ నారుకు మార్కెట్లో గిరాకీ పెరిగింది. గత ఏడాది బర్లీ పొగాకు సాగు చేసిన రైతాంగం మంచి లాభాలు గడించడంతో అధిక శాతం రైతులు పొగాకు సాగుకు మొగ్గుచూపుతున్నారు. గత ఏడాది వెయ్యి నుంచి 1100 ఎకరాలలో సాగైన పొగాకు ఈ ఏడాది నాలుగు వేల ఎకరాలలో పొగాకు సాగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మిరప సాగులో పడిన కష్టాలు, చవిచూసిన నష్టాలతో రైతులు మిరపకు స్వస్తి పలికారు.

గత ఏడాది సుమారు రెండు వేల ఎకరాలలో మిరప సాగు చేసిన రైతాంగం ఈ ఏడాది 300 ఎకరాలకు పరిమితమయ్యారు. మిరపసాగులో పెరిగిన పెట్టుబడి, పురుగు, తెగుళ్ల బెడదతో ఆశించిన దిగుబడులు రాని పరిస్థితితో పాటు మార్కెట్లో దిగజారిన ధరలతో మిరప సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టాలు చవిచూశారు. పొగాకు సాగులో పంట నష్ట పోయే పరిస్థితి ఉండదని, సాగు చేసిన 60 రోజుల కాలవ్యవధిలో చేతికొచ్చిన పొగాకు అమ్మకాలతో రైతుకు కలిగే పెట్టుబడి వెసులుబాటు, మార్కెట్లో పొగాకుకు ఉన్న గిరాకీతో రైతులు ఆ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో గత ఏడాది చందలూరులో 800 ఎకరాలలో మిరప సాగు చేసిన రైతులు ఈ ఏడాది 100 ఎకరాలకు పరిమితం కాగా, కొప్పెరపాడులో 300 నుంచి 50 ఎకరాలకు, నూజెళ్లపల్లిలో 600 నుంచి 350 ఎకరాలకు, బూదవాడలో 450 నుంచి 100 ఎకరాలకు మిరప సాగు తగ్గడం జరిగిందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు తెల్ల బర్లీ సాగు చేయాలనే సూచన చేస్తున్నప్పటికీ గత ఏడాది తెల్ల బర్లీ, నల్ల బర్లీ కొనుగోలులో వ్యత్యాసం లేక పోవడంతో దిగుబడి అధికంగా ఉండే నల్ల బర్లీ వైపు రైతాంగం మొగ్గు చూపుతున్నారు. మండల కేంద్రమైన పంగులూరు, చందలూరు, నూజెళ్లపల్లి, కొప్పెరపాడు, బూదవాడ పరిసర గ్రామాలలో పొగాకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు.

సాగు విస్తీర్ణం పెరగడంతో నారుకు పెరిగిన గిరాకీ

బర్లీ పొగాకు సాగు విస్తీర్ణం పెరగడంతో మార్కెట్లో పొగ నారుకు గిరాకీ పెరిగింది. సాగు పెరగడంతో పాటు ముందుగా వేసిన పొలాలలో అధిక వర్షాలకు నాటిన పొగ మొక్కలు దెబ్బతినడంతో పొగనారుకు గిరాకీ పెరిగింది. పంగులూరులో పొగనారుకు గిరాకీ ఉంటుందని భావించిన పలువురు రైతులు బోర్ల కింద పొగనారును విస్తారంగా సాగు చేశారు. పొగనాట్లు ముమ్మరం కావడంతో రైతులు నారుకోసం పొగ నారుమళ్ల వైపు పరుగులు పెడుతున్నారు.



పంగులూరు పొలాల్లో నారుమళ్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగనారు



చందలూరులో పొగ మొక్కలు నాటుతున్న కూలీలు

ఈశ్వరుడు ప్రియం... దర్శనం పిరెం

భక్తుల ప్రయాణం ఇబ్బందికరం

పెద్ద దోర్నాల, నవంబరు 10: నల్లమలలో కొలువైన భ్రమరాంబికా మల్లికార్జునుడు అంటే భక్తులకు అపారమైన ప్రియం. ఆదిదంపతులను దర్శనం చేసుకోవాలంటేనే ప్రయాణ ఖర్చు సామాన్యులకు భారంగా మారింది. ఒంగోలు, కర్నూలు నుంచి సుమారు 125 కిలోమీటర్లు దూరం ప్రయాణం చేసిన ఖర్చుకు మించి కేవలం దోర్నాల నుంచి శ్రీశైలానికి 50 కిలోమీటర్లు దూరం ప్రయాణానికి ఆర్టీసీ అధిక చార్జీ వసూలు చేస్తోంది. దీంతో సామాన్య భక్తులు శ్రీశైలానికి వెళ్లాలంటేనే చార్జీల మోతకు జంకుతున్నారు. ఘాట్ రోడ్డులో ప్రయాణం సాకుతో ఆర్టీసీ అదనపు చార్జీలు వసూలు చేస్తోంది. ఆర్డినరీ సర్వీసు బస్సులో మాత్రం చార్జీలు అందుబాటులో ఉన్నాయి. ఆర్డినరీలో దోర్నాల నుంచి శ్రీశైలానికి రూ.65. ఎక్స్‌ప్రెస్‌లో రూ.165, సూపర్ లగ్జరీలో రూ.220లకుపైగా చార్జీలున్నాయి. ఒంగోలు నుంచి 125 కిలోమీటర్ల దూరం దోర్నాలకు రూ.175 నుంచి రూ.185 వరకు ఉండగా, దోర్నాల నుంచి 50 కిలోమీటర్ల దూరంలోని శ్రీశైలానికి కేటగిరీని బట్టి రూ.165 నుంచి రూ.220 వరకు వసూలు చేస్తున్నారు. ఒంగోలు నుంచి ఎక్స్‌ప్రెస్‌కు రూ.300, సూపర్ లగ్జరీకి రూ.379 వసూలు చేస్తున్నారు. దీంతో భక్తులకు చార్జీల భారం తడిసి మోపెడవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కార్తీకమాసం, శివరాత్రి, ఉగాది పర్వదినాల్లో దేశం నలుమూలల నుంచి శ్రీశైలం వెళ్లేందుకు భక్తులు అధిక సంఖ్యల్లో వస్తుంటారు. ఆర్డినరీ సర్వీసులు ఎప్పుడు చూసినా కిక్కిరిసి ఉంటున్నాయి. ఎక్స్‌ప్రెస్, లగ్జరీల్లో చార్జీలు ఆర్డినరీకి మూడింతలు ఉండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శ్రీశైలానికి వెళ్లేందుకు ప్రవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న యాత్రికులు

ఇతర ప్రాంతాల నుంచి దోర్నాల వచ్చిన ప్రయాణికులు అక్కడ నుంచి శ్రీశైలం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కి చార్జీల ధరలు చూసి ఖిన్నులవుతున్నారు. కానీ మరో ఆర్డినరీ సర్వీసు ఎప్పుడు వస్తుందో తెలియక ఎంతైనా చార్జీలు చెల్లిస్తూ శివశివా అంటున్నారు. ముఖ్యంగా అటవీ ప్రాంతంలోని చింతల, తుమ్మలబయలు, చిన్నారుట్ల, మర్రిపాలెం, పెద్దచామ గ్రామాల్లో నివశించే చెంచు గిరిజనుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆర్డినరీ బస్సు కోసం వేచి ఉంటే మార్కాపురం డిపో నుండే యాత్రికులు కిక్కిరిసి వస్తున్నారు. సీట్లు ఖాళీలు లేకపోవడంతో ప్రవేటు వాహనాలనే ఆశ్రయించక తప్పడం లేదు. వారు కూడా అదనపు చార్జీలు వసూలు చేస్తున్నా గత్యంతరం లేక గిరిజనులు అబోదిబోమంటున్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆర్డినరీ సర్వీసులు పెంచాలని యాత్రికులు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న వర్షపునీటి కుంట



రియల్టర్లు పూడ్చి వేసిన తూము

రియల్టర్ల ఆక్రమణలతో జాతీయ రహదారికి బీటలు

● కాల్వలు ఆక్రమించిన రియల్టర్లు ● వర్షపునీరు పోయే తూము పూడ్చివేత ● కుంగిన ఎన్‌హెచ్ 565

పెద్దారవీడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'వెలిగొండ ప్రాజెక్ట్ త్వరలో పూర్తికానుంది. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయనున్నారు' అన్న ప్రచారంతో మార్కాపురం మీదుగా వెళుతున్న జాతీయ రహదారి 565 వెంబడి రియాల్టర్లు స్థిరాస్థి వ్యాపారం జోరు పెంచారు. ఏకంగా మార్కాపురం మండలం రాయవరం నుంచి పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు మధ్యలో జాతీయ రహదారి వెంబడి వర్షపునీరు బయటకు పోయే కాలువలను కూడా ఆక్రమించారు. వర్షపునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక జాతీయ రహదారి పక్కన కుంట్లో నిల్వ ఉంటోంది. ఫలితంగా భారీ వాహనాలు వెళ్లేటప్పుడు రోడ్డుకు బీటలు పడుతున్నాయి. జాతీయ రహదారి-565కు రాయవరం-దరిమడుగు గ్రామల మధ్యలో 205-2 తూము నుంచి వర్షపునీరు వెళ్లే కాల్వను రియల్టర్లు ఆక్రమించి ప్లాట్లుగా మార్చారు. తూము పూడి పోయింది. గత నెలలో అల్పపీడనం కారణంగా కురిసిన వర్షానికి రోడ్డు తటాకాన్ని తలపించే విధంగా మారింది. కుంటల్లో నీరు నిల్వ ఉండటంతో అధిక లోడు వాహనాల బరువుకు రోడ్డు బీటలు వారి కుంగింది. జాతీయ రహదారి వెంబడి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోతే మొత్తం రోడ్డు మనుగడకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని, రహదారి నిర్మాణ విభాగంలో నైపుణ్యత ఉన్న ఓ ఇంజనీర్ అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి కాల్వల ఆక్రమణలను తొలగించి తూముల నుంచి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

కేజీబీవీ విద్యార్థుల ఆకలి కేకలు

» గ్యాస్ సిలిండర్ రాక ఆలస్యంగా అల్పాహారం

» ఇటీవల ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటనలో వెలుగు చూసిన లోపాలు

» అయినా మారని నిర్వాహకుల తీరు

చీరాలటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని జాతీయ రహదారి ఈపూరుపాలెం వద్ద గల కేజీబీవీ స్కూల్ విద్యార్థులు ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. శనివారం రాత్రే గ్యాస్ సిలిండర్ కొరత ఏర్పడింది. ఈక్రమంలో ఆదివారం ఉదయానికి అప్రమత్తమై జాగ్రత్తలు చేపట్టాల్సిన నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఉదయం ఎనిమిది గంటలకు అందించాల్సిన అల్పాహారం 10 గంటల వరకు అందలేదు. దీంతో హాస్టల్లో ఉన్న సు మారు 250 మంది విద్యార్థినులు ఆకలితో అలమటించారు. సమాచారం అందుకున్న మీడియా ప్రతినిదులు అక్కడికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అయితే విషయం ఎక్కడ వైరల్ అవుతుందోనని హాస్టల్లో ఆడపిల్లలున్నారంటూ గేట్లు మూసేశారు. అయితే అప్పటికే విష యం కలెక్టర్ వెంకటమురళి దృష్టికి వెళ్లడంతో ఆయన ఆగ్రహించినట్లు సమాచారం. దీంతో అప్పుడు చలనం కలిగిన నిర్వాహకులు గ్యాస్ ఏజెన్సీ వారిని సంప్రదించి అప్పటికప్పుడు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల సాక్షాత్తు ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటనలో సైతం కుళ్లిన కూరగాయలు వంటకు సిద్ధంగా ఉన్న విషయం తెలిసిందే. అయినా వీరి తీరు మారకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సిలిండర్ కోసం పడిగాపులు కాస్తున్న వంట సిబ్బంది

తేలని పంచాయితీ

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగుల నుంచి అప్పటి అధికారి, కొందరు ఉద్యోగులు పెద్దమొత్తంలో వసూలు చేశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రిసభ్య కమిటీని నియమించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో విచారణ చేపట్టిన కమిటీ అక్రమాలు నిజమేనని తేల్చింది. నివేదికను కలెక్టర్‌కు సమర్పించింది. దాన్ని పరిశీలించిన కలెక్టర్.. ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీరాజ్ కమిషనర్‌కు 15 రోజుల క్రితం లేఖ రాశారు. దానికి త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికను కూడా జతచేసి పంపారు. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి స్పందన లేదు. విచారణ ముగిసే లోపే ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. అప్పట్లో డీపీవోగా ఉన్న ఉషారాణిపై చర్యలకు కలెక్టర్ సిఫార్సు చేశారు.

ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని ఉద్యోగుల విజ్ఞప్తి

ప్రభుత్వ ఉద్యోగులకు సర్వీసు అనేది ఎంతో ముఖ్యమైంది. భవిష్యత్ ఉద్యోగోన్నతుల్లో దాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. ప్రస్తుతం గాలిలో ఉన్న ఉద్యోగులకు 50 రోజుల నుంచి పోస్టింగ్‌లు లేకపోవడంతో భవిష్యత్‌లో ఉద్యోగోన్నతులు కోల్పోతామని వారంతా ఆందోళన చెందుతున్నారు. వీరికి పోస్టింగ్‌లు ఇప్పించే విషయంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా కూడా మరింత చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పెళ్లి బస్సుబోల్తా ఏడుగురికి స్వల్ప గాయాలు

మార్కాపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న పెళ్లి బస్సును వెనుక నుంచి డీసీఎం లారీ ఢీకొనడంతో బస్సు బోల్తా పడింది. ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని తిప్పాయపాలెం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం బీజంవేముల గ్రామానికి చెందిన పెళ్లి బృందం ట్రావెల్ బస్సులో నరసరావుపేటలో జరిగే వివాహానికి వెళుతోంది. మండలంలోని తిప్పాయపాలెం- జంగంగుంట్ల మధ్య కాలకృత్యాలు తీర్చుకొనేందుకు డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపారు. ఈ సమయంలో పెళ్లి బస్సును వెనక నుంచి వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టడంతో బస్సు పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో బస్సులో ఉన్న పెళ్లిబృందంలో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మిగిలినవారు క్షేమంగా బయటపడ్డారు. క్షతగాత్రులను వైద్యం నిమిత్తం స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

పొదిలి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : పొదిలి పట్టణంలో ఈనెల 19న నిర్వహించనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా 20వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పిలుపునిచ్చారు. పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. నాటి నుంచి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై అనేక ఉద్యమాలు పోరాటాలు చేసిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని, విద్యార్థుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొదిలిలో జరిగే సభలో అనేక సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారన్నారు. కనుక ప్రతి ఒక్క విద్యార్థి తమ భావిభారత భవిష్యత్‌కోసం ఈ మహాసభలలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

మత్తు తలకెక్కింది!

» రామాపురం సముద్రతీరంలో యువకుడి హల్‌చల్

» ప్రమాదం నుంచి రక్షించిన పోలీసులు

» ఏరియా వైద్యశాలకు తరలింపు



ఏరియా వైద్యశాలలో అపస్మారక స్థితిలో గోపీ

రామాపురం (చీరాలటౌన్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సరదాగా స్నేహితులతో రామాపురం సముద్రతీరంలో ఈతకు వచ్చి మద్యం మత్తులో యువకుడు హల్‌చల్ చేశాడు. ఈక్రమంలోనే ప్రమాదబారిన పడుతున్నట్లు గ్రహించిన పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పసుమర్తికు చెందిన గుంజి గోపీ తన తమ్ముడు అంకమ్మరావు, స్నేహితులు శ్రీకాంత్, శ్రీనుతో కలిసి నలుగురు రెండు ద్విచక్ర వాహనాలపై రామాపురం బీచ్‌కు ఆదివారం వచ్చారు. ఈక్రమంలో మద్యం సేవించిన గోపీ సాధారణ స్థితిని కోల్పోయాడు. దీంతో సముద్రంలోకి వెళ్లి హల్‌చల్ చేశాడు. నీళ్లు తాగి అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే స్పందించిన రూరల్ ఏఎస్సై శివకుమారి, మెరైన్ పోలీసులు అతడిని సముద్రంలో నుంచి బయటకు తెచ్చారు. వెంటనే 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం అతను అపస్మారక స్థితిలోనే ఉన్నాడు.

ప్రమాదాల బారిన పడకండి

- శేషగిరిరావు, రూరల్ సీఐ

కార్తీకమాసం సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులు, మందు బాబులు జాగ్రత్తలు పాటించాలి. నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే స్నానాలు చేయాలి. భిన్నంగా వ్యవహరించి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. సముద్రతీరంలో భక్తుల రక్షణ కోసం అన్ని జాగ్రత్తలు తీసు కున్నాం. గట్టి బందోబస్తును ఏర్పాటు చేశాము.



- ఖరీదైన 'మూడు ముళ్ల బంధం'
- పిలుపుల నుంచే ఆర్భాటం... హంగులు..
- ఖర్చులో పోటీ పడుతున్న తల్లిదండ్రులు
- కళకళలాడే మండపాలు, ఖరీదైన డెకరేషన్లు
- పదిమంది చెప్పుకునేలా ఉండాలనే ఆరాటం
- ఈనెల, వచ్చే నెలలో అధికంగా ముహూర్తాలు

కల్యాణ వైభోగమే!



వివాహం ప్రతి ఒక్కరి జీవితాల్లో మరుపురానిది. ఒక అద్వితీయమైన వేడుక. అందుకే చాలా మంది పెళ్లి విషయంలో పోటీపడుతూ ఆడంబరాలను చాటుకుంటున్నారు. కట్నకానుకల నుంచి కల్యాణ మండపాల వరకు లక్షలు ఖర్చు చేస్తున్నారు. విందూ వినోదాలు, అతిథులు, ఆత్మీయుల కోసం నోరూరించే వంటకాలు, ఖరీదైన దుస్తులు, కళకళలాడే కల్యాణమండపాలు... ఇలా పదికాలాలపాటు గుర్తుండిపోయేలా... పదిమంది చెప్పుకునేలా జరిగే పెళ్లి సంబరం కోసం తల్లిదండ్రులు ఆరాటపడుతున్నారు. అందుకోసం పిలుపుల నుంచి పెళ్లి వరకు పెడుతున్న ఖర్చుతో మూడు ముళ్ల బంధం మరింత ఖరీదైపోయింది. ఈనెల, వచ్చే నెలలో అధికంగా శుభకార్యాలకు ముహూర్తాలు ఉండగా, పురోహితుడు నుంచి పిలుపుల వరకు, కల్యాణ మండపం నుంచి క్యాటరింగ్ వరకు ఇలా ప్రతి ఒక్కరికీ డిమాండ్ పెరగనుంది. నవంబరులో 9,10,13,14,17,22,24 తేదీల్లో, డిసెంబరులో 4,5,6,7,11,14,15,20,22,25 తేదీల్లో ముహూర్తాలు ఉండగా, వందలాది జంటలు ఒక్కటి కానున్నాయి.

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పళ్లంటే పచ్చని పందిళ్లు. ప్రేమగా పలకరింపులు, అయినవాళ్లతో ముచ్చట్లు, భాజా భజంత్రీలు, మూడు ముళ్లు, ఏడు అడుగులు, మరపురాని అనుభూతులు... ఇవి నిన్న మొన్నటి వరకు పెళ్లింట కనిపించే కబుర్లు, ఇపుడు కాలం మారిపోయింది. కంప్యూటర్ యుగం, అంతా స్పీడు. అంతకుమించి స్టేటస్ వచ్చింది. కల్యాణ వేడుకలకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. పెద్దోళ్ల పెళ్లిళ్లు పది మంది చెప్పుకునేలా ఉంటుండగా, మధ్యతగరతి వారు సైతం పెళ్లి వేడుకలను పండుగలా ఉండాలని భావిస్తున్నారు. దీంతో ఆత్మీయతకన్నా, ఆర్భాటాలకు వేదికలుగా మారాయి. పెళ్లి అంటే తమ ఆర్థిక స్థాయిని ప్రదర్శించుకునేలా తయారవుతున్నాయి. రాజకీయ నాయకుడి దగ్గర నుంచి కాంట్రాక్టర్‌లు, ప్రభుత్వ ఉన్నతస్థాయి ఉద్యోగులు, రియల్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కుటుంబాల ఇలా డబ్బులు పోగేసుకున్నవారంతా వివాహ వేడుకలకు కోట్లు ఖర్చు చేస్తున్నారు. దీంతో పెళ్లి పిలుపుల నుంచి కల్యాణ వేదిక వరకు గొప్పలు చాటుకుంటున్నారు. దీంతో నేటి రోజుల్లో కట్నకానుకల కంటే రెట్టింపుగా కల్యాణ వైభోగం చాటుతున్నారు. అయినవాళ్లు, ఇరుగు పొరుగు వారి మధ్య తమ పోటీతత్వాన్ని చాటుకుంటున్నారు.

పిలుపుల నుంచే ఆర్భాటాలు

పది సంవత్సరాల క్రితం వరకు పెళ్లి పిలుపు అంటే ఓ సంప్రదాయం ఉండేది. కార్డు చేత పట్టుకని ఇంటికొచ్చి మరీ ఆహ్వానించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పిలుపుల నుంచే ఖరీదు కనిపిస్తుంది. గతంలో రూ.5 నుంచి రూ.25 వరకు ఉండే పెళ్లి కార్డు ఇప్పుడు రూ.100 చేరుకుంది. వాటితోపాటు అందుబాటులోకి వచ్చిన ఆధునిక పరిజ్ఞానంతో వాట్సాప్ ఆహ్వానాలు, వధూవరుల ఫొటోలతో వీడియో ఆహ్వానాలు, ఫోన్‌కాల్‌తో పిలుపులు సర్వసాధారణం అయ్యాయి. తమ ఆర్థిక శక్తి సామర్థ్యాన్నిబట్టి పెళ్లికి విచ్చేసేవారికి రిటన్ గిఫ్ట్ (బహుమతులు) కూడా అందించే రోజులు వచ్చాయి. దీంతో మధ్యతరగతి కుటుంబాల్లో సైతం ఒక్కో పెళ్లికి కట్నకానుకలు పక్కనపెడితే వేడుకలకు అయ్యే ఖర్చు రూ.10 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు పెరిగింది.



ఖరీదైన మండపాలు..

ఒకరోజు సాధారణ కల్యాణ మండపానికి రూ.లక్ష రూపాయల నుంచి రూ.1.5 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇక సెంట్రల్ ఏసీ కల్యాణ మండపాలకు రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు అద్దెలు చెల్లిస్తున్నారు. విద్యుత్ దీపాల వెలుగులు, ఆకర్షించే అందమైన పూల అలంకరణలు, స్టేజీ డెకరేషన్‌లకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. వధూవరుల ఇంటి వద్ద నుంచి కల్యాణ మండపం గుర్రపు బండి, ప్రత్యేక వాహనాలపై ఊరేగింపులు, వాటితోపాటు మేళతాళాలు, డీజేలు, ఇక మండపంలో పాట కచ్చేరీలతో ఆకర్షణీయమైన వాటిపై ఆసక్తి చూపుతున్నారు.

నోరూరించే వంటకాలకు ప్రాధాన్యం



మధ్యతరగతి వారి నుంచి ధనవంతుల వరకు ప్లేటు భోజనం రూ.150 నుంచి రూ.300 వరకు ఖర్చు చేస్తుండగా, డబ్బున్నోళ్లు మాత్రం ఒక్కో ప్లేటు భోజనం రూ.500 నుంచి రూ.700 వరకు వెచ్చిస్తున్నారు. ఇదివరకటిలా విస్తరాకుల్లో పెట్టడానికి ఇష్టపడటం లేదు. ఒక ప్లేట్‌కు రూ.10 నుంచి రూ.35 వరకు ఖర్చు చేస్తున్నారు. స్వీటు, హాటు, నుంచి బిర్యానీ, నాన్‌వెజ్ కూరలు, వీటితోపాటు ప్రత్యేకంగా టిఫిన్ కౌంటర్‌లు, దోశ, చపాతీ, పుల్కా, మరోవైపు స్నాక్స్‌గా ఐస్‌క్రీమ్ రుచులు, అన్నీ ఆరగించాక ఓ పాన్. ఇది ఇటీవల కాలంలో ట్రెండ్‌గా మారిపోయింది. విచ్చేసే అతిథుల కోసం మ్యూజికల్ పార్టీ, యాంకర్‌లతో హడావిడి, వధూవరులతో స్టెప్‌లు వేయించడంతో అన్నీ ఖరీదుగా మారాయి.

చెదిరిపోని తీపి గుర్తుల కోసం



కళ్లముందు ఇంట్లో జరిగే వేడుక కలకాలం ఉండాలంటే కచ్చితంగా ఫొటోలు, వీడియోలు ఉండాల్సిందే. ఒకప్పుడు ఒక ఫొటోగ్రాఫర్, ఓ వీడియో గ్రాఫర్, పెళ్లితంతు పూర్తయ్యాక ఓ ఆల్బమ్.. ఇంతకుమించి పెద్దగా కనిపించేవి కావు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. పెళ్లికి వారం ముందు నుంచే వధూవరుల ఇళ్ల వద్ద హడావిడి, సాధారణ పెళ్లి వేడుకకే ఫొటో, వీడియో, ఆల్బమ్‌లకే సుమారుగా రూ.లక్ష అవుతుండగా, ప్రస్తుతం ఫొటోలకే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్, డ్రోన్‌లతో షూటింగ్ కోట్లు ఖర్చు చేసి తీసే సినిమా తరహాలో వివాహ వేడుకల వీడియోలు ఇప్పుడు సర్వసాధారణం అయ్యాయి. పది మంది ఫొటో గ్రాఫర్లు, ఐదారుగురు వీడియో గ్రాఫర్‌లు, ఔట్‌డోర్ షూట్‌లు, సినిమా తరహాలతో పాటలు ఇలా ఓ మినీ మూవీనే తీసేస్తున్నారు. అయితే ఈ వేడుక అంతా అందరు వీక్షించేందుకు పెళ్లి సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్ర్కీన్‌లపై ప్రదర్శించి, తమ శక్తి సామర్థ్యాలను, పిల్లలపై తమ ప్రేమను లక్షలు ఖర్చు చేసి మరీ చూపుతున్నారు.

సంప్రదాయాల విలువలు తగ్గడం లేదు



సంప్రదాయాలను గౌరవిస్తూనే, నేటి తరానికి అనుగుణంగా హంగూ, ఆర్భాటాలు పెరిగాయి. ఇంట్లో శుభకార్యం అంటే వారం రోజులు పండగే. ముహూర్తం పెట్టినప్పటి నుంచి ఆ ఇంట్లో సంబరమే కనిపిస్తుంది. మంగళ స్నానాలు, మెహెందీలు, ప్రీ వెడ్డింగ్ షూట్‌లు, కల్యాణమండపంలో పాట కచ్చేరీలు, ఇలా ఏమి ఉన్నా, ముహూర్తానికి మాత్రం ఆ మూడు ముళ్ళు పడాల్సిందే. అంటే తెలుగు సంప్రదాయాలు, కట్టుబాట్లుకు గౌరవం నిలిచి ఉంది.

\- పరాంకుశం రమాకాంత్, ప్రధాన అర్చకులు
శ్రీ ప్రసన్నచెన్నకేశవ స్వామి ఆలయం

డెకరేషన్‌కు కనీసం రూ. 10లక్షలకు తగ్గడం లేదు



ఇదివరకు పెళ్లికి డెకరేన్‌కు రూ. లక్ష నుంచి రూ.2 లక్షలు ఖర్చు అంటే అమ్మో అంతనా? అనేవారు. ఇపుడు కనీసం కేవలం పూల డెకరేషన్‌కు రూ.10 లక్షలు ఖర్చు పెట్టడానికి కూడా వెనుకాడం లేదు. ఇక మండపం, ఇతర సెట్టింగ్స్, మ్యూజికల్ ఈవెంట్స్ కోసం కనీసం రూ.30 లక్షలకుపైనే ఖర్చు పెడుతున్నారు. ఈ రోజుల్లో పెళ్లి అంటే సినిమా సెట్టింగ్‌లా ఉండాలని అందరు కోరుకుంటున్నారు, దాని ద్వారా డెకరేషన్‌కు డిమాండ్ పెరిగింది. ఒక్కోరోజు ఎక్కువ పెళ్లిళ్లు ఉంటాయి. అలాంటపుడు ఎక్కువమందిని ఏర్పాటు చేస్తాం. పెళ్లి ఖర్చులో డెకరేషన్ ప్రధానంగా కనిపిస్తుంది. అందుకే ఎవరూ డబ్బులకు వెనుకాడరు.

\- మోడుబోయిన బాల,
నిత్యశ్రీ ఈవెంట్స్, ఒంగోలు

అక్కడ ఆక్రందన.. ఇక్కడ ఆందోళన

- కర్ణాటక పొగాకు మార్కెట్లో అలజడి
- లోగ్రేడ్ ధరలు, నోబిడ్‌లపై రైతుల అసంతృప్తి
- ఆంధ్ర మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం
- జిల్లా రైతుల్లో అలజడి



కర్ణాటకలోని పరియాపట్నం వేలం కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఒంగోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక పొగాకు మార్కెట్లో అలజడిగా నెలకొంది. అక్కడ వేలం కేంద్రాలు తెరుచుకొని నెల దాటినా పది మిలియన్ కిలోలకు మించి పొగాకు కొనుగోలు చేయలేకపోయారు. నిత్యం పలు వేలం కేంద్రాల్లో నోబిడ్ బేళ్లు భారీగా ఉంటున్నాయి. లోగ్రేడ్ ధరలు రైతులు ఆశించిన విధంగా లేకపోవడంతో అందుకు ప్రధాన కారణం. దీంతో అక్కడి పొగాకు రైతులు ఆందోళనకు దిగుతున్నారు. పెరియపట్నంలోని వేలం కేంద్రానికి శనివారం పెద్దఎత్తున తరలివచ్చి ముట్టడించారు. మైసూరు పార్లమెంట్ సభ్యుడు జేకే చాయరాజ్ వడయార్ కూడా ఆందోళనలో పాల్గొని రైతులకు మద్దతు తెలపడం అక్కడి మార్కెట్లో పరిణామాలకు అద్దంపడుతోంది. గడిచిన రెండు సీజన్‌లుగా కర్ణాటకలో పంట ఉత్పత్తి తగ్గి ధరలు కాస్తంత బాగానే లభించాయి. వరుసగా ఏటా 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అక్కడి పొగాకు బోర్డు అనుమతివ్వగా 2022-23లో సుమారు 60 మిలియన్ కిలోలు మాత్రమే పండింది. సగటున కిలోకు రూ.237 ధర లభించింది. 2023-24లో సుమారు 83 మిలియన్ కిలోలు ఉత్పత్తి జరగ్గా మంచి డిమాండ్ ఏర్పడి సగటున కిలోకు రూ.254 ధర దక్కింది. ప్రస్తుత సీజన్ (2024-25)లో కూడా 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతివ్వగా 105 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనాతో గత నెల 7న వేలం ప్రక్రియను బోర్డు ప్రారంభించింది.

ఆరంభంలో మెరుగైన ధరలు

కర్ణాటకలో ఈ సీజన్ కొనుగోళ్ల ప్రారంభంలో మంచి ధరలే లభించాయి. గత ఏడాది కిలో రూ.240కు కొనుగోలు చేసిన వ్యాపారులు.. ఈ ఏడాది తొలిరోజున ఏకంగా రూ.290 ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం కూడా ఆయా వేలం కేంద్రాల్లో గరిష్ఠ ధర కిలో రూ.290 నుంచి రూ.292 వరకూ ఉంది. ఇప్పటి వరకూ సుమారు 10 మిలియన్ కిలోల పంట కొనుగోలు చేయగా సగటున కిలోకు రూ.269 వరకూ లభిస్తోంది. అయితే లోగ్రేడ్‌కు సరైన ధరలు లేక అక్కడి రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గడిచిన సీజన్‌లో ఆంధ్రా మార్కెట్‌లో లోగ్రేడ్ ధరలు కిలో రూ.270 వరకూ పలికాయి. అయితే కర్ణాటకలో మాత్రం ప్రస్తుతం లోగ్రేడ్ ధర కిలో రూ.230కి అటుఇటుగా ఉంది. అక్కడి రైతులు ఇదే రకం పొగాకును ఎక్కువగా వేలం కేంద్రాలకు తెస్తుండగా సరైన ధరలు లభించడం లేదు. దీంతో బోర్డు అధికారులు వాటిని నోబిడ్ చేస్తున్నారు. పలు వేలం కేంద్రాల్లో 20 నుంచి 25 శాతం బేళ్లు నిత్యం నోబిడ్ అవుతున్నాయి. వారంరోజులుగా ఈ పరిస్థితి అక్కడి వేలం కేంద్రాల్లో కనిపిస్తోంది.

అసంతృప్తితో రైతుల ఆందోళన

ఆశించిన విధంగా లోగ్రేడ్ ధరలు లేకపోవడం, మరోవైపు నోబిడ్‌లు ఎక్కువగా ఉండటంపై కర్ణాటక రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిత్యం పలు వేలం కేంద్రాల వద్ద ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నారు. శనివారం పెరియపట్నం వేలం కేంద్రాన్ని ముట్టడించారు. పరిస్థితి ఒకింత తీవ్రంగా ఉండటంతో పెరియపట్నంలో సోమ, మంగళవారాల్లో వేలాన్ని బోర్డు అధికారులు తాత్కాలికంగా నిలిపేశారు. ప్రస్తుత కర్ణాటక మార్కెట్లో నెలకొన్న పరిస్థితి రానున్న ఆంధ్ర మార్కెట్‌పై అధిక ప్రభావం చూపే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా కొంత పంట ఉత్పత్తి పెరిగినట్లు తెలుస్తున్న నేపథ్యంలో డిమాండ్ ఉన్న గ్రేడ్ వైపే వ్యాపారులు చూస్తున్నారు. లోగ్రేడ్ గురించి పట్టించుకోవడం లేదు. రానున్న ఆంధ్ర సీజన్ కొనుగోళ్ల నాటికి అదే పరిస్థితి కొనసాగితే ఇక్కడ మార్కెట్ తీవ్ర సంక్షోభంలో పడొచ్చని ఆ రంగంలోని నిపుణులు చెప్తున్నారు. స్వీయనియంత్రణ పాటించి పంట ఉత్పత్తి తగ్గించుకోకపోతే రానున్న ఆంధ్ర సీజన్‌లో రైతులకు అవస్థలు తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

17 నుంచి పీలేరులో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

టంగుటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పీలేరులో రాష్ట్ర స్థాయి వాలీ బాల్ పోటీలు ఈనెల 17వ తేదీ నుంచి జరుగుతాయని ఏపీ త్రీ ఏ సైడ్ వాలీ బాల్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 17, 21 మహిళా, పురుషుల విభాగంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు.

విద్యార్థులకు అపార్!

- డిజీలాకర్‌కు అనుసంధానం
- డిజిటల్ రూపంలో ధ్రువపత్రాలు
- నకిలీల బెడద నిర్మూలనకు అవకాశం



అపార్ వెబ్‌సైట్

సంతనూతలపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ప్రతి ఒక్కరికీ ఆధార్‌కార్డు ఉంది. ప్రస్తుతం నిత్యజీవితంలో ఆధార్ గుర్తింపు సంఖ్య భాగమైపోయింది. ఇది లేనిదే ఏ పనీ జరగడం లేదంటే అతిశయోక్తి కాదు. ఇదేవిధంగా దేశంలో ప్రతి విద్యార్థికీ 12 అంకెల జీవితకాల గుర్తింపు వ్యవస్థను తీసుకొచ్చేందుకు కేంద్రప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డును తీసుకువస్తోంది. విద్యార్థుల అకడమిక్ పురోగతిని ఎప్పటికపుడు ట్రాక్ చేసి అభ్యాసనను సమర్థంగా నిర్వహించడానికి సహాయ పడేవిధంగా ప్రత్యేక గుర్తింపును ఆవిష్కరించారు. 2020 జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ -వన్ స్టూడెంట్ కార్యక్రమంలో భాగంగా దీనిని రూపొందించారు.

విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు

- వివిధ కారణాలతో విద్యార్థులు పలు విద్యాసంస్థలకు మారుతూ ఉంటారు. అపార్ గుర్తింపు సంఖ్య వివిధ రాష్ట్రాల్లోని విద్యాబోర్డులతో ఏకీకృత వ్యవస్థగా పనిచేస్తుంది. ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు మారేటపుడు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా చూస్తారు.
- అపార్ గుర్తింపుతో విద్యార్థులు డిజీలాకర్‌కు అనుసంధానమవుతారు. విద్యా విషయాలకు సంబంధించిన విజయాలు, ధ్రువీకరణ పత్రాలు డిజిటల్ రూపంలో సురక్షితంగా దాచుకోవచ్చు. ఆయా ధ్రువపత్రాలను ఎక్కడైన డిజిటల్ రూపంలో వినియోగించుకోవచ్చు.
- పిల్లల అకడమిక్ రికార్డుల పర్యవేక్షణ ద్వారా డ్రాపౌట్లను నివారించే అవకాశం ఏర్పడుతుంది. ఏ కారణం చేతనైన విద్యార్థి పాఠశాలకు దూరమైతే తక్షణమే తెలుసుకునే అవకాశం ఉంటుంది.
- రాబోయే రోజుల్లో ఉపకారవేతనాలు, వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో చేరికలు, మార్పులు వంటి అన్ని ప్రక్రియలు, ఈ అపార్ ఆధారంగా నిర్వహించే విధంగా రూపకల్పన చేశారు.
- అపార్ ఐడీ కార్డు స్కాలర్‌షిప్‌లు, డిగ్రీలు, రివార్డులు, ఇతర క్రెడిట్‌లతో సహ విద్యా సంబంధిత డేటాను డిజిటల్‌గా కేంద్రీకరిస్తుంది. క్రెడిట్ స్కోర్‌ను అందిస్తుంది. ఇది ఉన్నత విద్య లేదా విశ్వవిద్యాలయ ప్రవేశపరీక్షలకు ఉపయోగపడుతుంది.
- విద్యార్థులు తమ అకడమిక్ రికార్డులను ఎక్కడి నుంచైనా, ఎపుడైన యాక్సెస్ చేసుకోవచ్చు. విద్యాసంస్థల మధ్య సులభమైన బదిలీలు, ఉద్యోగాలు, ఉన్నతవిద్యకోసం దరఖాస్తు చేసుకునేపుడు, ఈ వ్యవస్థ రియల్ టైం విధానంలో నవీకరించిన ధ్రువపత్రాలను అందిస్తుంది. ఈ విధానం వల్ల నకిలీ ధ్రువపత్రాల బెడదను నిర్మూలించే అవకాశం ఉంటుంది.

తల్లిదండ్రుల ఆధార్ సంఖ్య ఆధారంగా..



వెంకారెడ్డి, ఎంఈవో

ప్రస్తుతం ప్రభుత్వ ప్రైవేట్ తదితర అన్ని విద్యాసంస్థల యాజమాన్యాల నుంచి 9, 10 తరగతుల పిల్లలకు అపార్ గుర్తింపు జారీ కోసం ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా ఈ అపార్ గుర్తింపు సంఖ్యను జారీ చేయనున్నారు. 18 ఏళ్లలోపు విద్యార్థులు మైనర్లు కాబట్టి వారి తల్లిదండ్రుల నుంచి సమ్మతి కోరుతూ అనుమతి పత్రాలు తీసుకుంటున్నారు. ఈక్రమంలో దసరా సెలవులకు ముందు విద్యార్థులకు అనుమతి పత్రాలను అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆధార్ సంఖ్య ఆధారంగా అపార్ గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నారు. ఆధార్ ఆధారంగా ఈ అపార్ గుర్తింపు సంఖ్య జనరేట్ అవుతుంది. ఆధార్‌కు తప్పనిసరిగా మొబైల్ నెంబరు అనుసంధానం అయ్యి ఉండాలి. అలా లేనివారు ముందుగా ఆధార్‌కు మొబైల్ నెంబరును అనుసంధానం చేసుకోవాలని సంతనూతలపాడు ఎంఈవో వెంకారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

డీఎస్పీ విచారణ ప్రారంభం

కారుమంచి(టంగుటూరు) నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఘటనపై ఆదివారం డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలు స్నేహితురాళ్లను ఆయన విచారించారు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లీశ్వరరావు, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి మాధవీలత, మహిళా ఎస్సై అనిత, పాఠశాల హెచ్‌ఎం పాల్గొన్నారు. విచారణ త్వరగా పూర్తి చేసి నిందితుని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైభవంగా పడిపూజ



అయ్యప్పస్వామి విగ్రహానికి అభిషేకం నిర్వహిస్తున్న స్వాములు

ఒంగోలు(రూరల్), నవంబరు10(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంటలోని శ్రీగంగాపార్వతి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గద్దలగుంట బాలకృష్ణ భక్త బృందం వారి పాటకచేరి అలరించింది. స్వామివారికి పూజలతో పాటు అభిషేక కార్యక్రమాలను దేవాలయ ప్రధాన అర్చకుడు ఆమంచి ఉదయ బాస్కర్, నారాయణం కళ్యాణ చక్రవర్తి, వేణుగోపాల్ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు ఫలహారాలను పంచిపెట్టారు. అధిక సంఖ్యలో భవానీ, గోవింద, శివస్వాములు తరలివచ్చారు.

జనసేన పార్టీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

మద్దిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం మద్దిపాడులోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఆరెం వెంకటేశ్వర్లు, నాయకులు సురేష్, అయ్యప్ప, వెంకటేశ్వర్లు, శివశంకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొప్పోలు రోడ్డు గుంతలమయం

వాహనదారుల అవస్థ ● ప్రమాదాలబారిన పడుతున్నవైనం



ఎన్టీఆర్‌కాలనీ దగ్గర, బృందావన్ కాలనీ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

ఒంగోలు(రూరల్), నవంబరు10(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం రైల్వే ఫ్లైఓవర్ వంతెన దగ్గర నుంచి కొప్పోలు వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. పలు చోట్ల గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలతో కొప్పోలు రోడ్డు బాగా దెబ్బతింది. ఈ మార్గం ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అయితే రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలలో వాహనాలు, వాహనదారులు పడి గాయపడుతున్నారు. రాత్రులు ఈ గుంతలు కన్పించకపోవడంతో వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం



పోటీలను తిలకిస్తున్న ప్రేక్షకులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులో రాష్ట్రస్థాయి బాల, బాలికల బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మంగమూరు రోడ్‌లోని లార్డ్‌కృష్ణ షటిల్ అకాడమీలో ఈనెల 14వ తేదీ వరకు అండర్-11 రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయి. అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ ఈ పోటీలు ప్రారంభించారు. క్వాలిఫై మ్యాచ్‌లో సింగిల్స్ విభాగంలో బాలురు 83మంది, బాలికల విభాగంలో 34 మంది, డబ్బుల్ విభాగంలో బాలురు 31, బాలికల విభాగంలో 12 మంది పాల్గొన్నారు. మొదటి రోజు మ్యాచ్‌ల్లో క్రీడాకారులు హోరా హోరీగా తలపడ్డారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ప్రెసిడెంట్ లక్ష్మణిరెడ్డి, జిల్లా కార్యదర్శి విజయ్‌కృష్ణ, రఘుబాబు, దండు శ్రీనివాసరావు, కోడే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పరీక్షలకు శిక్షణ

ఒంగోలు (కల్చరల్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే లోయర్, హయ్యర్ డ్రాయింగ్ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఒంగోలులోని సృష్టి ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు రవీంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. తూనుగుంట నాగమణి, శిరీష ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందని, వివరాలకు 8297090007 నెంబరులో సంప్రదించాలని కోరారు.

రీసర్వే తిప్పలు.. అర్జీల కుప్పలు

- తప్పుల సవరణ కోసం రైతుల విజ్ఞప్తులు
- గ్రామసభల్లో వెల్లువెత్తిన ఫిర్యాదులు
- పరిష్కారం దిశగా అధికారుల చర్యలు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి(ఫైల్)

సంతనూతలపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం కింద ఆర్భాటంగా గ్రామాల్లో రీసర్వే చేపట్టింది. దీంతో భూ సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత పెరగడంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో రీసర్వే పేరిట హడివిడి చేసిన అధికారులు సమస్యలను గాలికి వదిలేయడంతో రైతులు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోలేక, రిజిస్ట్రేషన్లు జరగక నానా తిప్పలు పడుతున్నారు. రీసర్వే చేసిన భూములకు ఇచ్చిన హక్కుపత్రాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ చిత్రాలు ఉండటం, సర్వే సరిహద్దు రాళ్లపైనా కూడా జగన్ చిత్రాలు ముంద్రించారు. హక్కు పత్రాలు తీసుకోకపోవడంతో గ్రామాల్లో పొలాల హద్దుల విషయంలోను రైతుల మధ్యన గొడవలు జరిగాయి. దీంతో వీటిని పరిష్కరించేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం రీసర్వేచేసిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్జీలను స్వీకరించింది. గత నెల 22న ప్రారంభమైన గ్రామసభలు ఈనెల 6తో ముగిశాయి. రీసర్వే చేసిన గ్రామాల్లో గ్రామసభల ద్వారా 500కు పైగా అర్జీలు వచ్చినట్లు సమాచారం. స్వీకరించిన అర్జీలను 45 రోజుల్లో రైతుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు, దానికి సంబంధించి సంబంధిత రెవెన్యూ యంత్రాంగం పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసింది. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం రైతులకు సంబంధించి భూముల రీసర్వేలో గత ప్రభుత్వం చేసిన పొరపాట్లను సరిదిద్దేందుకు క్షేత్రస్థాయిలో ఆయా జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఈక్రమంలో మండలంలో తహసీల్దార్‌తో పాటు కింది స్థాయి రెవెన్యూ సిబ్బంది ఆదివారం సైతం విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రీసర్వే, రెవెన్యూ సమస్యలు రెండూ కలిసి ఉండటంతో సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఎల్‌పీఎం సమస్యలకు సంబంధించి అన్నదమ్ములు, దాయాదుల సమస్యలను వారి సమక్షంలో పరిష్కారించాల్సి ఉంటుంది. అవసరమైతే మళ్లీ సర్వే చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ గ్రామసభల ద్వారా వచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించి న్యాయం చేస్తామని తెలిపారు.

ఒంగోలులో సంగీత కళాశాల ఏర్పాటుకు కృషి

- ఎంపీ మాగుంట



పద్మశ్రీ కన్యాకుమారిని సత్కరిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మేయర్ సుజాత తదితరులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో సంగీత కళాశాల, ఆడిటోరియం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి సుమనస రంజని గానసభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రముఖ నేత్ర వైద్యనిపుణులు, కర్ణాటక సంగీత విద్వాంసులు డాక్టర్ బి.నాగమాధురి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ముందుగా ఎంపీ మాగుంట జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ వైజర్స్ బాలసుబ్రహ్మణ్యం, ప్రఖ్యాత నాదస్వర విద్వాంసులు త్రోవగుంట షేక్ కస్నూర్ మస్తాన్ సాహెబ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రణిత వైజర్స్ గాత్ర కచ్చేరి, సంగీత కళానిధి పద్మశ్రీ అవసరాల కన్యాకుమారి వయోలిన్ కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం ఎంపీ మాగుంట మాట్లాడుతూ సమనసరంజని గానసభ ద్వారా ఇటువంటి గొప్ప కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఒంగోలు నుంచి అనేక మంది కళారంగంలో ఉన్నంతగా రాణిస్తున్నారని తెలిపారు. సంగీత ప్రియకుల కోసం సంగీత కళాశాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అణగారిపోతున్న సంగీత కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మస్తాన్‌దర్గా ఉన్న గోకుల గోపాలకృష్ణ భగవాన్ ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో క్రియేటివ్ కల్చరల్ అకాడమీ నిర్వహించిన హ్యాపీ సండే సినీ మ్యూజికల్ నైట్ కార్యక్రమంలో మాగుంట పాల్గొన్నారు.

18న సచివాలయాల వద్ద ధర్నాలు : సీపీఐ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో టిడ్కో ఇళ్లు, ఇల్లు లేని పేదలకు నివేశన పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన సచివాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం ధర్నాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణప్రాంతాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వమే లబ్ధిదారునికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు, సిమెంట్, ఇసుక, ఇనుము, ఇటుక ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. కరెంటు చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాకమాట మార్చి ప్రజలపై రూ.18వేల కోట్ల భారం వేస్తున్నారని ఆరోపించారు. ఆయా సమస్యలపై ఈనెల 18న జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, ఇన్సాఫ్, ఎంఎసలార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఒంగోలులోని తన కార్యాలయంలో ఆదివారం రాత్రి పేర్నమిట్టకు చెందిన బొమ్మినేని లక్ష్మీనారాయణకు రూ.92,737 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్దిపాడు: మండలంలోని మల్లవరానికి చెందిన పారా హరిక్రిష్ణకు రూ.3.50లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఒంగోలులోని తన కార్యాలయంలో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

త్రిపురాంతకం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వస్తున్న లారీ బోల్తా పడడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన త్రిపురాంతకం మండలంలోని వెల్లంపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకొంది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నుంచి విజయవాడకు మొక్కజొన్న లోడుతో వెళుతున్న లారీ అదుపు తప్పి మార్జిన్‌లోకి బోల్తా పడింది. డ్రైవరు రాజేష్‌కు తీవ్ర గాయాలు అయ్యా యి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు.

26 మద్యం సీసాల పట్టివేత

కంభం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కంభం ఆర్టీసి బస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి అక్రమ మద్యం బాటిళ్లను కలిగి ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నరసింహారావు ఆదివారం తెలిపారు. 26 క్వార్టర్ల మద్యం బాటిళ్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తా.. మహిళ మృతి

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మెట్టబోడుతాండ సమీపంలో జాతీయ రాహదారిపై ద్విచక్రవాహనం బోల్తా పడింది. దీంతో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. నాగర్జునసాగర్ చెంచు కాలానీకి చెందిన మండ్లి లింగమ్మ భర్తతో ద్విచక్రవాహనంపై ఎర్రగొండపాలెం వస్తుండగా మెట్టబోడు తాండ- టోల్‌గేట్ సమీపంలో బోల్తా కొట్టింది. దీంతో లింగమ్మకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స నిర్వహిస్తున్న సమయంలో ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ చౌడయ్య తెలిపారు.

ఆటో, బైక్ ఢీ.. ఒకరి మృతి

పొదిలి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పొదిలి మండలంలోని మల్లవరం గ్రామ సచివాలయం సమీపంలో పాలఆటో, మోటార్‌సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కంభాలపాడు గ్రామానికి చెందిన ఏడుకొండలు(33) పలు గ్రామాల్లో పాలు సేకరించుకొని దర్శి పాలకేంద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మల్లవరం గ్రామ సచివాలయం సమీపంలో ప్రమాదవశాత్తు పొదిలి వైపు వస్తున్న బైక్, పాలవాహనం ఎదురెదురుగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో పాల ఆటో బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్ ఏడుకొండలు అక్కడిక్కడే మృతి చెందాడు. గాయపడిన మరో వ్యక్తిని కొనకనమిట్ల మండలం వద్దిమడుగు గ్రామానికి చెందిన చెన్నుబోయిన బాలకృష్ణగా పోలీసులు గుర్తించారు. ఆయన్ను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేస్తున్నారు.

తీగలేరుకు నిధులు కేటాయించాలి

పుల్లలచెరువు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు నుంచి టీ-5 కాలువ తీగలేరుకు నిధులు కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కాలువ పరివాహక ప్రాంతాలైన కాశీకుంట తండా నుంచి కొమరోలు, ఎండ్లపల్లి, మల్లాపాలెం తదితర గ్రామాల్లో రైతు సంఘం నాయకులు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుల్లలచెరువులోని చిన్నకండ్లేరు చెరువుకు తీగలేరు కాలువను అనుసంధానం చేయాలన్నారు. తద్వారా కరువు సమస్య పరిష్కారం అవుతాయన్నారు. 11,500 ఎకరాలకు సాగునీరు, 60వేల జనాభాకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ కర్రకు గిట్టుబాటు ధర కల్పించాలి

మద్దిపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జామాయిల్ కర్ర కొనుగోలు విషయంలో పాతపద్ధతులను అనుసరించి, రైతులకు గిట్టు బాటు ధరకల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వడ్డే హనుమారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం మార్కెట్లో జామాయిల్ టన్ను కర్ర ఖర్చులు పోను నికర మొత్తం రూ.7500లు రైతులకు అందుతుందన్నారు. గతంలో మార్కెటింగ్ కమిటీల పర్యవేక్షణలో జామాయిల్, సుబాబుల్, సరుగుడు కర్ర అమ్మకాలు జరిగేవన్నారు. కానీ మార్కెటింగ్‌శాఖ ఈ బాధ్యతల నుంచి తప్పుకుని పేపర్ యాజమాన్యాల దయదాక్షిణ్యాలకు వదిలేయడం జరిగిందని, దీనివల్ల రైతులకు నష్టమే తప్ప లాభాలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాల సర్వీస్‌పై ఉచిత శిక్షణ

ఒంగోలు నగరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు సీసీకెమెరా, సెక్యూరిటీ అలారమ్, స్మోక్ డిటెక్టర్ ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్‌పై ఈ నెల 17 నుంచి 29వ తేదీ వరకు 13రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత పురుషులు అర్హులని పేర్కొన్నారు. 18-45 సంవత్సరాలలోపు వయసు, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ శిక్షణకాలంలో ఉచిత వసతితోపాటు భోజన సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు 9492583484 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

సంతనూతలపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మైనంపాడులోని పడమట బజారులో రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డుకు ఆదివారం టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. తమ గ్రామానికి సీసీరోడ్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

హైందవశంఖారావం పోస్టర్ ఆవిష్కరణ

సంతనూతలపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఆదివారం హైందవ శంఖారావం వాల్‌పోస్టర్‌ను విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకులు చక్కా సుబ్బారాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం జనవరి 5న విజయవాడలో జరిగే హైందవాశంఖారావం సభను జయప్రదం చేయాలన్నారు.

గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

మద్దిపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్యాస్ కనెక్షన్ కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ సృజన్‌కుమార్ తెలిపారు. ఈకేవైసీ చేయించుకోవాలని, వారి అర్హత మేరకు ఉచిత సిలిండర్ పొందవచ్చన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్ దగ్గర కూడా ఈకేవైసీ చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

ఒకరికి గాయాలు

మద్దిపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని త్రోవగుంట సమీపంలోని ఆటోనగర్ వద్ద ఆదివారం ఆటో, మోటార్‌సైకిల్ ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. ఒంగోలు నుంచి చీరాల వెళ్తున్న ఆటోకు బ్రేకులు ఫెయిల్ అయ్యి ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగులుప్పలపాడుకు చెందిన సురేష్‌కుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

కూటమి పాలనలో ప్రజలపై భారాలు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్

సంతనూతలపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ప్రజలపై భారాలు, పెట్టుబడిదారులకు వరాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ అన్నారు. ఆదివారం మంగమూరు గ్రామంలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో జరిగిన సీపీఎం మండల మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం పరిపాలన చూస్తే దొందుదొందే అన్నచందాన ఉందన్నారు. రాష్ట్రంలో తిరుపతి లడ్డూ వ్యవహారం బీజేపీ మెప్పుకోసమే తెరపైకి తెచ్చారని ఆరోపించారు. అనంతరం సీనియర్ నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్‌కే.మాబు, కె.అంజనేయులు, బి.పద్మ, కె.పెద్దబ్బాయ్, బి.సుబ్బారావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

చీమకుర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దేవరపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పొత్తూరి బాలకృష్ణ నమోదును ప్రారంభించి మాట్లాడారు. సభ్యత్వ నమోదును విస్తృత స్థాయిలో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖరరెడ్డి, ఐటీడీపీ నాయకులు నరసింహారావు, నాయకులు వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, కోటిరెడ్డి, శివ, వెంకట్రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాగుంటను కలిసిన రూడ్‌సెట్ ప్రతినిధులు



ఎంపీ మాగుంటకు బొకే ఇస్తున్న డైరెక్టర్, ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని జిల్లా రూడ్‌సెట్ సంస్థ ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు ఎంపీ మాగుంటకు బొకే అందజేశారు. కార్యక్రమంలో ఆ సిబ్బంది బాపూజీ, సుధీర్, లీలాకృష్ణ, చందు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు నియోజకవర్గాలకు చెందిన నాయకులు మాగుంటను కలిశారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవం



స్వామివారు

మద్దిపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. 30 మంది దంపతులు పూజలో పాల్గొన్నారు. స్వర్ణనక్షత్ర సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఈవో అంజిరెడ్డి పర్యవేక్షించారు.

జనమన్‌రేగా యాప్‌తో 'ఉపాధి' సమాచారం

సెల్‌ఫోన్‌లో ఒకే క్లిక్‌తో సమాచారం మీచేతిలో..

ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తే వరంగా మారనున్న యాప్

సమగ్ర వివరాలు తెలుసుకునే అవకాశం



జన్‌మన్‌రేగా యాప్ ఫోటో

సంతనూతలపాడు, నవంబరు 10: జాతీయ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం జన్‌మన్‌రేగా యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా సమగ్ర వివరాలు తక్షణం తెలుసుకునే అవకాశం ఉంది. కూలీలు ఇప్పటి వరకు ఏ సమాచారం కావాలన్న ఎంపీడీవో కార్యాలయానికి, పోస్టాఫీసులు, ఉపాధి సిబ్బంది చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ఇక నుంచి ఆ అవసరమే ఉండదు. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చు.

యాప్‌లోని వివరాలు..

సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ గూగుల్ ప్లేస్టోర్ నుంచి జన్‌మన్‌రేగా(జేఏఎన్‌ఎమ్‌ఏఎన్‌ఆర్‌ఇజీఏ) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కూలీల వివరాలు, హాజరు, జీతాలు తదితర వివరాల కోసం క్లిక్ చేస్తే బ్లాగ్ తెరుచుకుంటుంది. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామపంచాయతీ, ఉపాధి గ్రామకార్డు సంఖ్య నమోదు చేసి క్లిక్ చేస్తే వివరాలు ప్రత్యక్షమవుతాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పనిచేసిన రోజులు, కూలి మొత్తం, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతున్నాయో, ఎంత జమ అయ్యాయో పూర్తి వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ పనిచేసిన కూలీకి నగదు జమకాకపోతే కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. దాంతో పాటు చేపట్టే ఉపాధిపనుల వివరాలు సమాచారం ఉంటుంది.

అక్రమాలు జరిగితే ఫిర్యాదు చేయవచ్చు..

ఉపాధి పనుల్లో స్థానికంగా జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు ఈ యాప్‌లో వీలు కల్పించారు. అన్ని భాషల్లోను వివరాలు ఉంటాయి. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పనిచేసినా, ఉపాధి సిబ్బంది బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా ఫిర్యాదు చేయవచ్చు. సాంకేతికత ఆధారంగా పనులు పకడ్బందీగా చేపట్టడంతో పాటు ఉపాధిహామీ పథకంలో పారదర్శకతకు పెద్ద పీట వేయాలన్నా సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ యాప్ తీసుకువచ్చింది. జరుగుతున్న పనులు ప్రతీ ఒక్కరూ తెలుసుకునేందుకు వీలుగా అనేక రకాలుగా యాప్‌ను ప్రత్యేక సాఫ్ట్‌వేరుతో అందుబాటులోకి తెచ్చింది.

అవగాహన అవసరం

జన్‌మన్‌రేగా యాప్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. యాప్ అందుబాటులో ఉన్న విషయం చాలామందికి తెలియదు. ఉపాధి హామీ సిబ్బంది కూలీలు పని చేసే చోట అవగాహన కల్పిస్తే యాప్ వల్ల కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభిస్తే కేంద్రప్రభుత్వ సంకల్పం నెరవేరినట్లే.

క్రైం సమాచారం

అదుపుతప్పి లారీ బోల్తా

● డ్రైవర్‌కు గాయాలు


బోల్తా పడిన లారీ

త్రిపురాంతకం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వస్తున్న లారీ బోల్తా పడడంతో డ్రైవరుకు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని వెల్లంపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకొంది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నుంచి విజయవాడకు మొక్కజొన్న లోడుతో వెళుతున్న లారీ అదుపు తప్పింది. రోడ్డు పక్కనే మార్జిన్‌లోకి బోల్తా పడింది. డ్రైవరు రాజేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు.

అక్రమ మద్యం సీసాల పట్టివేత


పట్టుబడిన మద్యం సీసాలు

కంభం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కంభం ఆర్టీసి బస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి అక్రమ మద్యం బాటిళ్ళను కలిగి ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. 26 క్వార్టర్ల మద్యం బాటిళ్ళను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తా.. మహిళ మృతి

ఎర్రగొండపాలెం రూరల్ నబంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మెట్టబొడుతాండ సమీపంలో జాతీయ రాహదారిపై ద్విచక్ర వాహనం బోల్తా పడింది. దీంతో ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. నాగర్జున సాగర్ చెంచు కాలానీకి చెందిన మండ్లి లింగమ్మ భర్తతో ద్వీచక్రవాహానంపై ఎర్రగొండపాలెం వస్తుంది. మెట్టబోడు తాండ- టోల్‌గేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ను తప్పించబోయి బొ ల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లింగమ్మకు తీవ్ర గాయాలు కావడంతో జాతీయ రహదారి అంబులెన్స్ లో ఏరియా వైద్యశాలకు త రలించారు. చికిత్స నిర్వహిస్తున్న సమయంలో లింగమ్మ మృతి చెందింది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ పి. చౌడయ్య తెలిపారు.

ఆటో-బైక్ ఢీ, ఒకరి మృతి

పొదిలి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం గ్రామ సచివాలయం సమీపంలో పాలఆటో, మోటార్‌సైకిల్ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కంభాలపాడు గ్రామానికి చెందిన ఏడుకొండలు(33) అనే వ్యక్తి పలు గ్రామాల్లో పాలు సేకరించుకొని దర్శి పాలకేంద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మల్లవరం గ్రామ సచివాలయం సమీపంలో ప్రమాదవశాత్తు పొదిలి వైపు వస్తున్న మోటార్‌బైక్, పాలవాహనం ఎదురెదురుగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో పాల ఆటో రోడ్డుపై బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్ ఏడు కొండలు అక్కడిక్కడే మృతిచెందాడు. గాయపడిన మరో వ్యక్తిని కొనకనమిట్ల మండలం, వద్దిమడుగు గ్రామానికి చెందిన చెన్నుబోయిన బాలకృష్ణగా పోలీసులు గుర్తించారు. ఆయన్ను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేస్తున్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగునీరు

● అర్బన్‌కాలనీ, రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఆటంకం
● సమస్యలపై దృష్టిసారించని అధికారులు


రహదారిపై నిలిచిన మురుగునీరు

కంభం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పై చిత్రాన్ని చూసి ఇదేదో మురుగు కుంట అనుకుంటే పొరపాటే. కంభం అర్బన్ కాలనీకి, రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు ఉపయుక్తంగా ఉండే రహదారి ఇది. కంభం రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఈ రహదారి నుంచే రాకపోకలు సాగించే వారు. నెల రోజులక్రితం వరకు ప్రజలు, విద్యార్థులు ఈ దారిన రాకపోకలు సాగించారు. అయితే కంభం అర్బన్ కాలనీలో మురుగు కాలువలు నిర్మించక పోవడంతో ఆ నీరింతా ఈ రహదారిపైకి వస్తోంది. దీంతో వాహనదారులు, ప్రజల రాకపోకలు నిలిపివేశారు. మురికి నీరు రోడ్లపై ప్రహించకుండా కాలువలను నిర్మించాలని కంభం, కందులాపురం పంచాయతీల అధికారులకు ప్రజలు విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే ఈ రోడ్డు తమ పరిధిలోనిది కాదని ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా ఆయా పంచాయతీల అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీ సభ్యత్వాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● నాయకులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సూచన

కొమరోలు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): కొమరోలు మండలంలోని ప్రతి నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా టీడీపీ సభ్యత్వాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. కొమరోలు మండలంలోని యర్రపల్లి గ్రామంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు బిజ్జాల తిరుమలరెడ్డి కుమారుడు డాక్టర్ విరాట్‌రెడ్డి, డాక్టర్ నాగకవితల వివాహ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై వధువరులను ఆశీర్వదించారు. అనంతరం పార్టీ ముఖ్య నేతలతో పార్టీ సభ్యత్వాలపై ప్రత్యేకంగా చర్చించారు. గిద్దలూరు నియోజకవర్గంలో కొమరోలు మండలం టీడీపీ సభ్యత్వాలపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బిజ్జాల తిరుమలరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డిలకు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకంటే కొమరోలులో ఎక్కువ సభ్యత్వాలు నమోదు చేయించాల్సిన బాధ్యత మీదేనన్నారు. పార్టీ సభ్యత్వాలు తీసుకోవడం వల్ల ప్రజలకు జరిగే లాభాన్ని వివరించాలన్నారు. అప్పుడే సభ్యత్వాలు వేగవంతం అవుతాయన్నారు. మండలంలో సిమెంటురోడ్లు, ప్రధాన రహదారుల్లోని గుంతలు పూడ్చే పనులు ఎంతవరకు వచ్చాయని ఆరా తీశారు. పనుల్లో ఎక్కడా అవినీతికి తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గిద్దలూరుకు తాను తీసుకొచ్చిన పనులు ప్రజలకు ఉపయోగపడేవిధంగా ప్రతి నాయకులు, కార్యాకర్తలు పనిచేయాలన్నారు. కార్యాకర్తలకు ఎప్పూడూ తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పులకుర్తి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ అబ్దుల్ ఖాదర్, సీనియర్ నాయకులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, నాయకులు గోడి ఓబుల్‌రెడ్డి, చలిచీమల శ్రీనివాసచౌదరి, అనపా వీరశేఖర్, కాంట్రాక్టర్ వీరనారాయణరెడ్డి, పేరాల లక్ష్మీనరసయ్య, బాలిరెడ్డి, యల్లారెడ్డి, పోలెబోయిన రమణయ్య, రామస్వామి, సక్కా శ్రీను, బోడ్డు రంగయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, శ్రీనువాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర


విశేష అలంకరణలో అమ్మవారు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులలో వెలసియున్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మార్కాపురం సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం

● అందుకు అనుగుణంగానే ఆక్రమణల తొలగింపు ● మీ మాదిరి మేము విధ్వంసాలు చేయం ● అన్నాపై నారాయణరెడ్డి ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'మాకు ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు లేవు. కేవలం మార్కాపురం సమగ్రాభివృద్ధే మా లక్ష్యం. అందుకను గుణంగానే ఆక్రమణల తొలగింపులు చేపట్టాం. మీ పార్టీలాగా మాకు విధ్వంసం సృష్టించడం చేతకాదు. అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం' అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మార్కాపురం మున్సిపాలిటీలో జరుగుతున్న ఆక్రమణల తొలగింపు విషయంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురాన్ని సుందరంగా తీర్చిదిద్దడం మీకు ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు చట్ట ప్రకారం ముందుగా నోటీసులు ఇచ్చి, కొంత సమయాన్ని కూడా ఇచ్చి ఆక్రమణల తొలగింపు ప్రారంభించారన్నారు. కేవలం రహదారి ఆక్రమణలు మాత్రమే అధికారులు తొలగిస్తున్నారన్నారు. కనీస అనుమతులు తీసుకోకుండా డీకే పట్టా భూముల్లో నిర్మించిన భవనాల నిర్మాణాలు ఉన్నాయన్నారు. ఒక సర్వే నంబరు చూపి, మరో సర్వే నంబరులో భవనాల నిర్మాణాలు ఉన్నాయన్నారు. ఇవన్ని చట్ట సమ్మతం కాదన్నారు. అయితే మానవతా దృక్పథంలో వాటి జోలికి వెళ్లడం లేదన్నారు. కక్ష సాధిపు దోరణి తమది కాదన్నారు. పట్టణ సుందరీకరణ కోసం ముందుకు పోతుంటే తమపై విమర్శలు చేయడం సబబు కాదన్నారు. మీకు చేతనైతే మున్సిపాలిటీకి వెళ్లి రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకోవాలని అన్నారు.

పట్టణ జనాభా 20 వేలు ఉన్నప్పుడు రోడ్లు విశాలంగా ఉన్నాయన్నారు. అప్పట్లో పట్టణ మంతా కలిపినా 500 వాహనాలు కూడా లేవన్నారు. కానీ నేడు 20వేల పైచిలుకు అన్ని రకాల వాహనాలు పట్టణంలో నిత్యం తిరుగుతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆక్రమణలు తొలగించడం తప్పా అన్నారు. పట్టణంలోని పదుల సంఖ్యలో భవనాల్లో సెల్లార్లు నిర్మించుకుని వాటిని అద్దెకిచ్చుకుంటున్నారన్నారు. వాటిని పార్కింగ్‌కు వినియోగించుకోండని మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడం తప్పా అని ప్రశ్నించారు.

మీ నేతల కబ్జాలపై నెలకొకటి బయటపెడతా

వైసీపీ హయాంలో మీ నేతలు చేసిన కబ్జాలపై నెలకు ఒకటి బయట పెడతా, చర్యలు తీసుకునే ధైర్యం మీకుందా? అని ఆయన అన్నా రాంబాబును ప్రశ్నించారు. అలాంటి వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా? అని సవాలు విసిరారు. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని 206/బి సర్వే నెంబర్‌లో 6.30 ఎకరాల చెన్నకేశవస్వామి మాన్యం ఉందన్నారు. అది మా భూమి అని దేవాదాయశాఖ బోర్డు పెట్టింది. అంతేకాక రెవెన్యూ రికార్డుల్లో రెడ్ మార్కు ఉందన్నారు. మీ పార్టీకి చెందిన ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి దొంగ రిజిస్ట్రేషన్‌తో ఆక్రమించాడన్నారు. అదేవిధంగా నాదెళ్ల సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు కూడా అక్కడ దేవాదాయశాఖ భూమిని ఆక్రమించుకున్నారన్నారు. మీకు చేతనైతే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయించాలన్నారు. అదేవిధంగా కొనకనమిట్ల మండలంలో జిల్లాలోనే అందరూ గౌరవించే పెద్ద మనిషి పాటిబండ్ల గోపాలస్వామికి చెందిన పొలాన్ని దొంగ రిజిస్ట్రేషన్‌లతో కబ్జా చేశారన్నారు. వారిపై చర్యలు తీసుకునే ధైర్యం నీకు ఉందా? అని ప్రశ్నించారు. తమ కార్యకర్తలు ఎక్కడైనా ఆక్రమణకు పాల్పడితే తాము చర్యలు తీసుకుంటామన్నారు.

వెలిగొండ, మెడికల్ కళాశాలలపై మొసలి కన్నీరా!

ఈ ప్రాంత ప్రజల జీవనాడి అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడంలో గత కాంగ్రెస్, వైసీపీ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఈ ప్రాంత ప్రజలు మీ పార్టీలను ఎంతగా ఆదరించినా వారి ఆశలను అడియాసలు చేశారని విమర్శించారు. మళ్లీ 2019 నుంచి 2024 మధ్య వైసీపీ ప్రభుత్వ హాయంలో బడ్జెట్‌లో రూ.3,518 కోట్లు బడ్జెట్‌లో పెట్టినా మీరు నిధులు ఖర్చు చేసింది కేవలం రూ.172 కోట్లు మాత్రమే అన్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉంటే కేవలం 2 శాతం పనులు మాత్రమే చేసిందన్నారు. ఇప్పటికీ ప్రాజెక్టు పూర్తైంది 73.8 శాతం మాత్రమే అన్నారు. ఇంకా 26.2 శాతం పనులు పూర్తి కావాల్సివున్నా గత ముఖ్యమంత్రి జగన్ ప్రాజెక్టును పూర్తిచేసినట్లు శిలాఫలకాలు వేయించి ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం హాస్యాస్పదం కాదా..? అని ప్రశ్నించారు. ప్రాజెక్టులో ఎంతో కీలకమైన టన్నెల్ పనులు ఇంకా చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అంతేకాక ఫీడర్ కెనాల్ సామర్థ్యంపై కూడా అనుమానాలు ఉన్నాయన్నారు. మొదటి టన్నెల్ ద్వారా నీళ్లు వదలొచ్చుకదా అని మీరే ప్రశ్నిస్తున్నారు. నీళ్లు వదిలితే ఎన్ని గ్రామాలు మునిగిపోతాయో తెలుసా అని ప్రశ్నించారు. ముంపు గ్రామాల ప్రజలకు ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా మీరు ఇవ్వలేదన్నారు. నేటి నుంచి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టినా ప్రాజెక్టు పూర్తి కావడానికి కనీసం మరో రెండేళ్లు పడుతుందన్నారు. మెడికల్ కాలేజీ విషయంలో మీ ప్రభుత్వం నిధులు కేటాయించకుండా తాత్సారం చేసిందన్నారు. నేడు తరలి పోతోందని విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కేంద్రం ఎలాంటి అనుమతులు ఇవ్వక పోయినా గత ప్రభుత్వం ఇష్టారీతిన కళాశాలల పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలు తరలిపోకుండా ఆపిందన్నారు. పీపీపీ పద్ధతిలో మా ప్రభుత్వం మెడికల్ కళాశాలను తప్పకుండా పూర్తిచేస్తుందన్నారు.ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లిఖార్జున్, మాలపాటి వెంకట రెడ్డి, కనిగిరి బాల వెంకటరమణ, కౌన్సిలర్ నాలి కొండయ్య, రంగస్వామి, బి.మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

కాపుల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తా

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
● బలిజ సంఘం ఆధ్వర్యంలో మినీ కల్యాణ మండపం ప్రారంభం


మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ముండ్లపాడు రోడ్డులోని బలిజ సేవాసంఘం నూతనంగా నిర్మించిన మిని కల్యాణ మండపాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కాపుల అభివృద్ధికి తనపూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, కంభం మండల కేంద్రాలలో కాపు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులను మధ్యలోనే ఆపివేసిందన్నారు. తిరిగి ఆ భవనాల పూర్తికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కాపుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని కాపు సంఘం ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుప్పా రంగనాయకులు, కాపు సంఘం ప్రతినిధులు దుత్తా బాలీశ్వరయ్య, ఆర్‌డీ.రామక్రిష్ణ, కమతం శ్రీనివాసులు, యగటీల రంగస్వామి, ముద్దర్ల శ్రీనివాసులు, యగటీల రవి, పసుపులేటి శ్రీనివాస్, బాలచెన్నయ్య పాల్గొన్నారు.

టార్పాలిన్ పట్టలు దుప్పట్లు పంపిణీ

గిద్దలూరు టౌన్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని దిగువమెట్ట చెంచుకాలనీలోని 100 చెంచు కుటుంబాలకు టార్పాలిన్ పట్టలను, దుప్పట్లను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అందజేశారు. ప్రభుత్వ పథకాలను సక్రమంగా ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందా లని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చెంచులకు సూచించారు. చెంచుకుటుంబాల వారు తమ పిల్లలను తమతోపాటు పనులకు తీసుకుని వెళ్లకుండా కచ్చితంగా పాఠశాలలకు పంపాలన్నారు. హాస్టళ్లలో ఉంచి చదివించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర కోశాధికారి చిట్యాల వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కంభం : కంభం అంకాలమ్మ దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం శ్రీ అభయాంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ సభ్యుడైన ఆకుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటుకు ముందు ఉదయం గణపతి పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని శాంతిహోమం, పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అంకాలమ్మగుడి నుంచి కంభం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఆంజనేయస్వామి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు గురువులు

గిద్దలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో 1980-83 బ్యాచ్ బికాం చదివిన పూర్వ విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థి దశ నాటి జ్ఞాపకాలను 4 దశాబ్దాల తరువాత ఒకరికొకరు నెమరు వేసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పనరెడ్డిని, ఆనాటి గురువులైన బొగ్గరపు వెంకటరామయ్య, కొప్పు సత్యనారాయణ, గంజి రాఘవులు, ఫిజికల్ డైరెక్టర్ తిరుపతిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రస్తుత ప్రిన్సి పల్ డాక్టర్ పోలిరెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఈదుల రంగస్వామిరెడ్డి, సంఘ ప్రతినిధులు నాగేంద్ర ప్రసాద్, ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకోవాలి


నృత్య పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే కందుల


నృత్యం చేస్తున్న చిన్నారులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు నృత్యాలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సకలకళల కళాకారుల సాంస్కృతిక సేవా సంఘం, స్టైల్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి డాన్స్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాలలో ఆసక్తి పెంచుకోవడం ఎంతో అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, వక్కలగడ్డ మల్లికార్జునరావు, టి. వెంకటరెడ్డి, శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ నగేశ్, ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్ర శేఖర్‌రెడ్డి, సకల కళాకారుల సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నవీన్‌కుమార్, వెంకట్, స్టైల్ డాన్స్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న నిర్వాహకులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నెహ్రూబజార్‌లోని షిరిడీ సాయిబాబా మందిరంలో నూతనంగా నిర్మించనున్న నిత్యాన్నదాన భవనానికి ఆదివారం శంకుస్థాపన శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. గత 14 ఏళ్ల నుంచి సాయి మందిరంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో వేదపండితులు రామకృష్ణాచార్యులు, రవి శర్మలు, పూజలు, హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, వక్కలగడ్డ మల్లికార్జునరావు, జనసేన నాయకుడు ఇమ్మడి కాశీనాథ్, సాయిమందిర అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, కోశాధికారి పీవీఎల్ఎన్‌వీ నాగరాజు, గోపాలుని కృష్ణమోహన్, మందిర మేనేజర్ సతీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తీగలేరుకు నిధులు కేటాయించాలి

రైతు సంఘం నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

పుల్లలచెరువు, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు నుంచి టీ-5 కాలువ తీగలేరుకు నిధులు కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కాలువ పరివాహక ప్రాంతాలైన కాశీకుంట తండా నుంచి కొమరోలు, ఎండ్లపల్లి, మల్లాపాలెం తదితర గ్రామాల్లో రైతుసంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పుల్లల చెరువులోని చిన్నకండ్లేరు చెరువుకు తీగలేరు కాలువను అనుసందానం చేయాలన్నారు. తద్వారా పుల్లలచెరువు మండలంలో కరువు కాటకాలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయన్నారు. 11,500 ఎకరాలు భూమికి దీని ద్రాఆ సాగునీరు అందుతుందని 60వేల జనాభాకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. దీని కోసం ఈ ప్రాంతం నాయకులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు చెన్నయ్య, గురునాథం, పలువురు రైతులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో విద్యార్థులకు పతకాలు


కరాటే పోటీలలో పతకాలు గెలుపొందిన విద్యార్థులు

పొదిలి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : మంగళగిరిలో జరిగిన జాతీయస్థాయి 9వ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో పొదిలికి చెందిన విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు కరాటే శిక్షకుడు వేణుమాస్టర్ ఆదివారం తెలిపారు. పొదిలికి చెందిన ముగ్గురు విద్యార్థుల బృందం కటా విభాగంలో నగిరికంటి వెంకటనాగ సాయిప్రతీక, కీర్తిక, ఎర్రంరెడ్డి జయసాయి విష్ణువర్ధన్‌రెడ్డిలు బంగారు పతకాలు కైవశం చేసుకున్నారు. వ్యక్తిగత కటా విభాగంలో పదిసంవత్సరాల బాలికల విభాగంలో కీర్తిక బంగారు పతకం సాధించగా, 11 సంవత్సరాల బాలుర కటా విభాగంలో సాయిప్రతీక్ కాంస్య పతకం, పది సంవత్సరాల బాలుర కటా విభాగంలో ఎర్రంరెడ్డి, జయసాయి విష్ణువర్ధన్‌రెడ్డి కాంస్య పతకం సాధించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన పిల్లలకు కరాటే శిక్షణలో ట్రైనింగ్ ఇచ్చిన కరాటే మాస్టర్ వేణును విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు అభినందించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

గిద్దలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరులోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేవిధంగా కృషి చేసి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బీవీ.రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ, నంద్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి చల్లా మధు, బీజేపీ వివిధ విభాగాల నాయకులు షేక్ ఖాదర్‌వలి, బాదుల్లా, మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం కల్పించాలి

గిద్దలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం కల్పించాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రజక వృత్తిదారులు సమావేశమయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో ప్రతి నిత్యం రజకులపై దౌర్జన్యదాడులు, అత్యాచారాలు, అక్రమ కేసుల బనాయింపు జరుగుతూనే ఉందని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలలో పనులు లేక పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్లిన సందర్భంలో రకరకాల ఇబ్బందులకు ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున సామాజిక రక్షణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రజక సంక్షేమ అభివృద్ధి కార్పోరేషన్ ద్వారా ఆశ్రమ పాఠశాలలు, 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు, జీవితబీమా సౌకర్యం, ఇళ్ళు, స్థలాలు మంజూరు చేసి రాయితీపై వాషింగ్ మిషన్‌లు, రాయితీపై కరెంటు సమకూర్చాలని కోరారు. ఈసందర్భంగా రజక వృత్తిదారుల కన్వీనర్‌గా దొడ్డి పుష్ప, కోకన్వీనర్‌గా సిరివెళ్ల కుమారి, వీరగల్ల రమణమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులుగా అరుణ్

గిద్దలూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులుగా ఉయ్యాలవాడకు చెందిన బోదనబోయిన అరుణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంగళరావు చేతుల మీదుగా ఆదివారం అరుణ్‌కుమార్ నియామక పత్రాలను అందుకున్నారు. అలాగే బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా నరవకు చెందిన బండి శ్రీనివాసులు సైతం నియమితులై నియామక పత్రాన్ని ఆదివారం శ్రీశైలంలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు.

నేడు వై.పాలెంలో ప్రజాదర్బార్

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 10(అంధ్రజ్యోతి) ఎర్రగొండపాలెం మండల పరిషత్ కార్యాలయ అవరణలో డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ భవనంలో సోమవారం ఉదయం ప్రజాదర్బార్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బొందారు శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని పంచాయితీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు అందరూ అన్ని రకాల రికార్డులతో హాజరు కావాలని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా పగడాల రంగస్వామి



గిద్దలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జిగా పగడాల పెద్దరంగస్వామి మూడవ పర్యాయం నియమితులయ్యారు. పగడాల పెద్దరంగస్వామిని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అధికారికంగా ప్రకటనను విడుదల చేశారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికలలో పగడాల రంగస్వామి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన విషయం విధితమే. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని ఈసందర్భంగా పేర్కొన్నారు.

కల్యాణ మండప ఏర్పాటుకు భూమిపూజ

బేస్తవారపేట,నవంబరు10(ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట ఆర్యవైశ్య కన్యాకపరమేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య కల్యాణ మండపం ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు హాజరయ్యారు. అనంతరం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బొంతల లక్ష్మణ్‌స్వామి గుప్త, అధ్యక్షులు జక్కా వెంకట కుమార్, కల్యాణ మండపం నిర్మాణ కమిటీ అధ్యక్షులు బాదం సుబ్బారావు, ఆర్యవైవ్య యువజన సంఘం అధ్యక్షులు విశ్వనాథుని జగదీష్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి చల్లగా కరుణించమని భక్తులు వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్. ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు పోస్టల్ సేవలు

దొనకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీస్‌లో ఐపీపీబీ ఖాతా ఓపెన్ చేయటానికి కేవలం ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ సరిపోతుందని దొనకొండ సబ్‌పోస్టుమాస్టర్ అర్షాద్‌ఖాన్ అన్నారు. ఎటువంటి జిరాక్స్‌లు లేకుండా ఈనెల 15 వరకు ప్రజల వద్దకే పోస్టల్ సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. పోస్టల్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దొనకొండలోని అనేక ప్రాంతాల్లో ఆదివారం ఆధార్‌సీడింగ్, అకౌంట్ల నిర్వాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులు కూడా తమ బయోమెట్రిక్ ద్వారా ఈ ఖాతాలో నగదు జమ, ఉపసంహరణ వంటి సేవలు సులభతరంగా పొందవచ్చునని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలి

దొనకొండ, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): దొనకొండలోని రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, శృంగారపు నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దర్శి వచ్చిన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలిసి ప్రజల ఇబ్బందులను వివరించారు. నాలుగేళ్లగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. దొనకొండలోని విమానాశ్రయం వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఎంపీ మాగుంట సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

హైందవ శంఖారావం సభను జయప్రదంచేయాలి

పామూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య పిలుపినిచ్చారు. స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో ఆదివారం పామూరు, సీఎస్‌పురం, వరికుంటపాడు మండలాలకు చెందిన ఆర్ఎస్ఎస్, విశ్వహిందూపరిషత్, భజరంగదళ్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందువుల మనోభావాలను ప్రభుత్వాలు గౌరవించాలన్నారు. ఈసందర్భంగా శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో దర్శి సత్యనారాయణ, వరద ఓబులేలు, కొట్టే వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసులు, ఉమ్మడిశెట్టి శ్రీను, పి.విజయ్‌కుమార్, జమకాల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభచాటిన పామూరు విద్యార్థులు


జాతీయ కరాటే చాంపియన్ షిప్‌లో పాల్గొన్న పామూరు విద్యార్థులు

పామూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ కరాటే చాంపియన్ షిప్‌లో పామూరు కరాటే డో స్పోర్ట్స్ అకాడమికి చెందిన విద్యార్థులు సత్తాచాటి పతకాలు సాధించినట్లు మాస్టర్లు షేక్ అబ్దుల్, మహీద్, అర్షద్‌బాషా తెలిపారు. మంగళగిరిలోని అద్దా మజీద్ షాదిఖానాలో ఆదివారం నిర్వహించిన జపాన్ షిటోరియో కరాటే డు స్కూల్ షికోకాయ్ ఇజూషి ఇండియా నిర్వహించిన 9వ నేషనల్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పామూరు విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ కేటగిరిల్లో ఎస్డీ దోహా, కె.యాశ్విని, కె.లాస్య, టి.ప్రదీప్, కె.అభిజ్ఞ, జె.రామ్, ఎన్‌రోషిత్, ఎ.శ్రీహరి, రిషిక, స్నేహిత, వై.నిహిత, కె.కార్తిక, జి.మనోహర్ పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్లు తెలి పారు.

విధులకు డుమ్మాకొట్టిన బీఎల్‌వోలపై చర్యలకు సిఫార్సు

తాళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా స్పెషల్ క్యాంపెయిన్ విధులకు హాజరుకాని 11 మంది బూత్‌లెవల్ అధికారులపై(బీఎల్‌వో) తగు చర్యలు తీసుకోవాలని దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎంపీఎస్ లోకేశ్వరరావు ఆదివారం జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు శని, ఆదివారాలు బూత్‌లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి ఓటర్ల దరఖాస్తులను స్వీకరించాలి. అయితే, మండలంలోని 11 మంది బీఎల్‌వోలు విధులకు హాజరుకాలేదు. వీరిపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు నివేదిక పంపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కనిగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని బోధి దర్మ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి అన్నారు. ఆదివారం పట్టణంలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈసందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ పెరిగిన కాలుష్యాన్ని నిర్మూలించాలంటే మొక్కలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కేవీపల్లి హైస్కూల్‌లో ప్రతిభా పరీక్షలు

కనిగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచర్లవారిపల్లి (కేవీపల్లి) హైస్కూల్‌లో సోమవారం ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయుడు సి.విజయభాస్కర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గస్థాయి పదో తరగతి విద్యార్థులకు, మండలస్థాయిలో ఐదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బాలల దినోత్సవం రోజున నగదు బహుమతిని సువెన్ ఫౌండేషన్ సహకారంతో అందజేస్తున్నట్టు చెప్పారు.

15 మద్యం బాటిళ్లు పట్టివేత

కురిచేడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర వీరాయపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న మోతుకూరి మురళీకృష్ణ అనే వ్యక్తి నుంచి ఆదివారం దర్శి ఎక్సైజ్ పోలీసులు 15 మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బెల్ట్ షాపుల ద్వారా ఎవరూ మద్యం అమ్మవద్దని దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఆర్సీఎం మేత్రాసనం బిషప్‌గా అంతోనీదాస్

దొనకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఆర్సీఎం మేత్రాసనం బిషప్‌గా దొనకొండకు చెందిన రెవరండ్ ఫాదర్ పిల్లి అంతోనీదాస్ నియమితులయ్యారు. ఈమేరకు వాటికన్ సిటీ నుంచి రెవరండ్ ఫ్రాన్సిస్‌పోప్ నుంచి ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం నెల్లూరు మేత్రాసనం బిషప్‌గా పనిచేస్తున్న రెవరండ్ ఎండీ ప్రకాశం ఆరోగ్య పరిస్థితి బాగాలేదు. దీంతో రెవరండ్ ఫాదర్ పిల్లి అంతోనిదాస్‌ను నెల్లూరు మేత్రాసనం బిషప్‌గా సేవలందించేలా ఫ్రాన్సిస్‌పోప్ ఉత్తర్వులు జారీ చేశారు.

నెరవేరనున్న దర్శి ప్రజల చిరకాలవాంఛ

- ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి
- టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ


టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్

దర్శి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంత ప్రజల చిరకాలవాంఛను టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం ద్వారా నెరవేరుస్తున్నట్టు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. దర్శి పట్టణంలోని తూర్పుగంగవరం రోడ్డులో రూ.2కోట్లతో నిర్మించతలపెట్టిన కల్యాణ మండపానికి ఆదివారం ఎంపీ మాగుంట, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ దర్శిలో కల్యాణ మండపం నిర్మించాలన్న ప్రతిపాదన గత 40 సంవత్సరాలుగా కొనసాగుతుందన్నారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ఎంపీ మాగుంట సహకారంతో కల్యాణ మండపం పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కౌన్సిలర్ వీసీ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, కె.చంద్రశేఖర్, దారం సుబ్బారావు, బొట్ల కోటేశ్వరరావు, పుల్లలచెరువు చిన్నా, కల్లూరి సుబ్బు, కార్యదర్శి గుర్రం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే సంక్రాంతికి దర్శికి రైళ్లు

దర్శి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వచ్చే సంక్రాంతికి దర్శికి రైళ్లు నడిచే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి స్పష్టం చేశారు. దర్శి-తూర్పుగంగవరం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే స్టేషన్, రైల్వేలైన్ నిర్మాణ పనులను ఆదివారం ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు రైల్వే అధికారులతో నిర్మాణ పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాగుంట మాట్లాడుతూ దర్శి ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణం పూర్తయి రైల్లో ప్రయాణించే అవకాశం కలుగుతుందన్నారు.

కార్యక్రమంలో కమిషనర్ వై.మహేశ్వరరావు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

దర్శి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో నిలిచిపోయిన పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి స్పష్టం చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయి డ్రైవింగ్ శిక్షణ పరిశోధనా స్థానం నిర్మాణ పనులు త్వరలో పునఃప్రారంభమయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పునాదుల్లో నిలచిపోయిన కోల్డ్ స్టోరేజీ, ఆడిటోరియం పనులు పూర్తి చేయించటంతో పాటు క్రీడాప్రాంగణం ఏర్పాటుకు నిధులు విడుదల చేయిస్తామన్నారు. అధ్వానంగా మారిన ఎన్ఏపీ రక్షిత మంచినీటి పథకం అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తామన్నారు.

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎంపీ మాగుంట సహకారంతో దర్శి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు.

ట్రాఫిక్ ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- సీఐ ఖాజావలి


మాట్లాడుతున్న సీఐ ఖాజావలి

కనిగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో పోలీసుశాఖ విధించిన ట్రాఫిక్ ఆంక్షలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ఖాజావలి హెచ్చరించారు. ఆదివారం స్థానిక శ్రీనివాస మహల్‌లో వ్యాపారస్తులు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు, దుకాణదారులు షాపుల వెలుపల, బయట తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. రద్దీగా ఉండే ప్రాంతాలలో రెండు వారాలకు ఒకసారి వాహనాల పార్కింగ్‌పై ఆంక్షలను విధిస్తున్నట్టు చెప్పారు. షాపుల యజమానులు నో పార్కింగ్ రోజులలో బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. పట్టణంలో విచ్చలవిడిగా ఆవులను వదిలేసే యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. రెండు రోజుల్లో ఆవులను తీసుకెళ్లి ట్యాగ్ ఏర్పాటు చేసుకుని సంరక్షించుకోవాలన్నారు. ట్యాగ్ లేని ఆవులు వీధుల్లో సంచరిస్తే వాటిని పట్టుకుని అడువులలో వదిలేస్తామన్నారు.

ఎస్ఐ టి.శ్రీరాం మాట్లాడుతూ షాపుల యజమానులు వారి షాపుల ముందు పార్కింగ్‌కు స్థలాన్ని వదిలివేయాలన్నారు. పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు ఏర్పాటుచేస్తామన్నారు. తోపుడు బండ్ల వ్యాపారులు తిరుగుతూ వ్యాపారం చేసుకోవాలన్నారు. రోడ్లపై ఉంచి వ్యాపారం చేస్తే బండ్లను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలిపితే రూ.వెయ్యి నుంచి రూ.5వేలు వరకు జరిమానా విధిస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది కల్గించే హారన్లు, సైలెన్సర్లు ఉన్న వాహనాలను సీజ్ చేస్తామని చెప్పారు. పోలీసుశాఖ విధించిన ఆంక్షలను, నిబంధలను పాటించేలా ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు.

అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి


బీఎల్వోల వద్ద ఉన్న ఓటరులిస్టు, దరఖాస్తు ఫారాలను పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

పీసీపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండి ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్న యువతీ యువకులను ఓటరుగా నమోదు చేయాలని కనిగిరి ఆర్డీవో ఎ.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా ఆదివారం మండలంలోని అలవలపాడు, పీసీపల్లి, వరిమడుగు, వెంగళాయపల్లి పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సీహెచ్ ఉషతో కలిసి ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాలలో బీఎల్వోల వద్ద ఉన్న దరఖాస్తు కాపీలను పరిశీలించారు. అనంతరం ఆయన బీఎల్వోలతో మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ఫారం6, ఫారం7, ఫారం8లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దరఖాస్తులతో పాటు వచ్చిన వయసు నిర్ధారణ సర్టిఫికెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మృతిచెందిన ఓటరును గుర్తించి ఓటర్ల జాబితా నుంచి వారి పేరును తొలగించేందుకు ఫారం7ను తీసుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో విచారించాలన్నారు. చేర్పులు, తొలగింపుల్లో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా బీఎల్వోలు పనిచేయాలన్నారు. ఇదే నెలలో 23,24 తేదీలలో కూడా మరో రెండు రోజులు ప్రత్యేక క్యాంపెయిన్ ఉంటుందని ఆర్డీవో చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కురిచేడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి లోకేశ్వరరావు తనిఖీ చేశారు. ఈసందర్భంగా బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. 2025లో ప్రచురితమయ్యే ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ జాబితా అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


కొత్తపలెం వద్ద తారురోడ్డు పనులను పరిశీలిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. తూర్పుగంగవరం - జమ్మలమడక మార్గంలో బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఆదివారం కొత్తపాలెం వద్ద నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ తూర్పుగంగవరం- తాళ్లూరు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తట్ట మట్టి వేసిన పాపాన పోలేదన్నారు. ఎన్నికల సమయంలో తాను ఈరోడ్డుపై ప్రయాణిస్తూ ప్రజల కష్టాలను స్వయంగా గుర్తించానన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే తక్షణమే రోడ్డు నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం సింగిల్ రోడ్డు పనులు జరుగుతున్నాయని చెప్పారు. డబుల్‌రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు, జి.వేణుబాబు, షేక్ కాలేషాలి, ఐ.శ్రీనివాసరెడ్డి, ఆర్.వెంకట్రావు, కె.కోటిరెడ్డి, ఎం.సుజాత, ఎస్.ఆదినారాయణరెడ్డి, మన్నేపల్లి సమర, ఎం.వెంకటరెడ్డి, కల్యాణ్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

- రహదారుల పక్కన వ్యర్థాలు
- దుర్వాసనతో అవస్థలు పడుతున్న ప్రజలు


నిరుపయోగంగా ఉన్న వేములలోని చెత్తసంపద కేంద్రం

ముండ్లమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో వేలాది రూపాయలతో నిర్మించిన చెత్త పంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఫలితంగా, నిధులు వృథా అయ్యాయి. ప్రధానంగా గ్రామాలకు ఇవి దూరంగా ఉండటంతో రాత్రుల సమయంలో మందుల బాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి. మండలంలో ఉన్న 21 గ్రామ పంచాయతీల్లో 19 చోట్ల గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. గ్రామంలో ఉన్న చెత్తాచెదారాన్ని గ్రీన్ అంబాసిడర్ల ద్వారా సేకరించి రిక్షాల ద్వారా కేంద్రాలకు తరలిస్తారు. దానిని ఎరువుగా తయారుచేసి వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయతీలకు ఖర్చు పెట్టడమే లక్ష్యం.

అయితే, వైసీపీ ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాల గురించి పట్టించుకోలేదు. ఫలితంగా లక్షలాది రూపాయలు పెట్టి నిర్మించిన ఈ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఒకటి రెండు గ్రామ పంచాయతీల్లో తప్ప మిగతా గ్రామ పంచాయతీల్లో వృధాగా ఉన్నాయి. ఫలితంగా, గ్రామాల్లోని చెత్తాచెదారాన్ని రోడ్ల పక్కనే పడవేస్తున్నారు. దీంతో రహదారులు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. వాహన చోదకులు, పాదాచారులు ఆమార్గంలో ప్రయాణం చేయాలంటే హడలిపోతున్నారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టించు కోవాల్సిన పంచాయతీ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదు.


ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే ప్రధాన రహదారి పక్కన పోసిన వ్యర్థ పదార్థాలు

ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే ప్రధాన రహదారి పక్కన గ్రామంలో ఉన్న చెత్తాచెదారాన్ని పడవేస్తున్నారు. ఈ చెత్తాచెదారాన్ని వీధి కుక్కలు రోడ్లపైకి తీసుకురావటంతో దుర్వాసనతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మారెళ్ళ నుంచి జమ్మలమడక వెళ్ళే రహదారి, వేంపాడు ప్రధాన రహదారి, శంకరాపురం నుంచి అద్దంకి వెళ్ళే ప్రధాన రహదారి, పెద ఉల్లగల్లు నుంచి కెల్లంపల్లి రహదారి, పసుపుగల్లు ఎస్సీ కాలనీ, ఈదరలోని పలు రహదారుల పక్కన వ్యర్థ పదార్థాలను పడవేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యర్థాలు కుళ్ళిపోయి దుర్వాసన వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలను రోడ్లపక్కన పడవేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ అధికారులకు ఆదేశాలు ఇస్తాం

మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు గాను 18 గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలు ఉన్నాయని ఎంపీడీవో ఆర్.జనార్దన్ పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్త సంపద కేంద్రాలకు తరలించేవిధంగా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తామన్నారు. రహదారుల పక్కన చెత్తాచెదారాన్ని వేయకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

పామూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఓటు హక్కు కోసం 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకొనే అవకాశం ఎన్నికల సంఘం కల్గించిందని వీఆర్వో షేక్ గరీబా తెలిపారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో ఆదివారం ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సంఘం ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు, బూత్‌ల మార్పుకోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.బాల, అవులూరి మురళీశ్రీనివాసరావు, గుర్రాల నాగేశ్వరరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

పామూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆదివారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా స్థానిక విరువూరు రోడ్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతగా నిర్మాణ పనులు చేయాలని సూచించారు. పామూరు పట్టణంలో 23 అంతర్గత రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సయ్యద్ అమీర్‌బాబు, వైప్రసాద్‌రెడ్డి, ఇర్రి కోటిరెడ్డి, మండ్ల రమణయ్య, గోళ్ల వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, గుత్తి మహేష్, పోకా వినోద్, డీజే నాయబా పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


టిప్పర్ ఢీకొని విరిగిన స్తంభం

పామూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విరువూరు రోడ్డులోగల ఆయేషా మజీద్ సమీపంలో గుంతలను పూడ్చడానికి టిప్పర్‌తో మట్టి తోలుతున్నారు. ఈక్రమంలో ప్రమాదశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ స్తంబానికి టిప్పర్ తగలటంతో విరిగి పడింది ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం తెలపడంతో సరఫరాను నిలిపివేశారు.

దేవాలయ ప్రాంగణంలో మొక్కలు నాటిన పిరమిడ్ సభ్యులు

పామూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పత్రీజి పిరమిడ్ జ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో ఆదివారం పిరమిడ్ సభ్యులు పలురకాల మొక్కలు నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శివాలయంలో భక్తులకు పూజా కార్యక్రమాలకు ఉపయోగపడే మొక్కలను నాటినట్టు చెప్పారు. కార్యక్రమంలో పి.అల్లూరయ్య, జి.రమణయ్య, ఎం.తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు నిర్వహించారు. వివిధప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్లకు మహానైవేద్యాన్ని సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె.చినఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరును విజయవంతం చేయాలి

దొనకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, పెరిగిన ధరలకు నిరసనగా ఈనెల 14 వరకు జరిగే సీపీఎం ప్రజాపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు పిలుపునిచ్చారు. దొనకొండలోని అనేక ప్రాంతాల్లో ప్రజాపోరు కరపత్రాలను ఆదివారం పంపిణీచేశారు. సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ ప్రజాపోరులో భాగంగా ఈనెల 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుందుర్తి నర్సింహాలు, మేళం ఉదయ్‌కుమార్, మేళం సంతోష్‌కుమార్, చిరుపల్లి పెద్దయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టు పెట్టిన వ్యక్తి అరెస్టు

కనిగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా(ట్విటర్)లో ఇటీవల ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి, విద్యాశాఖామంత్రిపై అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్ట్ పెట్టిన వ్యక్తిని ఆదివారం రాత్రి కనిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ టి.శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కోవూరులోని పాతరోడ్డుకు చెందిన మునగాల హరీశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖామంత్రి నారా లోకేష్, హోంమంత్రిపై అసభ్యకరంగా పోస్ట్ చేయటంతో పాటు ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో కనిగిరికి చెందిన ఐటీడీపీ రాష్ట్ర నాయకుడు జంషీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఖాజావలి దర్యాప్తు చేశారు. హరీశ్వర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

సోమవారం 11 నవంబరు 2024



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న పవన్ కళ్యాణ్



రాజధాని అమరావతి నిర్మాణం ఇకపై పరుగులు పెట్టనుంది. రాజధాని నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు నుంచి అందనున్న నిధుల వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సీఆర్డీఏకు తాజాగా జీవో జారీ చేసింది. అమరావతి నగర అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన ప్రణాళికలు అమలు చేయాలని సీఆర్డీఏకు పురపాలక శాఖ ఆ జీవోలో పేర్కొంది.

- రూ.15వేల కోట్ల ప్రతిపాదనలకు ముందడుగు
- ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి నిధులు
- రాజధాని నిర్మాణ ప్రణాళికల రూపకల్పనకు ప్రభుత్వం ఆదేశాలు
- ఆదివారం జీవో జారీ చేసిన పురపాలక శాఖ

అమరావతి అభివృద్ధి పరుగులు

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయాలని, అందుకోసం చేపట్టాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలని సీఆర్డీఏను ప్రభుత్వం ఆదేశించింది. రాజధాని అమరావతికి ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సంయుక్తంగా రూ.15వేల కోట్ల రుణ సహకారాన్ని అందించనున్నట్లు ఆ జీవోలో ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆ నిధులతో రాజధానిలో అత్యున్నత ప్రమాణాలతో మౌలిక సదుపాయాల, వసతులు, హరిత నిర్మాణాలు, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండేలా సుస్థిరాభివృద్ధి కార్యచరణను చేపట్టాలని పేర్కొంది. రాజధానిలో ప్రధాన రహదారులు, తప్పనిసరి అవసరాలకోసం వినియోగించే యుటిలిటీ డక్ట్‌లు, వర్షపు నీరు, వరద నీటి ప్రవాహాన్ని నియంత్రించేలా డ్రెయిన్‌లు, వరద కాలువలు నిర్మించాలని జీవోలో స్పష్టం చేసింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ జోన్లలో హరిత క్షేత్రాలు ఏర్పాటుచేయాలని, 24 గంటలూ స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, మానవ వ్యర్థాలను నిర్వహించే సీవరేజ్ వ్యవస్థను నిర్మించాలని, హరిత నియమావళికి అనుగుణంగా ప్రభుత్వ భవనాలు నిర్మించాలని, భవనాల పటిష్టతను పెంపొందించాలని, అందుకనుగుణంగా కొత్త పద్ధతుల్లో నిధుల సమీకరణ పద్ధతులను అవలంభించాలని పురపాలక శాఖ సీఆర్డీఏకి తెలిపింది.

● సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు

రాజధాని అమరావతి సుస్థిరాభివృద్ధికి సీఆర్డీఏ ప్రతిపాదనలు సమర్పించగా కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రతిపాదనలకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి కూడా ఆమోదం లభించినట్లు తెలిపింది. ప్రోగ్రామ్ ఫర్ రిజల్ట్స్(పీ ఫర్ ఆర్), రిసల్ట్ బేస్డ్ లెండింగ్(ఆర్‌బీఎల్) కార్యక్రమాల కింద ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు చెరో 800 మిలియన్ డాలర్ల నిధులు అందించనున్నాయి. మిగిలిన నిధులు కేంద్ర సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకోనున్నామని తెలిపింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం పొందేందుకు ఏపీ సీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అభివృద్ధి ప్రణాళికల ఆధారంగా దశలవారీగా బ్యాంకుల నుంచి నిధుల పొందే అవకాశం ఉండడంతో అందుకోసం ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి నిర్మాణ ప్రణాళిక కోసం బడ్జెట్లో ప్రత్యేక కేటాయింపులతో పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మొత్తం కార్యక్రమం, ప్రణాళికలు సీఆర్డీఏ కమిషనర్ అధీనంలో జరగనున్నట్లు జీవోలో పురపాలక శాఖ స్పష్టం చేసింది.



సభలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు తదితరులు

అటవీ సంరక్షణలో.. అధికారులకు స్వేచ్ఛ

- అమరవీరులను స్మరించుకోవడం మన బాధ్యత
- భావితరాలు గుర్తుంచుకునేలా విగ్రహాల ఏర్పాటు
- భవనాలకు అమర వీరుల పేర్లు
- అటవీ సంపదను నాశనం చేస్తే కఠిన చర్యలు
- టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేసే అవకాశం
- చెట్ల నరికివేతపై వాల్టా చట్టం కింద చర్యలు
- సరస్వతి భూముల్లో అక్రమాలపై విచారణ చేపడతాం
- అటవీ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నిధులు, సిబ్బంది కొరతను అధిగమించి అటవీ శాఖను అభివృద్ధి పథంలో నిలుపుతాం. వనరులను పరిరక్షించి అటవీ సంపదను కాపాడి భవిష్యత్తుతరాలకు అందజేయడం బాధ్యతగా భావిస్తున్నాను. అడవుల రక్షణకు అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం. ప్రకృతి వనరుల దోపిడీని అరికట్టేందుకు ఇప్పటికే టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశాం. ఆ నంబర్‌కి కాల్ చేస్తే ఇతర శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుని అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్ట వేస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఆదివారం గుంటూరు అరణ్య భవన్‌లో జరిగిన రాష్ట్ర అటవీ అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని స్మారక స్థూపం వద్ద అటవీశాఖ ఉన్నతాధికారులతో కలసి అమర వీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల

(మిగతా 6వ పేజీలో..)



అమవీరుల కుటుంబసభ్యులకు పండ్లు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



ఓడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రతిపాదిత స్థలం



సంక్షేమం.. అభివృద్ధి!

పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం కలగాలి

గుంటూరు ఛానల్ ఆధునీకీకరణ చేయాలనే డిమాండ్‌ను ఎప్పటి నుంచో రైతులు చేస్తున్నారు. ప్రస్తుతం 600 క్యూసెక్కుల సామర్థ్యాన్ని కలిగి 49 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్న దీనిని, 750 క్యూసెక్కులకు పెంచడంతో పాటు, మరో 22 కిలోమీటర్లమేర పొడిగించాలనే ప్రతిపాదనలు రైతుల నుంచి పలుసార్లు ప్రభుత్వానికి అందాయి. దీనికి సంబంధించి 2014--19 మధ్య టీడీపీ ఏలుబడిలో కొంతమేర కదలికి వచ్చింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనుల సంగతి మళ్లీ మొదటికొచ్చింది. దీని విషయంలో బడ్జెట్‌లో కేటాయింపులు దక్కుతాయనే ఆశలు రైతాంగం పెట్టుకుంది. నిజాంపట్నం హార్బర్ విస్తరణ పనులకు ఇప్పటికీ మోక్షం లభించలేదు. దాదాపు రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న చీరాల మండలం వాడరేవు ఫిషింగ్ హార్బర్ పనులకు నిధుల పెంపు కూడా బడ్జెట్‌లో వరాలు కురుస్తాయనే ఆశతోప్రజలు ఉన్నారు

పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గరనుంచి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెబుతోంది. అది ఆచరణ దాల్చే విధంగా తొలి అడుగు బడ్జెట్ పద్దు ద్వారా పడాల్సి ఉంది. ఇప్పటికే సూర్యలంక తీరంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం వంద కోట్ల నిధులు మంజూరు చేయగా, వాటి వినియోగంపై స్పష్టత రావాల్సి ఉంది. సమాంతరంగా చీరాల పరిధిలోని తీర ప్రాంత అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తే పర్యాటక రంగ పరంగా జంటనగరాలుగా ఇవి వర్ధిల్లే అవకాశం ఉంది

కరకట్టల పటిష్టత కోసం...

తాజాగా కృష్ణానదికి వచ్చిన వరదల వల్ల జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతాల గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని బతకాల్సి వచ్చింది. ఐదేళ్లలో కరకట్టలకు కనీస మరమ్మతులు కూడా వైసీపీ ప్రభుత్వం చేయకపోవడంతో అవి ఎక్కడికక్కడ లీకులు ఇచ్చి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇదే కాకుండా చివరికి ఆ కరకట్టల వద్ద మట్టి తవ్వకాలు జరిపి యథేచ్ఛగా గత పాలకులు దోచుకోవడంతో ప్రస్తుతం వాటి మనుగడే ప్రశ్నార్థకం అయింది. సెప్టెంబరులో కృష్ణానదికి అసాధారణంగా వచ్చిన వరదల వల్ల పలు చోట్ల కరకట్టలకు గండిపడడం వాటిని పూడ్చడం యంత్రాంగానికి సవాల్‌గా మారింది. వరదలు తగ్గుముఖం పట్టగానే కరకట్టల పటిష్టత కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పనులు చేపడతామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఆ దిశగా అడుగులేయడానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు సముచితంగా జరగాల్సి ఉంటుంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల పాటు జిల్లాలో అభివృద్ధి మచ్చుకైన కానరానీయకుండా వైసీపీ పాలన నడిచింది. ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించే కీలక ప్రాజెక్టుల విషయంలోనూ ఎడతెగని నిర్లక్ష్యం ప్రదర్శించింది. వివిధ ప్రాజెక్టుల పూర్తికి కేంద్రం ఇచ్చిన నిధులను సైతం యథేచ్ఛగా దారి మళ్లించిన ఘనత వైసీపీది. ఐదేళ్లలో జిల్లాకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో మొండిచెయ్యే గత ప్రభుత్వం చూపింది. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పూర్తి స్థాయి బడ్జెట్‌ను సోమవారం ఉభయసభల్లో ప్రవేశపెట్టనుంది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు ఎంతమేర నిధులు అవసరం అవతాయి అనే అంశంతో పాటు నూతనంగా చేపట్టాల్సిన పనుల విషయంలో ప్రతిపాదనలను ఆర్థిక మంత్రికి వినతుల రూపంలో ప్రజాప్రతినిధులు అందించడం జరిగింది. అభివృద్ధికి నిధుల కేటాయింపుతో పాటు సూపర్‌సిక్స్ పథకాల అమలుకు జిల్లా వ్యాప్తంగా కావాల్సిన నిధుల లెక్కలను గతంలోనే అధికారులు అందించారు. వీటన్నింటిని క్రోడీకరించుకుని బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధి సమతూకం కనబడేలా నిధుల కేటాయింపులు జరగనున్నాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. మరోవైపు అసెంబ్లీ సమావేశాలకు జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలందరూ హాజరు కానున్నారు

- అసెంబ్లీలో నేడు బడ్జెట్ సమర్పణ
- జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించే అవకాశం
- గుంటూరు ఛానల్ ఆధునికీకరణపైనా ఆశలు
- విద్య, ఆరోగ్య పథకాలకు కూడా దక్కనున్న సముచిత స్థానం!

వైద్యం....విద్య రంగాల కోసం...

జిల్లా కేంద్రమయిన బాపట్లలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను గత ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆ పనులను నిలిపివేశారు. నాబార్డ్ నిధుల విషయంలో దుర్వినియోగం జరిగిందనేది కూటమి పాలకుల విమర్శగా ఉంది. ఆ నిధులు ఎంతమేర కేటాయింపులు జరిగాయి, ఖర్చు పెట్టింది ఎంత అనే వివరాలతో పాటు దానిని పూర్తి చేయడానికి అయ్యే వ్యయం ఎంత వంటి అంశాలతో బడ్జెట్ సమావేశాల్లో నివేదిక ఇచ్చి అందుకు అనుగుణంగా కేటాయింపుల జరిపి పనులు ప్రారంభించాల్సిన అవశ్యకత ఉంది. అదే విధంగా విద్య విషయంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు పెద్ద పీట వేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతూ వస్తోంది. ఇందుకు అనుగుణంగా జిల్లాలో ఒక్క కళాశాల కూడా లేకపోవడం గమనార్హం. బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాలో నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేకంగా విద్యా సంస్థల ఏర్పాటు కోసం నిధుల కేటాయింపు జరిగితే ప్రభుత్వ ఉద్దేశం నెరవేరే అవకాశం ఉంది

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం....

హడావిడిగా జిల్లాల ఏర్పాటు అయితే గత ప్రభుత్వం చేపట్టింది కానీ అందుకు కావాల్సిన మౌలిక వసతుల మీద దృష్టి పెట్టకపోగా కనీస కేటాయింపులు కూడా జరపలేదు. ముఖ్యంగా అన్ని కార్యాలయాలు ఒకే చోట కొలువుదీరేలా సమీకృత కలెక్టరేట్ నిర్మాణం చేపడతామని, అందుకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని గత ప్రభుత్వం చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం కోసం నిధులు కేటాయింపు దక్కుతుందనే ఆశాభావాన్ని జిల్లా వాసులు వ్యక్తం చేస్తున్నారు

సూపర్‌సిక్స్ అమలు కోసం అయ్యే వ్యయం

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకున్న సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం జిల్లాలో ఎంత ఖర్చు కాగలదో గణాంకాలతో సహా నివేదిక పంపాలనే ఆదేశాలు గతంలోనే అధికారులకు అందాయి. వీటికి సంబంధించి పథకాల వారీగా అర్హులు అయ్యేది ఎంతమంది, ఎంత ఖర్చు కాగలదు అనే సవివర నివేదిక ప్రభుత్వానికి యంత్రాంగం అందించింది. దీని ఆధారంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు నిధుల కేటాయింపు జరగనుందని తెలుస్తోంది

చేతిలో ఫోన్ ఉంది కదా ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతూ ఇతరుల వ్యక్తిత్వం దెబ్బతీసే విధంగా పోస్టులు పెడితే ఇకపై వాటికి బాధ్యత వహించి సమాధానం చెప్పాల్సిందే. చట్టం కల్పించిన హక్కును ఉపయోగించుకుని హుందాగా, గౌరవంగా ఎలాంటి అంశం మీద అయినా అభిప్రాయం వెల్లడించడం వరకు ఓకే కానీ నన్నెవరూ గుర్తించరు కదా అనే ధైర్యంతో సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్‌పై ఇతరులను బూతులు తిట్టడమో లేక వారి వ్యక్తిత్వహననానికి పాల్పడడమో చేస్తే మాత్రం చట్టం నుంచి తప్పించుకోలేని విధంగా డేగకళ్లతో పోలీసు నిఘా వ్యవస్థ పనిచేయనుంది.

- సామాజిక మాధ్యమాల్లో వాడే భాష పట్ల జాగ్రత్త
- హుందాగా అభిప్రాయ వ్యక్తీకరణ ఉంటే ఓకే
- వ్యక్తిత్వ హననానికి పాల్పడితే తాఖీదులు తప్పవు
- మార్టూరులో ఓ వ్యక్తి ఫోన్‌నెంబర్‌తో అభ్యంతరకరపోస్టు
- చినగంజాం పోలీస్ స్టేషన్‌లో మరో ఫిర్యాదు
- వెదుక్కుంటూ వైజాగ్ వెళ్లిన మార్టూరు పోలీసులు
- డేగ కళ్లతో పోలీసు నిఘా....స్వేచ్ఛను దుర్వినియోగం చేయొద్దని హితవు

సోషల్‌లో వేషాలేస్తే.. ఊచలే!



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వాట్సాప్ గ్రూపుల్లో కానీ, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మాధ్యమం ఏదైనా కానీ అభ్యంతరకర భాష పట్ల పోలీసులకు ఫిర్యాదు అందినా, లేక పోలీసు కళ్లకు అలాంటి పోస్టు చిక్కినా సాంకేతికతను ఉపయోగించి 24 గంటల్లోనే ఆ పోస్టు పెట్టిన వ్యక్తిని చట్టం ముందు నిలబెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. సోషల్ మీడియా ఉన్మాద మూకల మీద కఠిన చర్యలు అవలంబించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో సదరు సామాజిక మాధ్యమాలలో హద్దు దాటి ప్రవర్తించే వారిపై పోలీస్ శాఖ దృష్టి పెట్టింది. ఇప్పటికే ఈ దిశగా జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. చట్టం కల్పించిన పరిమితులకు లోబడి భావప్రకటనా స్వేచ్ఛను ఉపయోగించుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ ఆ ముసుగులో ఇతరుల పట్ల విద్వేషాన్ని సభ్యసమాజం సిగ్గుపడే రీతిలో వ్యక్తీకరించే వారిపై మాత్రం చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఎస్పీ ఆదేశించారు. ఈ దిశగా ఇప్పటికే ఆయా సోషల్ మీడియా వేదికలలో హద్దు దాటిన వారిని గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది.

పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు

సోషల్ మీడియాలో బూతు బాషవాడుతూ పెట్టే పోస్టులను జల్లెడ పట్టే క్రమంలో భాగంగా మార్టూరు పరిధిలో ఓ ఉన్మాద పోస్టు ఖాకీల కంటబడింది. సభ్యసమాజం సిగ్గుపడే రీతిలో ఆ వ్యక్తీకరణ ఉండడం, ప్రభుత్వం ఇలాంటి వాటి మీద సీరియస్‌గా ఉన్న నేపథ్యంలో వెంటనే విచారణకు పోలీసులు రంగంలోకి దిగారు. విచారణలో భాగంగా మార్టూరుకు చెందిన ఓ వ్యక్తి ఫోన్ నంబరుతో వైజాగ్‌కు చెందిన ఒకరు ఆ పోస్టు పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకోవడానికి వైజాగ్ వెళ్లిన మార్టూరు పోలీసులకు ఆ పోస్టు పెట్టిన వ్యక్తి ఓ కేసులో అప్పటికే జైలులో ఉండడంతో తిరిగొచ్చారు. అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారాలోకేష్‌లపై అసభ్యకర పోస్టులు పెట్టారని పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడూరు గ్రామానికి చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజుపై చినగంజాం పోలీస్ స్టేషన్‌లో ఆగ్రామ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదయింది. ఈపురుపాలెం పోలీస్ స్టేషన్‌లో సోషల్ మీడియాలో అభ్యంతర కర పోస్టులపై కేసు నమోదయింది

గత ప్రభుత్వంలో ఫిర్యాదులు బుట్ట దాఖలు

సోషల్ మీడియాలో విశృంఖలత్వం పెచ్చుమీరడానికి గత ప్రభుత్వం అవలంబించిన వైఖరి కూడా కారణంగా నిలిచింది. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై సోషల్ మీడియాలో గళమొత్తిన ఎంతోమందిపై ఉన్మాద మూకలు పరుషపదజాలంతో విరుచుకుపడేవి. వీరిని సదరు నేతలే ప్రోత్సహించడతో తల్లి, చెల్లి తేడా లేకుండా బూతులతో ఎదురుదాడి చేసి వ్యక్తిత్వ హననానికి యథేచ్ఛగా పాల్పడేవారు. ఈ క్రమంలో బాధి తులు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చినా అధికారం అండతో వాటిని బుట్ట దాఖలు చేశారు తప్పితే పట్టించుకున్న పాపాన పోలేదు

బాధితులు బయటికొచ్చే అవకాశం

ప్రస్తుతం సోషల్ మీడియా వేదికలుగా రెచ్చిపోతున్న ఉన్మాద మూకలపై పోలీసు నిఘా కొనసాగనుంది. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఈ హక్కును దుర్వినియోగం చేసే వారి ఆట కట్టించాలన్న కృత నిశ్చయంతో ఉండడంతో గతంలో బాధితులుగా మిగిలిన ఎంతోమంది ఆ పోస్టుల ఆధారాలతో సహా స్టేషన్ మెట్లెక్కే అవకాశాలు కనబడుతున్నాయి. గడచిన ఐదేళ్ల వ్యవధిలో సోషల్ మీడియాలో అభ్యంతరకర భాష వాడడంతో పాటు ఉద్దేశపూర్వకంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారనే ఫిర్యాదులూ గణనీయంగానే వచ్చాయి. కానీ అప్పటి ప్రభుత్వం బూతు భాషను అధికారికం చేసే విధంగా వ్యవహరించడంతో పోలీసులకు సైతం వాటిపై స్పందించే అవకాశం లేకుండా పోయింది



గతంలో జరిగిన ఘటనలపై...

గతంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వేదికగా ఇతరుల గౌరవానికి భంగం కలిగించిన వారి వివరాలను సేకరించడంతో పాటు ఇంతకు ముందు అభ్యంతరకర పోస్టులపై వచ్చిన ఫిర్యాదులను స్టేషన్ల వారీగా జల్లెడ పట్టే పనిలో పోలీసు శాఖ నిమగ్నమయి ఉంది. ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఎక్కడా కూడా హుందాగా అభిప్రాయం వెలిబుచ్చే వాళ్లపై గాని, విమర్శ చేసే వాళ్ల యాక్టివిటీస్‌కు ఎలాంటి భంగం వాటిల్లదు. కానీ ఈ ముసుగులో చట్టాన్ని అతిక్రమించి వ్యవహరించే వారిపై డేగ కళ్లతో పోలీసులు పర్యవేక్షించే విధంగా సదరు శాఖ అప్రమత్తమైంది.

స్వాగతిస్తున్న పౌర సమాజం

సోషల్ మీడియా వేదికలుగా తమను ఎవరు ఏం చేయలేరన్న ధీమాతో హద్దులు దాటి ప్రవరిస్తున్న వికృతమూకలకు కళ్లెం వేసే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించడాన్ని జిల్లాలోని పౌర సమాజం స్వాగతిస్తోంది. స్వేచ్ఛ ముసుగులో జరుగుతున్న ఈ వ్యక్తిత్వ హనన క్రీడకు అడ్డుకట్ట వేయాల్సిందేనని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

'సలగల'కు ఎంపీ తెన్నేటి శుభాకాంక్షలు

బాపట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబును ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అభినందించారు. విద్యానగర్‌లోని సలగల నివాసం వద్ద ఆదివారం ఎంపీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో అక్కడకు తరలివచ్చి సలగల, ఎంపీ కృష్ణప్రసాద్‌లను ఘనంగా సత్కరించి సన్మానించారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ రాజేష్, కర్నేటి ఏడుకొండలు, భీమా లీలాకృష్ణ, గవిని దుర్గాప్రసాద్, నక్కా ప్రకాష్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు పమిడి భాస్కరరావు, తోట నాగేశ్వరరావు, సీనియర్ న్యాయవాది కళ్ళం హరినాధరెడ్డి, భోగిరి రామారావు పాల్గొన్నారు. అనంతరం ఎలిజిబెత్ బ్యారీ స్కూల్ విద్యార్థులతో భేటీ అయ్యారు. జీవిత సత్యాలు, చదువు ప్రాముఖ్యతను ఎంపీ కృష్ణప్రసాద్ విద్యార్థులకు వివరించారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జిల నియామకం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల నియోజకవర్గానికి గంటా అంజిబాబు, అద్దంకికి అడుసుమల్లి కిషోర్‌బాబు, చీరాలకు ఆమంచి కృష్ణమోహన్, వేమూరు నియోజకవర్గానికి బురగ సుబ్బారావును నియమిస్తూ పీసీసీ నిర్ణయం తీసుకుంది. ఇటీవలే విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ వేదికగా జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నేతలతో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమావేశమయి భవిష్యత్ కార్యాచరణపై మార్గనిర్దేశనం చేసిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలోనే జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు సమన్వయ కర్తలను నియమించే విషయంలో నేతలతో చర్చించి తుది నిర్ణయానికి వచ్చి ఆదివారం జాబితా విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్‌కు చీరాల కాంగ్రెస్ పార్టీ పగ్గాలు కూడా అధిష్టానం అప్పగించింది.

క్రీడాకారులతో ఆడుకున్నారు!

- వైసీపీ పాలనలో క్రీడారంగం చతికిల
- ఆటగాళ్లపై ఫీ'జులుం'
- ప్రవేశ, నెలవారీ రుసుం నిర్ణయించి వసూళ్లు
- మైదానాల గురించి పట్టించుకోని వైనం
- గత టీడీపీ హయాంలో నిర్మించిన స్టేడియంలు నిరుపయోగం
- కొన్నిచోట్ల ప్రైవేటు కార్యక్రమాలకు వేదికలుగా మారిన వైనం
- పూర్వ వైభవం కోరుతున్న సంఘాలు
- పే అండ్ ప్లే రద్దు చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి

జిల్లాలో క్రీడాకారులకు కొదువ లేదు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వివిధ పోటీల్లో రాణించి అనేక మంది మట్టిలో మాణిక్యాల్లా మెరిశారు. పలు పతకాలతో జిల్లా ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో క్రీడారంగం మసకబారింది. క్రీడాకారులకు ప్రోత్సాహం లేకపోవడం, అస్తవ్యస్త విధానాలు, అరకొర నిధుల కేటాయింపు అందుకు కారణమైంది. ఆటలపైనా నాటి ప్రభుత్వం ఫీ'జులుం' ప్రదర్శించింది. 'పే అండ్ ప్లే' విధానాన్ని ప్రవేశపెట్టి క్రీడాకారుల నుంచి రూ.లక్షలు దండుకొంది. ప్రాక్టీస్‌కు అవసరమైన మైదానాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో క్రీడాకారులు చతికిలపడ్డారు. ఈనేపథ్యంలో కూటమి అధికారంలోకి రావడంతో ఆటల అభివృద్ధిపై ఆశలు పెంచుకున్నారు. ప్రభుత్వం మారి నాలుగు నెలలు కావస్తున్నా పే అండ్ ప్లే విధానం కొనసాగుతుండటంపై క్రీడాకారులు, కోచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఒంగోలు (కార్పొరేషన్), నవంబరు 10 : క్రీడాకారులతో గత వైసీపీ పాలకులు ఆటలాడుకున్నారు. క్రీడల అభివృద్ధిని విస్మరించారు. ఆటలనే ఆదాయ మార్గంగా మార్చుకున్నారు. 'పే అండ్ ప్లే' విధానాన్ని తీసుకొచ్చి ప్రవేశ, ప్రాక్టీసు ఫీజులు వసూలు చేశారు. కోచ్‌లకు టార్గెట్లు నిర్ణయించి ఆమేరకు క్రీడాకారులను రప్పించాలని హుకుం జారీ చేశారు. ఆటగాళ్ల నుంచి వసూలు చేసిన నిధులకు లెక్కాపత్రం లేదు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభించక, అవసరమైన మైదానాలు లేక ఐదేళ్లుగా జిల్లాలో క్రీడారంగం పరాజయం బాటన నడిచింది.

యూజర్ చార్జీల పేరుతో శాప్ వసూళ్ల పర్వం

వైసీపీ అధికారంలోకి రాకముందు వరకు టీడీపీ పాలనలో క్రీడారంగం విజయం వైపు దూసుకెళ్లింది. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు, నియోజకవర్గాల వారీగా మినీ స్టేడియాల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో దాదాపు రూ.2కోట్లకు పైగా ఖర్చు చేసి స్టేడియం నిర్మించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మైదానంలో అడుగు పెట్టాలంటే ఓ రేటు, అడ్మిషన్ పొందాలంటే మరో రేటు, శిక్షణ పొందాలంటే నెల వారీ ఫీజు చెల్లించాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో శాప్ యూజర్ చార్జీలు అంటూ ఇలాంటి అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవడంతో క్రీడారంగం ఓటమిపాలైంది.

పోటీలు, పతకాలు కరువు

జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు, ప్రభుత్వ హాస్టల్స్‌లో ఉండే బాల, బాలికలు వారికి సమీపంలో ఉన్న మైదానాల్లో శిక్షణ పొందుతుంటారు. వ్యాయామోపాధ్యాయులు క్రీడలపట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులకు శిక్షణ అందించి ఎంపిక చేస్తారు. అత్యధికశాతం మంది గ్రామీణ ప్రాంత, పేద, క్రీడాకారులే ఉంటారు. అయితే 2019 సంవత్సరం వరకు వారు పైసా చెల్లించకుండానే అందుబాటులో ఉన్న మైదానాలు, కోచ్‌లు, ఆట పరికరాలతో శిక్షణ పొందిన గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగారు. అయితే ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు వారితో ఇష్టారాజ్యంగా ఆడుకున్నారు. అవసరమైన నిధులు కేటాయించకుండా పోటీల నిర్వహణకు దాతల సహకారంతో నిర్వహించుకోవాలని, క్రీడాకారుల నుంచి ఫీజులు వసూలు చేయాలని ఉత్వర్వులు జారీ చేశారు. దీంతో నాలుగున్నరేళ్లుగా పోటీలు లేకపోవడంతో పతకాలు కూడా కరువయ్యాయి.

ప్రైవేటు కార్యక్రమాలకు వేదికగా మినీ స్టేడియం

జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మినీ స్టేడియంల నిర్మాణాలు చేపట్టింది. ఒంగోలులో క్రీడామైదానం కోసం ఒంగోలుకు చెందిన పర్వతరెడ్డి ఆనంద్ రూ.1కోటి విరాళంగా ఇవ్వగా, ఆతర్వాత ప్రభుత్వం అదనంగా రూ.కోటికిపైన కేటాయించింది. అయితే షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో శిక్షణకు అవసరమైన చర్యలు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ప్రస్తుతం అది పేరుకు మాత్రమే అన్నట్లు ఉంది. మైదానంలో పోటీల నిర్వహణకు పలు క్రీడా సంఘాలు విన్నవించుకున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు, చీఫ్ కోచ్‌లు ఫీజులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక నగరపాలక సంస్థ పాఠశాలలకు చెందిన క్రీడామైదానాలలో నిర్వహించుకుంటున్నట్లు పలువురు కోచ్‌లు, వ్యాయామోపాధ్యాయులు వాపోతున్నారు. ఇదిలా ఉంచితే ఈ మైదానం ఇప్పుడు ప్రైవేటు కార్యక్రమాలకు వేదికగా మారింది. అత్యధిక జనాభా పట్టే ఆ మైదానంలో ఒకరోజుకు సుమారు రూ.20వేల నుంచి 25వేలు వసూలు చేస్తుండటంపై క్రీడా సంఘాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.



కోచ్‌లపై అదనపు భారం

క్రీడాప్రాధికార సంస్థకు చెందిన కోచ్‌లు నిత్యం సంబంధిత ఆటల్లో శిక్షణ ఇవ్వాలి. పే అండ్ ప్లే విధానంతో ఫొటోలు అప్‌లోడ్, యాప్‌లలో సాధించిన ప్రగతిని ఉదయం, సాయంత్రం తెలియజేయాల్సి వస్తోంది. దీనికితోడు క్రీడాకారుల వద్ద నుంచి ఫీజులు వసూలు చేయడంతోపాటు, పాఠశాలలు, కళాశాలలు నగదు చెల్లించి తిరిగి క్రీడాకారుల స్టేడియానికి వచ్చేలా మరో అదనపు పనిభారాన్ని మోపారు. దీంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఫీజు చెల్లించలేని విద్యార్థుల ఫీజులను కూడా కోచ్‌లు భరించాల్సిందేనని ఇక్కడి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు ఆదేశించడంతో అదనపు భారం మోయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో క్రీడాభివృద్ధిపై ఆశలు పెంచుకున్నారు. కానీ ఇప్పటి వరకూ పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఆ విధానాన్ని తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆటల అభివృద్ధికి తోడ్పాటు అందించడంతోపాటు, మైదానాల మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని క్రీడాకారులు, కోచ్‌లు, విద్యార్థులు కోరుతున్నారు.

అటవీ సంరక్షణలో అధికారులకు స్వేచ్ఛ

(5వ పేజీ తరువాయి)

కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. అటవీ సంపద దోచుకునే స్మగ్లర్లు, అరాచక మూకలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించి వీర మరణం పొందిన అటవీ సిబ్బంది త్యాగాలు వృథా కానివ్వకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా మనం పని చేయాలి. విధి నిర్వహణలో అశువులు బాసిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. రాజకీయ నాయకులు వాళ్ల ముందర కాళ్లకు బంధాలు వేయకుండా వాళ్ల పని వాళ్లను చేసుకోనిస్తే సరిపోతుందన్నారు.

సంజీవని పథకం ద్వారా నిధులు

అటవీ సంపద సంరక్షణలో కీర్తిచక్ర అవార్డు గ్రహీత దివంగత పందిళ్లపల్లి శ్రీనివాస్‌తో సహా 23 మంది అటవీ సిబ్బంది అమరులయ్యారు. అటవీ అధికారులు గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్‌తో పోరాటం చేసి శ్రీనివాస్ ప్రాణాలు వదిలారు. వీరి త్యాగాలను మనతో పాటు భావితరాలు మరిచిపోకూడదు. భవిష్యత్ తరాలు గుర్తించుకునేలా విగ్రహాల ఏర్పాటు చేస్తాం. నగర వనాలు, అటవీ శాఖ భవనాలకు వారి పేర్లు పెడతాం. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి తీసుకొచ్చిన సంజీవని పథకానికి పారిశ్రామికవేత్తలు, దాతలతో మాట్లాడి రూ. 5 కోట్ల నిధులు సమీకరిస్తాం. అమరవీరుల స్థూపాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. .

సరస్వతి పవర్ భూముల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపడుతాం

లా అండ్ ఆర్డర్ సమస్యలతోపాటు సరస్వతి పవర్ భూముల్లో 76 ఎకరాలు అసైన్డ్ భూములు, చుక్కల భూములు ఆక్రమించేశారు. దీనితోపాటు వాగులు వంకల సంరక్షణ బాధ్యత కూడా ఉంది. అటవీ శాఖ అధికారులతో ఈ అంశంపై చర్చిస్తున్నాము. పవర్ ప్లాంట్ పరిధిలో గ్రీన్ జోన్ ఏర్పాటు చేయాలి. కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు కూడా లేవు. సరస్వతి పవర్ వ్యవహారంలో పాల్పడిన ఉల్లంఘనలన్నింటిని పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పవన్ కల్యాణ్ చెప్పారు.

చెట్ల నరికివేతపై వాల్టా చట్టం కింద చర్యలు

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పర్యటనల పేరిట ఇష్టానుసారం రోడ్ల పక్కన ఉన్న చెట్లు నరికేశారు. ఈ చర్యలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీశాయి. ఈ వ్యవహారంలో బాధ్యులపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాము. చెట్ల నరికివేత మీద చర్యలు మొదలుపెడితే వైసీపీలో ఉన్న చాలా మంది నాయకులు ఊచలు లెక్కపెట్టాల్సి ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెట్ల నరికివేతపై మేము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీస్ శాఖ స్పందించలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, జేసీ భార్గవతేజ, నగర కమీషనర్ పులి శ్రీనివాసులు, జెడ్పీ ఛైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, ఉన్నతాధికారులు కజురియా, ఎస్.ఎస్. శ్రీధర్, రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనలో అపశ్రుతి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. కాన్వాయ్‌లోని ఓ కారును రోడ్డుపై సిబ్బంది అడ్డంగా నిలిపారు. సరిగ్గా అదే సమయంలో వస్తున్న అంబులెన్స్ కారును చూసి ఆగింది. ఆ సమయంలో అంబులెన్స్‌లో ఉన్న రోగికి ప్రాణపాయ స్థితి ఏర్పడింది. దీంతో పోలీసుల సహకారంతో అంబులెన్స్ సిబ్బంది రోడ్డుపైనే ప్రథమ చికిత్స నిర్వహించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటార్‌సైకిలిస్టుకు తీవ్రగాయాలు

అద్దంకి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న యువకుడుకి తీవ్ర గాయాల్యాయి. స్థానికుల కథనం మేరకు పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం ఏనుగుపాలెంకు చెందిన కాలువ ఏసోబు ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా నామ్ రోడ్డులో గోవాడ డొంక వద్ద అద్దంకి వైపు నుంచి కొప్పెరపాడు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఏసోబును 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు. ఏసోబు గోవాడ నుంచి ఏనుగుపాలెం వెళ్లేందుకు నామ్ రోడ్డుపై మలుపు తిరిగే సమయంలో ప్రమాదం జరిగిందా లేక అద్దంకి వైపు నుంచి వెళ్తుంటే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా అన్న విషయం పై స్పష్టత రాలేదు.

హనుమంతరెడ్డిపై కేసు

మేదరమెట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రాన్ని అవమానకరంగా మా ర్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన కడకు చెందిన హను మంతరెడ్డిపై మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేశారు. మేదరమెట్లకు చెందిన గోలి అజయ్ హను మంతరెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ షేక్ మహ్మద్ రఫి కేసు నమోదు చేశారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, నవంబరు 10 (ఆం ధ్రజ్యోతి): మండలంలో గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు ని ర్వహించారు. గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి చల్లగా కరుణించమని భక్తులు వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు.

తేలని పంచాయితీ

- పూర్వపు డీపీవో ఇష్టారాజ్య ఫలితం
- పోస్టింగ్‌లు లేక గాలిలో ఉన్న 56 మంది ఉద్యోగులు
- 50 రోజులుగా ఎదురుచూపులు
- పీఆర్ కమిషనర్‌కు కలెక్టర్ లేఖ రాసినా స్పందన కరువు
- సర్వీసు కోల్పోతామని గ్రేడ్-5,-6 సచివాలయ ఉద్యోగుల ఆందోళన



జిల్లా డీపీవో కార్యాలయం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేసే గ్రేడ్-5,6 (సచివాలయ) ఉద్యోగుల పోస్టింగ్‌ల విషయంలో ప్రతిష్ఠంభన కొనసాగుతూనే ఉంది. 50 రోజులుగా పంచాయితీ నడుస్తూనే ఉంది. పూర్వపు డీపీవో, కొందరు ఉద్యోగుల అవినీతి, అక్రమాల కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. దీంతో 56 మంది ఉద్యోగులకు ఎక్కడా పోస్టింగ్‌లు లభించక గాలిలోనే ఉండిపోయారు. వారంతా ప్రస్తుతం దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తాము సర్వీసు కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బదిలీల్లో భారీగా అక్రమాలు

ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అన్నిశాఖల్లో ఆ ప్రక్రియను సాఫీగానే పూర్తి చేశారు. అయితే జిల్లా పంచాయతీ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అవినీతి, అక్రమాలు భారీగా చోటుచేసుకోవడంతో గందరగోళం నెలకొంది. బదిలీల ఉత్తర్వులు ఇచ్చేందుకు ఉద్యోగుల నుంచి అప్పటి అధికారి, కొందరు ఉద్యోగులు పెద్దమొత్తంలో వసూలు చేశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రిసభ్య కమిటీని నియమించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో విచారణ చేపట్టిన కమిటీ అక్రమాలు నిజమేనని తేల్చింది. నివేదికను కలెక్టర్‌కు సమర్పించింది. దాన్ని పరిశీలించిన కలెక్టర్.. ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీరాజ్ కమిషనర్‌కు 15 రోజుల క్రితం లేఖ రాశారు. దానికి త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికను కూడా జతచేసి పంపారు. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి స్పందన లేదు. విచారణ ముగిసే లోపే ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. అప్పట్లో డీపీవోగా ఉన్న ఉషారాణిపై చర్యలకు కలెక్టర్ సిఫార్సు చేశారు.

కలెక్టర్ ప్రొసీడింగ్స్‌కు భిన్నంగా బదిలీలు

ఉద్యోగుల బదిలీలను కలెక్టర్ అన్సారియా ఇచ్చిన ప్రొసీడింగ్స్‌కు భిన్నంగా చేసినట్లు గుర్తించారు. దీంతో 56 మంది ఉద్యోగులకు పోస్టింగ్‌లు లేక గాలిలో ఉండిపోయారు. వారంతా కలెక్టర్‌తోపాటు ప్రస్తుత జిల్లా పంచాయతీ అధికారిని కలిసి గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో జిల్లాలో ప్రస్తుతం పోస్టింగ్ లేక గాలిలో ఉన్న ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు పంచాయతీరాజ్ కమిషనర్‌కు 15 రోజుల క్రితం కలెక్టర్ లేఖ రాశారు. ఇప్పటి వరకూ అక్కడి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం గాలిలో ఉన్న ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని ఉద్యోగుల విజ్ఞప్తి

ప్రభుత్వ ఉద్యోగులకు సర్వీసు అనేది ఎంతో ముఖ్యమైంది. భవిష్యత్‌లో ఉద్యోగోన్నతలు దాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. ప్రస్తుతం గాలిలో ఉన్న ఉద్యోగులకు 50 రోజుల నుంచి పోస్టింగ్‌లు లేకపోవడంతో భవిష్యత్‌లో ఉద్యోగోన్నతులు కోల్పోతామని వారంతా ఆందోళన చెందుతున్నారు. వీరికి పోస్టింగ్‌లు ఇప్పించే విషయంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు. కలెక్టర్ చొరవచూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

---

104 ఉద్యోగుల ఆందోళన

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ 104 ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ 104 ఉద్యోగుల విషయంలో అరబిందో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. వారిని బానిసలుగా చూస్తున్నదని మండిపడ్డారు. కనీస వేతనాలు ఇవ్వకపోగా ప్రభుత్వం అంగీకరించిన స్లాబ్ సిస్టం అమలు చేయలేదని మండిపడ్డారు. ఉద్యోగులకు సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐలలో యాజమాన్యం వాటా కట్టకుండా మోసం చేసిందని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని ఆ సొమ్మును రికవరీ చేసి కార్మికుల ఖాతాలో జమచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే కొత్త ఉద్యోగాలలో 104 సిబ్బందికి వెయిటేజ్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 104 ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి కె.రవివర్మ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ నెలరోజులుగా వివిధ పద్ధతుల్లో ఆందోళనలు చేస్తున్నా అరబిందో యాజమాన్యం కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు అబ్బూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో శ్రీధర్‌రెడ్డి, నరేంద్ర, సుబ్బయ్య, శ్రీకాంత్, ఉదయభాస్కర్, వెంకటేశ్వర్లు, శ్వేత, స్వాతి, పావని పాల్గొన్నారు.



రామాపురం డంపింగ్ యార్డులో చెత్త, మధ్య పనిచేయని మిషన్

చె(చి)త్త శుద్ధి శూన్యం

- మూలనపడ్డ యంత్రాలు
- అలంకారప్రాయంగా వర్మీ కంపోస్టు భవనాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



మూలనపడ్డ కొబ్బరిపీచు తీసే మిషన్

వేటపాలెం(చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెత్త శుద్ధిలో పాలకులు, అధికారులు చిత్తశుద్ధి చూపడం లేదు. దీంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ అలంకార ప్రాయంగా మారింది. చెత్త విభజన, చెత్త నుంచి సంపద తయారీ ప్రక్రియలు మూలనపడ్డాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరటం లేదు.

చీరాల మున్సిపల్ పరిధిలో చెత్త సమస్య తలెత్తకుండా వేటపాలెం మండలం రామాపురం పరిధిలో సుమారు రూ.5 కోట్లు వ్యయంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. చీరాల మున్సిపల్ పరిధిలో వచ్చే చెత్తను ట్రాక్టర్లు, డోజర్లు ద్వారా అక్కడకు తరలిస్తారు. అక్కడ తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి చెత్త నుంచి సంపద సృష్టించేవిధంగా చర్యలు చేపట్టాలనేది పథక లక్ష్యం.



అలంకారప్రాయంగా వర్మీ కంపోస్టు భవనాలు

అయితే ప్రస్తుతం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ కాస్త డంపింగ్ యార్డుగా మారింది. కేవలం అక్కడకు తరలించిన చెత్తను తగులబెట్టటం మాత్రమే చేస్తున్నారు. కొబ్బరి బొండాల పీచు వలిచే యంత్రం మూలనపడింది. ఇతర యంత్రాలదీ అదే పరిస్థితి. అన్నీ మూలనపడ్డాయి. ఆయా పరికరాలకు ఉన్న మోటార్లు దొంగల పాలయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెత్త నుంచి సంపద సృష్టించడం అటుంచితే, కనీసం కుళ్లిన చెత్త నుంచి వర్మీ కంపోస్టును తయారు చేసేందుకు నిర్మించిన భవనాలు కూడా మూలనపడుతున్నాయి. దీంతో ఏ లక్ష్యంతో అయితే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేశారో ఆ లక్ష్యం నెరవేరడం అటుంచి ఆ ప్రాంతమంతా కాలుష్య కాసారంలా మారుతోంది. ఇది ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చెత్త శుద్ధి చర్యలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మిరపకు స్వస్తి .. పొగాకుపై ఆసక్తి

- మండలంలో పెరిగిన బర్లీ సాగు
- నష్టాలతో రూటు మార్చిన రైతులు

పంగులూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బర్లీ పొగాకు సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మిరప సాగు తగ్గడం, రైతులు విస్తారంగా పొగాకు సాగుకు సన్నద్ధం కావడంతో పొగ నారుకు మార్కెట్లో గిరాకీ పెరిగింది. గత ఏడాది బర్లీ పొగాకు సాగు చేసిన రైతాంగం మంచి లాభాలు గడించడంతో అధిక శాతం రైతులు పొగాకు సాగుకు మొగ్గుచూపుతున్నారు. గత ఏడాది వెయ్యి నుంచి 1100ల ఎకరాలలో సాగయిన పొగాకు ఈ ఏడాది నాలుగు వేల ఎకరాలలో పొగాకు సాగయ్యే పరిస్థితి కనిపిస్తుంది. మిరప సాగులో పడిన కష్టాలు, చవి చూసిన నష్టాలతో రైతులు మిరప మంగళం పాడారు.



నారుమళ్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగనారు



చందలూరు పొలంలో పొగ మొక్కలు నాటుతున్న కూలీలు

గత ఏడాది సుమారు రెండు వేల ఎకరాలలో మిరప సాగు చేసిన రైతాంగం ఈ ఏడాది 300 ఎకరాలకు పరిమితమయ్యారు. మిరపసాగులో పెరిగిన పెట్టుబడి, పురుగు, తెగుళ్ళ బెడదతో ఆశించిన దిగుబడులు రాని పరిస్థితితో పాటు మార్కెట్లో దిగజారిన ధరలతో మిరప సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టాలు చవిచూశారు. పొగాకు సాగులో పంట నష్టపోయే పరిస్థితి ఉండదని, సాగు చేసిన 60 రోజుల కాలవ్యవధిలో చేతికొచ్చిన పొగాకు అమ్మకాలతో రైతుకు కలిగే పెట్టుబడి ఎసులుబాటు, మార్కెట్లో పొగాకుకు ఉన్న గిరాకీతో రైతులు పొగాకు సాగుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో గత ఏడాది చందలూరులో 800 ఎకరాలలో మిరప సాగు చేసిన రైతులు ఈ ఏడాది 100 ఎకరాలకు పరిమతం కాగా, కొప్పెరపాడులో 300 నుంచి 50 ఎకరాలకు, నూజెళ్లపల్లిలో 600 నుంచి 350 ఎకరాలకు, బూదవాడలో 450 నుంచి 100 ఎకరాలకు మిరప సాగు తగ్గడం జరిగిందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు.. పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు తెల్ల బర్లీ సాగు చేయాలనే సూచన చేస్తున్నప్పటికీ గత ఏడాది తెల్ల బర్లీ, నల్ల బర్లీ కొనుగోలులో వ్యత్యాసం లేక పోవడంతో దిగుబడి అధికంగా ఉండే నల్ల బర్లీ వైపు రైతాంగం మొగ్గు చూపుతున్నారు. మండల కేంద్రమైన పంగులూరు, చందలూరు, నూజెళ్లపల్లి, కొప్పెరపాడు, బూదవాడ పరిసర గ్రామాలలో పొగాకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు.

సాగు విస్తీర్ణం పెరగడంతో నారుకు పెరిగిన గిరాకీ

బర్లీ పొగాకు సాగు విస్తీర్ణం పెరగడంతో మార్కెట్లో పొగ నారుకు గిరాకీ పెరిగింది. సాగు పెరగడంతో పాటు ముందుగా వేసిన పొలాలలో అధిక వర్షాలకు నాటిన పొగ మొక్కలు దెబ్బతినడంతో పొగనారుకు గిరాకీ పెరిగింది. పంగులూరులో పొగనారుకు గిరాకీ ఉంటుందని భావించిన పలువురు రైతులు బోర్ల కింద పొగనారును విస్తారంగా సాగు చేశారు. పొగ నాట్లు ముమ్మరం కావడంతో రైతులు నారుకోసం పొగ నారుమళ్ల వైపు పరుగులు పెడుతున్నారు.

నేతన్నల అభ్యున్నతికి కృషి చేస్తాం

డాక్టర్ హేమలత

కొత్తపేట (చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) నేతన్నల అభ్యున్నతికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని ఏపీ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత చెప్పారు. చైర్మన్‌గా నియమితులైన నేపథ్యంలో టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ముందుగా చీరాల పట్టణంలోని పలువురు మహనీయుల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మృతి



మార్టూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ మాజీ సభ్యుడు, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు అమర్నేని హనుమంతరావు (60) అనారోగ్యంతో ఆదివారం మార్టూరులో ఇంటిలో మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా కిడ్నీ సమస్య కారణంగా ఆయన బాధపడుతున్నారు. ఆయన మృతదేహానికి టీడీపీ మండల నాయకులు తొండెపు ఆదినారాయణ, బండి నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. ఇదిలావుండగా శనివారం హనుమంతరావు తండ్రి ఆంజనేయులు మృతిచెందారు.

ముస్లిం సామాజిక భవనానికి రూ.50లక్షలు

బల్లికురవ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన గ్రామంలో ముస్లిం సామాజిక భవనానికి రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయని పంచాయతీ రాజ్ జేఈ కె.మాధవ్ తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ద్వారా ఈ నిధులు మంజూయ్యాయని త్వరలో టెండర్లు పూర్తి కాగానే నూతన భవన నిర్మాణ పనులు మెదలు పెడతామని ఏఈ తెలిపారు.

బొల్లాపల్లి జీఎన్‌టీ నుంచి నీరివ్వాలి

- ప్రణాళికను తయారు చేయాలంటున్న మార్టూరు గ్రామస్థులు
- తద్వారా వేగంగా చెరువుకు చేరనున్న నీళ్లు
- కూటమి ప్రభుత్వంపై కొండంత ఆశ
- అదే శాశ్వత పరిష్కారమంటున్న ప్రజలు



మార్టూరు రక్షిత మంచినీటి చెరువు (ఫైల్)

మార్టూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాతిక వేలకు పైగా జనాభా కలిగిన మేజర్ పంచాయతీ మార్టూరులో ప్రజల తాగునీటికి ఇబ్బందులు లేకుండా శాశ్వతమైన పరిష్కారం దిశగా గ్రామస్థులు ఆలోచన చేస్తున్నారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండాలంటే మొదటిగా మార్టూరు మంచినీటి చెరువులో పుష్కలంగా నీళ్లు ఉండాలి. మరి మంచినీటి చెరువులో నీళ్లు సమృద్ధిగా ఉండాలంటే ప్రస్తుతం చెరువుకు చేరుతున్న సాగర్ జలాలు దారి పూర్తి స్థాయిలో అనుకూలంగా లేదు. సాగర్ మెయిన్ కాలువ నుంచి మంచినీటి చెరువుకు నీళ్లు చేరడానికి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో నెలరోజులకు పైగా సమయం పడుతున్నది. అంతే కాకుండా చెరువు కు తాగునీరు పెట్టే సమయంలో ప్రతిసారీ గ్రామ పంచాయ తీకి లక్షల్లో డబ్బులు ఖర్చు అవుతున్నాయి. దానికి తోడు రా త్రింబవళ్లు పంచాయతీ కార్మికులు కాలువ గట్లపై, పొలాల వద్ద, చెరువు వద్ద నీటి కోసం కాపలా ఉండాల్సి వస్తుంది. అందువలన ప్రస్తుతం ఉన్న మార్గంలో కాకుండా చెరువుకు సాగ ర్ జలాలు చేరడానికి కొత్త ప్రణాళికను రూపొందించాల్సిన అ వసరం ఉందని గ్రామస్థులు, గ్రామ ప్రజా ప్రతినిధులు అంటున్నారు.



మార్టూరు చెరువుకు నీరు రాకుండా రాజుపాలెం మేజర్‌లో నాగరాజుపల్లి తూము వద్ద వేసిన అడ్డుకట్ట (ఫైల్)

ప్రస్తుతం చెరువుకు చేరుతున్న సాగర్ జలాలు

30 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన మార్టూరు మంచినీటి చెరువుకు సాగర్ మెయిన్ కాలువ నుంచి రాజుపాలెం మేజరు ద్వారా సాగర్ జలాలు చేరుతున్నాయి. అంటే దాదాపుగా 10 కి.మీ.కి పైగా సాగర్ జలాలు ప్రయాణించి, మార్టూరు చెరువుకు నీళ్లు చేరతాయి. కానీ ఈ నీళ్ల ప్రయాణించే రాజుపాలెం మేజర్ ద్వారకపాడు, వలపర్ల, ఇసుకదర్శి గ్రామాల రైతులు పంట అవసరాలు కోసం నీళ్లను ఉపయోగించుకుంటారు. వాటిని దాటి సాగర్ జలాలు నాగరాజుపల్లి కాలువ వద్దకు వచ్చేసరికి, నాగరాజుపల్లి, రాజుపాలెం గ్రామస్థులు వారి పొలాలు, చెరువులతోపాటు అవసరాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలాసార్లు నాగరాజుపల్లి, రాజుపాలెం గ్రామాలకు చెందిన కొంతమంది ఏకంగా మార్టూరు చెరువుకు నీళ్లు వచ్చే తూము వద్ద అడ్డుకట్టగా ఇసుక బస్తాలు వేస్తున్నారు. ఈ విషయంలో పలుసార్లు మార్టూరు గ్రామ పంచాయతీ అధికారులకు రైతుల మధ్య వివాదాలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఈ తూము దగ్గర నుంచి మరో 3 కిమీ దూరం ప్రయాణించాకే మార్టూరు చెరువుకు నీళ్లు చేరుతాయి. ఈ కారణాలతో చెరువు నిండాలంటే నెలరోజులకు పైగా సమయం పడుతుండడం, ఈ వ్యవధిలో సాగర్ జలాలు ఆగిపోవడం జరుగుతున్నది. ప్రస్తుతం ఉన్న పథకం 2004లో మార్టూరు నియోజకవర్గం ఉన్న సమయంలో అప్పటి శాసనసభ్యుడు, ప్రస్తుత మంత్రి గొట్టిపాటి రవికుమార్ హయాంలో నిర్మాణం జరిగింది.

బొల్లాపల్లి వద్ద మెయిన్ కాలువ నుంచి చెరువుకు పైపులైను వేయాలి

బొల్లాపల్లి జీఎన్‌టీ వద్ద సాగర్ మెయిన్ కాలువ నుంచి భూమిలో అండర్ పైపులైన్‌ను మార్టూరు చెరువు వరకూ ఏర్పాటు చేయాలని, తద్వారా 15 నుంచి 20 రోజులలోనే చెరువు పూర్తిగా నిండుతుందని పంచాయతీ అధికారులు చెప్తున్నారు. గతంలోనూ 2014 నుంచి 2019 మధ్య కాలంలో అప్పుడు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం బొల్లాపల్లి నుంచి చెరువుకు కొత్త పథకంపై అధికారులు పరిశీలన చేశారు. కానీ ఎందుకనో అది ఆచరణలోకి రాలేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొత్త పథకంపై ప్రజల్లో చర్చ సాగుతోంది. ఈ విషయమై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై ప్రజలు కొండంత ఆశలు పెట్టుకున్నారు. కొత్త పథకం అమలైతే మార్టూరు చెరువులో పూర్తి స్థాయిలోకి నీరు చేరి, ప్రజలకు వేసవి కాలంలో కూడా తాగునీటికి ఇబ్బంది ఉండదని అంటున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.



విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

దాతల తోడ్పాటుతో ఉన్నతంగా ఎదగాలి

చీరాలటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు దాతలు అందించే తోడ్పాటును వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి ఆధ్వర్యంలో ఐదుగురు పేద విద్యార్థినులకు రోటరీ క్లబ్‌ఆఫ్ హైదరాబాద్ నార్త్ ప్రతినిధులు సైకిళ్లను పంపిణీ చేశారు. స్థానిక నవాబ్‌పేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో సైకిళ్లను బాలికలకు అందజేశారు అనంతరం మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు అవకాశాలు ఉపయోగించుకుని ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి రవితేజ్, సభ్యులు దేవరాజ్, రమణ, రామకృష్ణరమణారావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంప్

చినగంజాం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాలలో ఆధార్ మొబైల్ క్యాంపులను ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి ఆదివారం తెలిపారు. 11వ తేదీన సంతరావూరు గ్రామ సచివాలయంలో సంతరావూరు, గొనసపూడి, 12న కడవకుదురు గ్రామ సచివాలయంలో కడవకుదురు, మోటుపల్లి, 13న చినగంజాం గ్రామ సచివాలయంలో చినగంజాం, పల్లెపాలెం, మున్నంవారిపాలెం, 14న కొత్తపాలెం గ్రామ సచివాలయంలో కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, 15న పెదగంజాం గ్రామ పచివాలయంలో ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి లోపు పిల్లలకు పుట్టినరోజు సరిజేయాలంటే ఆన్‌లైన్ చేసిన పుట్టినరోజు సర్టిఫికెట్ కావాలని, వాళ్ల తండ్రి లేక తల్లి వచ్చి వేలిముద్ర వేయాలని, ఇంటర్ చదివే విద్యార్థులకు పేరు సరిచేయాలంటే పదో తరగతి మార్కుల లిస్ట్ ఒరిజినల్ తెచ్చుకోవాలని, పుట్టిన రోజుని సరి చేయాలంటే పుట్టిన రోజు సర్టిఫికెట్ తీసుకొని రావాలని తెలిపారు. గ్రామ కార్యదర్శులు గ్రామాల్లో క్యాంపులు జరిగే ముందు రోజు టాంటాం, ఇతర ప్రచార సాధనాల ద్వారా ఆధార్ నమోదు గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీడీవో తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్సు అధికారులు ఆదివారం బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి 126 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి నుంచి వచ్చిన స్టేట్ టాస్క్‌ఫోర్సు బృందం ఆదివారం అద్దంకి మండలం ధర్మవరంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న శ్రీరాములు వద్ద నుంచి 106 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అద్దంకి ఎక్సైజ్ సీఐ భవాని, ఎస్సై విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బల్లికురవలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పి.ఏడుకొండలు వద్ద 12 బాటిళ్ల, ఎం.రంగారావు వద్ద 18 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు నిర్వహిస్తున్నారు.

మత్తు తలకెక్కింది!

- రామాపురం సముద్రతీరంలో యువకుడి హల్‌చల్
- ప్రమాదం నుంచి రక్షించిన పోలీసులు
- ఏరియా వైద్యశాలకు తరలింపు



ఏరియా వైద్యశాలలో అపస్మారక స్థితిలో గోపీ

రామాపురం (చీరాలటౌన్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సరదాగా స్నేహితులతో రామాపురం సముద్రతీరంలో ఈతకు వచ్చి మద్యం మత్తులో యువకుడు హల్‌చల్ చేశాడు. ఈక్రమంలోనే ప్రమాదబారిన పడుతున్నట్లు గ్రహించిన పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పసుమర్తికి చెందిన గుంజి గోపీ తన తమ్ముడు అంకమ్మరావు, స్నేహితులు శ్రీకాంత్, శ్రీనుతో కలిసి నలుగురు రెండు ద్విచక్ర వాహనాలపై రామాపురం బీచ్‌కు ఆదివారం వచ్చారు. ఈక్రమంలో మద్యం సేవించిన గోపీ సాధారణ స్థితిని కోల్పోయాడు. దీంతో సముద్రంలోకి వెళ్లి హల్‌చల్ చేశాడు. నీళ్లు తాగి అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే స్పందించిన రూరల్ ఏఎస్సై శివకుమారి, మెరైన్ పోలీసులు అతడిని సముద్రంలో నుంచి బయటకు తెచ్చారు. వెంటనే 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం అతను అపస్మారక స్థితిలోనే ఉన్నాడు.

ప్రమాదాల బారిన పడకండి

- శేషగిరిరావు, రూరల్ సీఐ

కార్తీకమాసం సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులు, మందు బాబులు జాగ్రత్తలు పాటించాలి. నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే స్నానాలు చేయాలి. భిన్నంగా వ్యవహరించి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. సముద్రతీరంలో భక్తుల రక్షణ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. గట్టి బందోబస్తును ఏర్పాటు చేశాము.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి

మార్టూరు, నవంబరు10(ఆంధ్రజ్యోతి):గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తమ్ములూరి నాగేశ్వరరావు (45) అనే ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో మార్టూరు సెంటర్లో స్టేట్‌బ్యాంక్ ముందు సర్వీసురోడ్డులో జరిగింది. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.అతను మండలంలోని రాజుపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందినవారు.అతను టీవీఎస్ వాహనంపై మార్టూరు సెంటరు కు వచ్చిన సమయంలో వెనుకవైపు నుండి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ ప్రమాదంపై సమాచారం అందడంతో ఎస్ఐ సైక్ సైదా సంఘటనా స్థలానికి చేరి, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మార్టూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ హైస్కూల్‌లో 1983-84 సంవత్సరం 10 వతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల పరిధిలోని రాజుపాలెం రోడ్డు వద్ద శ్రీ సాయి బాలాజీ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి ఘంటసాల బంగారుబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కాకోలు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఒకే వేదికలో కలిసిన వారంతా చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు అడుగుల రామాయాచారి, ఎం.పిచ్చయ్య శర్మ, పీ తిరుపతమ్మను ఘనంగా సన్మానించారు. ఉత్తమ విద్యార్థులైన యక్కల మోహిని, మద్దు శ్రీనివాసరావును వారు సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బత్తుల వెంకటేశ్వర్లు, ముప్పా మధు సూదనరావు, జాష్ఠి సాంబ శివరావు, మద్ది రంగ, జీ బుల్లెంకమ్మ, పొత్తూరి రమేష్, అరుణ, పద్మావతి పాల్గొన్నారు.



ఆత్మీయ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఓటర్ల జాబితాను ప్రచురిస్తున్న అధికారులు

నీటి సంఘాల ఓటర్ల జాబితా సవరణ

పర్చూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నీటి సంఘాల ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఆదివారం ప్రకటన విడుదల చేసినట్లు తహసీల్దార్ పీ బ్రహ్మయ్య తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో ఓటర్ల జాబితా సిద్ధంగా ఉందన్నారు.. ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ సారధ్యంలోని సిబ్బంది మండలంలోని ఉప్పుటూరు, నూతలపాడు, చెరుకూరు, రమనాయపాలెం గ్రామ సచివాలయాల్లో ఓటర్ల జాబితాకు సంబంధించిన నోటీసులను అంటించారు. రైతులు ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేవో సరిచూసుకోవాలన్నారు. సంబంధిత గ్రామాల రైతులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 11, 12 తేదీలలో రెవెన్యూ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. ఈనెల 13న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

బల్లికురవ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని బాపట్ల జిల్లా రైతు సంఘం కార్యదర్శి తలపనేని రామారావు కోరారు. ఆదివారం బల్లికురవ మండల కేంద్రంలో మండల శాఖ అధ్యక్షుడు నాగబోయిన సింగారావు అధ్యక్షతన మండల రైతు సంఘ సమావేశం జరిగింది. రామారావు మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న చివరి భూములకు సాగు నీరు సక్రమంగా అందడం లేదన్నారు. పలుచోట్ల డీఏపీ ఎరువులు అందుబాటులో లేవన్నారు. పంటల బీమా సొమ్మును ప్రభుత్వమే చెల్లించాలని, జీరో వడ్డీ రాయితీలు అందజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు, రైతులు చింతల సుబ్బారావు, అంజయ్య పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పర్చూరులో యోగా చేస్తున్న చిన్నారులు

పర్చూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచే యోగా చేస్తే మంచి దేహదారుఢ్యంతోపాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని కఠారి సత్యనారాయణ అన్నారు. ఆదివారం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శిక్షకుడు సత్యనారాయణ నేతృత్వంలో చిన్నారులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు, ఆరోగ్యంపై విద్యార్థులు దృష్టిసారించాలన్నారు. యోగాతోపాటు, ధ్యానం కూడా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొసనా వెంకటేశ్వర్లు, కాసా అజేయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థుల ఆకలి కేకలు

- గ్యాస్ సిలిండర్ రాక ఆలస్యంగా అల్పాహారం
- ఇటీవల ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటనలో వెలుగు చూసిన లోపాలు
- అయినా మారని నిర్వాహకుల తీరు



సిలిండర్ కోసం పడిగాపులు కాస్తున్న వంట సిబ్బంది

చీరాలటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని జాతీయ రహదారి ఈపూరుపాలెం వద్ద గల కేజీబీవీ స్కూల్ విద్యార్థులు ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. శనివారం రాత్రే గ్యాస్ సిలిండర్ కొరత ఏర్పడింది. ఈక్రమంలో ఆదివారం ఉదయానికి అప్రమత్తమై జాగ్రత్తలు చేపట్టాల్సిన నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఉదయం ఎనిమిది గంటలకు అందించాల్సిన అల్పాహారం 10 గంటల వరకు అందలేదు. దీంతో హాస్టల్లో ఉన్న సుమారు 250 మంది విద్యార్థినులు ఆకలితో అలమటించారు. సమాచారం అందుకున్న మీడియా ప్రతినిదులు అక్కడికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అయితే విషయం ఎక్కడ వైరల్ అవుతుందోనని హాస్టల్లో ఆడపిల్లలున్నారంటూ గేట్లు మూసేశారు. అయితే అప్పటికే విషయం కలెక్టర్ వెంకటమురళి దృష్టికి వెళ్లడంతో ఆయన ఆగ్రహించినట్లు సమాచారం. దీంతో అప్పడు చలనం కలిగిన నిర్వాహకులు గ్యాస్ ఏజెన్సీ వారిని సంప్రదించి అప్పటికప్పుడు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల సాక్షాత్తు ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటనలో సైతం కుళ్లిన కూరగాయలు వంటకు సిద్ధంగా ఉన్న విషయం తెలిసిందే. అయినా వీరి తీరు మారకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో కొప్పెరపాడు విద్యార్థులకు ప్రథమస్థానం

బల్లికురవ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. శని, ఆదివారాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ విశాఖలో జరిగింది. బాపట్ల జిల్లా నుంచి బల్లికురవ మండలం కొప్పెరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. 22 జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు క్విజ్, టాలెంట్ టెస్ట్, ప్రయోగాలు నాలుగు విభాగాలలో జరిగిన సైన్స్ పోటీలలో కొప్పెరపాడు పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.సాయిచరణ్ తేజ, బీ కోటేశ్వరరావు, షేక్ మస్తాన్ రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచారు. వారికి నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు. ఈసందర్భంగా సైన్స్ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యాయులు జి.నాగేశ్వరరావు, పి.బాలాజీ, పి.జానకిరాందాస్, పి.విజయరోజ్‌తోపాటు విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు అభినందించారు.

యువకుడి అదృశ్యంపై కేసు

వేటపాలెం(చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యువకుడి అదృశ్యంపై వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పందిళ్లపల్లికి చెందిన పి.వెంకటేశ్వర్లు(23) గత నెల 16వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో అతని తండ్రి పుల్లయ్య ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆంజనేయరాజుకు కళాపురస్కారాన్ని అందజేస్తున్న సభ్యులు

నటనతో అద్దంకికి ఖ్యాతిని తెచ్చిన ఆంజనేయరాజు

అద్దంకిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి శ్రీరామమూర్తి మొదలు బండారు రామారావు, పుట్టంరాజు శంకరరావు, అద్దంకి మాణిక్యాలరావు, మిద్దెబోయిన ఆంజనేయరాజు వంటి నటులు తమ నటనా ప్రతిభతో అద్దంకికి ఖ్యాతిని తెచ్చిపెట్టారని సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకర్‌దత్తు అన్నారు. ఆదివారం స్థానిక మారంవారి సేవా సదన్‌లో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ కళాపురస్కార సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జానపద పురాణ పాత్రలలో అద్భుతంగా నటించి రంగస్థల రంగానికి ఎనలేని ఖ్యాతిని తెచ్చిన వారిలో ఆంజనేయరాజు ఒకరని కొనియాడారు. సినిమా, బుల్లితెర ఆవిర్భావం వల్ల కళాకారుల జీవన పరిస్థితులు అధ్వానంగా మారాయని, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే కళలను బతికించుకోవాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందని డీవీఎం సత్యనారాయణ అన్నారు. కళే దైవంగా, జీవనోపాధిగా బతుకు వెళ్లదీసిన వృత్తి కళాకారులను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్ మంజూరు చేయాలని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి విజ్ఞప్తి చేశారు. అనంతరం మిద్దెబోయిన ఆంజనేయరాజుకు కళాపురస్కారంతో ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి, శైలజ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ యూ దేవపాలన, శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, మురళీసుధాకరరావు, శ్రీనివాసరావు, సీసీహెచ్ కోటయ్య, నాగేశ్వరరావు, రాఘవరావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా, ఉత్సాహంగా కార్తీక వనభోజనాలు

వేటపాలెం(చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస వనభోజనాల కార్యక్రమాలను పలు సామాజిక వర్గాలకు చెందినవారు వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. రామాపురం తీరంలోని ప్రైవేటు రిసార్ట్‌లో కమ్మవారి వనభోజనాలు జరిగాయి. వేటపాలెం బైపాస్ రోడ్డు సమీపంలో వేంచేసివున్న గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానం వద్ద రజక బంధుజన కార్తీక వనభోజనాలు జరిగాయి. చీరాల ఎంజీసీ మార్కెట్‌లో ఆర్యవైశ్యుల కార్తీక వనభోజనాలు కార్యక్రమాలు జరిగాయి. ముందుగా ఆయా కార్యక్రమాలకు హాజరైనవారు పరస్పరం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. పలుచోట్ల సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. పాల్గొన్న వారికి నిర్వాహకులు బహుమతులను అందజేశారు.



- 'కాకాణి' భూ ఆక్రమణ ఫైళ్లు మాయం
- వావిలేటిపాడులో గోవర్ధన్ కుటుంబానికి భూ వివాదం
- 0.90 ఎకరాలు ఆక్రమించినట్లు ఆరోపణలు
- 2017లో నిర్ధారించిన అప్పటి ఆర్డీవో
- సివిల్ కోర్టులో నడుస్తున్న కేసు
- ఎవిడెన్స్ సమర్పించాల్సిందిగా కోర్టు ఆదేశం
- ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కనిపించని ఫైళ్లు
- కలెక్టర్‌కు లేఖ రాసిన నెల్లూరు ఆర్డీవో నాగ అనూష

నెల్లూరులోనూ

'మదనపల్లె'

నెల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఫైల్స్ గుర్తున్నాయా..? వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమాలకు సంబంధించిన ఫైళ్లన్నింటినీ అక్కడ తగలబెట్టారు..! ఇప్పుడు అదే తరహాలో నెల్లూరు ఫైల్స్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబం భూ ఆక్రమణల ఆరోపణలకు సంబంధించిన ఫైళ్లు మాయమయ్యాయి..! అది కూడా ఏదో ఒక చోట అనుకుంటే పొరపాటు.. నెల్లూరు ఆర్డీవో కార్యాలయం, నెల్లూరు తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ ఫైళ్లు కనిపించడం లేదు. ఏకకాలంలో రెండు కార్యాలయాల్లో ఫైళ్లు మాయం కావడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భూ వివాదానికి సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం సివిల్ కోర్టు పరిధిలో ఉంది. ఈ కేసు విచారణలో భాగంగా ఎవిడెన్స్‌ను సబ్మిట్ చేయాలని నెల్లూరు ఆర్డీవోను కోర్టు ఆదేశించింది. అయితే ప్రస్తుతం ఆ కేసుకు సంబంధించిన ఫైళ్లు కనిపించకపోవడంతో ఆ విషయాన్ని నెల్లూరు ఆర్డీవో నాగ అనూష కలెక్టర్ ఓ ఆనంద్‌కు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది.

నెల్లూరు రూరల్ మండలం వావిలేటిపాడులోని సర్వే నెంబరు 272/2ఏలో 10.66 ఎకరాల భూమి ఉంది. అందులో కాటంరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, మరో ఇద్దరు వ్యక్తులు 1992లో ఆరెకరాల భూమి కొనుగోలు చేశారు. అదే భూమిని 2004లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి సతీమణి కాకాణి విజితకు సెటిల్‌మెంట్ చేశారు. అయితే వీరు కొనుగోలు చేసిన సమయంలో ఆ భూమికి పేర్కొన్న హద్దులకు, కాకాణి విజితకు సెటిల్‌మెంట్ చేసిన సమయంలో పేర్కొన్న హద్దులకు తేడా ఉంది. కాగా 272/2ఏ సర్వే నెంబర్లో నిజామ్ మొహిద్దీన్ అనే వ్యక్తికి కూడా భూమి ఉంది. వీరి దగ్గర ఉన్న రికార్డుల ప్రకారం మొహిద్దీన్ కుమారులు వివిధ డాక్యుమెంట్ల ద్వారా 6.20 ఎకరాలను వేరొకరికి విక్రయించారు. ఈ భూమిని పసుపులేటి వెంకటేశ్వర్లు కొనుగోలు చేసి 2007లో అప్రూవ్డ్ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారు. కాగా 2014లో కాకాణి విజిత తన భూమికి హద్దులు చూపించాలని రెవెన్యూ అధికారులను కోరారు. రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి కాకాణి విజిత ఆధీనంలో 4.96 ఎకరాలు ఉందని, అందులో 0.22 ఎకరాలు ఎస్సీల శ్మశానం కూడా ఉన్నట్లు స్కెచ్‌లతో సహా రిపోర్టు ఇచ్చారు. దీనిపై కాకాణి విజిత ఆ వెంటనే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత మరోసారి సర్వే చేసిన రెవెన్యూ సిబ్బంది మళ్లీ కూడా కాకాణి విజిత ఆధీనంలో 4.96 ఎకరాలు మాత్రమే ఉందని, అందులో 0.22 ఎకరాల ఎస్సీల శ్మశానం ఉందని నిర్ధారించి కోర్టుకు నివేదించారు. ఆ తర్వాత రిట్ పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు.

ఇదిలా ఉండగా తమ ప్లాట్లు ఆక్రమించారంటూ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన పలువురు వ్యక్తులు 2016 అక్టోబరులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై 2017లో మరోసారి 272/2ఏ సర్వే నెంబర్‌లోని భూమిని రెవెన్యూ సిబ్బంది సర్వే చేశారు. దాని ప్రకారం లేఅవుట్‌కు సంబంధించిన 0.96 సెంట్ల భూమిని కాకాణి విజిత ఆక్రమించినట్లు అప్పటి ఆర్డీవో కే వెంకటేశ్వర్లు తన నివేదికలో పేర్కొన్నారు. 272/2ఏ సర్వే నెంబర్‌లో మొత్తం 10.66 ఎకరాల భూమి ఉండగా వివిధ డాక్యుమెంట్ల ద్వారా 12.20 ఎకరాల విక్రయం జరిగినట్లు ఆయన వెల్లడించారు. ఈ క్రమంలో ఎవరి డాక్యుమెంట్లు సరైనవి..? అన్నది సివిల్ కోర్టులో తేల్చుకోవాలని ఆర్డీవో సూచించారు. ఈ నివేదికను 2017 జనవరి 16వ తేదీన కలెక్టర్‌కు పంపారు.



● కలెక్టర్‌కు ఆర్డీవో లేఖ

వావిలేటిపాడులో కాకాణి విజిత తమ లేఅవుట్ ప్లాట్లను ఆక్రమించారని ఆరుగురు నెల్లూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సూట్ దాఖలు చేశారు. తాము రిజిస్ట్రేషన్ల ద్వారా కొనుగోలు చేశామని, అప్రూవ్డ్ లేఅవుట్‌లోని తమ ప్లాట్లను ఆక్రమించారంటూ సూట్‌లో పేర్కొన్నారు. మొత్తం ఆరు సివిల్ సూట్‌లు ప్రస్తుతం కోర్టులో నడుస్తున్నాయి. వీటిపై విచారణ జరుగుతున్న క్రమంలో వివాదాస్పద భూమికి సంబంధించి ఎవిడెన్స్ సబ్మిట్ చేయాలని నెల్లూరు ఆర్డీవోకు కోర్టు నుంచి సమన్లు అందాయి. 2017లో అప్పటి ఆర్డీవో ఇచ్చిన నివేదికను ప్రస్తుత ఆర్డీవో కోర్టుకు సమర్పించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫైల్ ఆర్డీవో కార్యాలయంలో కనిపించడం లేదు. కార్యాలయం మొత్తం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో నెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో

- మిగతా 6లో

అతను ఇరవై ఏళ్లపాటు దేశ రక్షణకు సరిహద్దుల్లో కాపలా కాశాడు. ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన ఆ సైనికుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సాగు చేసుకునేందుకు భూమిని కేటాయించాలి. కానీ సరిహద్దుల్లో ధైర్యంగా శత్రువులతో పోరాడిన ఆ సైనికుడు.. జిల్లాలోని రెవెన్యూ యంత్రాంగంతో మాత్రం పోరాడలేకపోయాడు. భూమి కోసం ఇరవై ఏళ్లుగా పోరాడి పోరాడి గతేడాది అనారోగ్యంతో ప్రాణాలు విడిచాడు. ఆ మాజీ సైనికుడికి భూమి కేటాయింపునకు సంబంధించిన ఫైల్ కలెక్టరేట్‌కు చేరాక మాయమైంది. ఇప్పుడు ఆ సైనికుడి కుటుంబ సభ్యులు కాళ్లరిగేలా తిరుగుతున్నా ఆ ఫైల్ మాత్రం కలెక్టరేట్‌లో కనిపించకపోవడం గమనార్హం.

నెల్లూరు రూరల్ మండలంలో తన భూమిని నిబంధనలకు విరుద్ధంగా, తనకు తెలియకుండా మ్యుటేషన్ చేశారని ఓ వ్యక్తి రెండేళ్ల నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ఏడాదిపాటు తిరిగాక అప్పటి కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆ వెంటనే తహసీల్దార్, ఆర్డీవోలు విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా మ్యుటేషన్ చేశారని నిర్ధారించి కలెక్టరేట్‌కు నివేదిక పంపారు. ఈ ఫైల్ దాదాపు ఏడాది కాలం కనిపించకుండా మాయమైంది. సదరు బాధితుడు మరో ఏడాదిపాటు తిరిగి అతికష్టం మీద ఫైల్‌ను బయటకు తీయించుకున్నాడు. అప్పటికిగానీ ఈ రిపోర్టు కలెక్టర్ దృష్టికి వెళ్లలేదు.

ఏ పని చేయాలన్నా దానికి ఒక క్రమ పద్ధతి ఉంటుంది. అది లేకపోతే గందరగోళ పరిస్థితులు నెలకొంటాయి. జిల్లా పరిపాలనా కేంద్రమైన కలెక్టరేట్‌లో ఇప్పుడు అదే జరుగుతోంది. అక్కడి సెక్షన్లలో నిర్దిష్టమైన ప్రణాళికను అమలు చేయకపోతుండటంతో సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ఎలాగోలా తంటాలు పడి కలెక్టరేట్ వరకు తీసుకొస్తున్నప్పటికీ అక్కడి నుంచి ముందుకు కదలడం లేదు. కొన్ని దస్త్రాలైతే అసలు కనిపించడం లేదు. ఈ కారణంగా ఏళ్లతరబడి పరిష్కారానికి నోచుకోని ఫైళ్లు మురుగునపడిపోతున్నాయి. వాటికోసం ప్రజలు కాళ్లరిగేలా తిరిగి తిరిగి అలసిపోతున్నారు.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి



కలెక్టరేట్‌లోని ఓ విభాగంలో ఉద్యోగులు

ఏ ఫైల్

ఎక్కడుందో?

- కలెక్టరేట్‌లో అస్తవ్యస్తంగా పాలన ● భారీగా పేరుకుపోయిన దస్త్రాలు
- కొన్ని మాయమవుతున్న వైనం ● ఏళ్ల తరబడి పరిష్కారం కరువు
- భూసమస్యలవే అధికం ● కాళ్లరిగేలా తిరుగుతున్న సామాన్యులు
- పెండింగ్ వివరాలివ్వాలని కలెక్టర్ ఆదేశం
- పాలనాకేంద్రంలో ప్రక్షాళన అవశ్యం!

జిల్లా పరిపాలనకు మూల కేంద్రం కలెక్టర్ కార్యాలయం. అందులో పలు విభాగాలు, వందలాది మంది ఉద్యోగులు ఉన్నాయి. అయితే సరైన పనివిధానాన్ని అనుసరించక పోతుండటంతో కార్యకలాపాలు సజావుగా సాగే పరిస్థితి లేకుండాపోయింది. ఏ ఫైల్ ఎక్కడుందో తెలుసుకోవడం చాలా కష్టంగా మారుతోంది. సెక్షన్‌లోని ఒక అధికారిగానీ, ఉద్యోగిగానీ బదిలీ అయితే అప్పటి వరకు జరిగిన వ్యవహారాలు తదుపరి వచ్చే వారికి తెలియడం లేదు. గతంలో తప్పులు చేసిన కొందరు ఉద్యోగులు, వారు బదిలీ అవుతూనే సదరు ఫైళ్లను మాయం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దరఖాస్తుదారుడు వచ్చి తన ఫైల్ ఏమైందని అడిగితే కొత్తగా వచ్చిన ఉద్యోగులు మళ్లీ మొదటి నుంచీ ఆ ప్రక్రియ మొదలు పెట్టాల్సి వస్తోంది. అంతకన్నా ముందు ఆ ఫైల్ ఎక్కడుందో వెతుక్కోవడం చాలా కష్టంగా మారుతోంది. నిబంధనల ప్రకారం తహసీల్దార్ కార్యాలయంగానీ, ఇతర కార్యాలయాల నుంచిగానీ వచ్చే ఫైళ్లను వాటి ప్రాధాన్యతను బట్టి నిర్దిష్ట సమయంలోపు పరిష్కరించాల్సి ఉంటుంది. కానీ కలెక్టరేట్‌లో వేల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని అయితే ఏళ్లు గడిచినా అక్కడి నుంచి బయటకు రావడం లేదు. ప్రధానంగా ల్యాండ్ మేటర్స్ సెక్షన్‌లోనే వందల సంఖ్యలో ఫైళ్లు మూలుగుతున్నాయి. వీటిని పరిశీలించి అసలు ఏది వాస్తవం..? అన్నది తేల్చితే బాధితులు కూడా పదే పదే కలెక్టరేట్ చుట్టూ తిరిగే అవసరం ఉండదు.

● రిజిస్టర్ల నిర్వహణ ఏది?

కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి, అధికారి పర్సనల్ రిజిస్టర్ (పీఆర్)ను నిర్వహించాల్సి ఉంటుంది. ఆ ఉద్యోగి వద్దకు వచ్చిన ప్రతీ ఫైల్ వివరాలను ఆ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఆ ఫైల్‌ను ఉన్నతాధికారులు పరిశీలించి డిస్పాచ్ చేశాక ఆ వివరాలను కూడా పీఆర్‌లో నమోదు చేస్తారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల వివరాలను మరుసటి ఏడాది క్యారీ ఫార్వర్డ్ రిజిస్టర్‌లోకి తీసుకురావాల్సి ఉంటుంది. దీని మూలంగా ఏ ఫైల్ ఎప్పుడొచ్చింది..? ఏ స్థితిలో ఉంది..? అన్న వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. అలానే సదరు అధికారి లేదా ఉద్యోగి బదిలీ అయిన తర్వాత ఈ రిజిస్టర్లను తదుపరి వచ్చే వారికి అప్పగిస్తే వారికి కూడా తక్షణం అవగాహనకు వస్తుంది. విధులు అప్పగించడంలో ఇది కూడా ఒక భాగం. కానీ ఇప్పుడు

- మిగతా 6లో



కుప్పురపాడులో ఆందోళన చేస్తున్న రైతులు

ఇంత నిర్లక్ష్యమా ?

- కనెక్షన్‌కు రూ.16వేలు చెల్లించాం... ● ఏడాది అయినా రాని కరెంటు
- విద్యుత్ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం ● కుప్పురపాడులో ఆందోళన

ఏఎస్‌పేట, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆదివారం మండలంలోని కుప్పురపాడులో రైతులు ఆందోళన చేపట్టారు. బాధితుల కథనం మేరకు, గ్రామానికి చెందిన 49మంది రైతులు తమ పొలాల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సుమారు ఏడాది క్రితం అప్పటి ఏఈ నిరంజన్‌ను కలిసి విన్నవించారు. అంతేకాక కనెక్షన్‌కు రూ. 16వేలు చొప్పున సుమారు రూ. 8లక్షల వరకు చెల్లించారు.అయినా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదు. రైతుల ఒత్తిడితో పొలాల్లో స్తంభాలు నాటారేతప్ప.. వాటికి తీగలు, ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.కరెంటు లేక పొలాలు సాగు చేసుకోలేక సుమారు 500 ఎకరాలు బీడగా మారిందని వారు పేర్కొన్నారు.



పొలాల్లో తీగలు లేకుండా ఉన్న స్తంభాలు

ఇప్పటి కైనా విద్యుత్‌శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ పొలాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

బాలల్ని బందిస్తే జైలే !

బాల కార్మిక రహిత జిల్లాయే లక్ష్యం

- వివరాలు 6లో

జామాయిల్‌కు గ్లోబల్ టెండర్లు

- నేడు తెరవనున్న రెండో విడత బిడ్‌లు ● మార్కెట్‌లో భారీగా పెరిగిన ధరలు
- బిడ్‌లకు పలు అంతర్జాతీయ సంస్థల పోటీ
- తొలివిడతలో దాదాపు రూ.40కోట్లకుపైగా ఆదాయం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీశాఖ పరిధిలోని జామాయిల్ కర్ర ఆ శాఖకు కాసులు కురిపిస్తోంది. 20 ఏళ్లగా జామాయిల్ కర్రకు గ్లోబల్ మార్కెట్‌లో ధర లేకపోవడంతో వేలం వేయలేదు. జిల్లా అటవీశాఖ పరిధిలోని సుమారు 7,500 హెక్టార్లలో జామాయిల్ సాగు ఉంది. తొలిసారి 2023లో మొదటి విడతలో ఐదు రేంజ్‌ల పరిధిలో దాదాపు 4,000వేల హెక్టార్లను గ్లోబల్ టెండర్‌ల ద్వారా విక్రయించారు. అయితే అప్పటి ధర రూ.3,460గా ఉంది. దాదాపు 1,40.000 మెట్రిక్ టన్నుల జామాయిల్‌ను విక్రయించారు. దీని ద్వారా అటవీశాఖకు సుమారు రూ.48కోట్ల వరకు ఆదాయం వచ్చింది. రెండో విడతలో 3,500 హెక్టార్లలో దాదాపు 1,02,000 మెట్రిక్ టన్నులు జామాయిల్ విక్రయించేందుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి గ్లోబల్ టెండర్లకు జిల్లా అటవీశాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. ఎక్కువగా కావలి రేంజ్ పరిధిలో 1250 హెక్టార్లు, రాపూరు 550, నెల్లూరు 380, ఆత్మకూరు 480, ఉదయగిరి 850 హెక్టార్ల జామాయిల్ తోటలకు కలిపి 1,20,000 మెట్రిక్ టన్నుల జామాయిల్ కర్రను వేలం ద్వారా విక్ర యించనున్నారు.



జామాయిల్ తోటలను పరిశీలిస్తున్న టెండర్‌దారులు

● భారీగా డిమాండ్

ప్రస్తుతం జామాయిల్ కర్రకు బహిరంగ మార్కెట్‌లో భారీగా డిమాండ్ పెరిగింది. మొదటి విడతలో రూ.3,460గా ఉన్న టన్ను ధర ప్రస్తుతం రూ.7వేలకు పెరిగింది. దీంతో రెండో విడతలో జిల్లా పరిధిలోని ఐదు రేంజ్‌ల పరిధిలో 3500 హెక్టార్లకు టెండర్లు పిలిచారు. ఆన్‌లైన్ గ్లోబల్ టెండర్ల కోసం ప్లైఉడ్, యు పీవీసీలు తయారు చేసే పలు అంతర్జాతీయ కంపెనీలు అయిన ఐటీసీ, 24 సెంచూరి కంపెనీలు పోటీ పడుతున్నాయి. శుక్రవారంతో ఆన్‌లైన్ టెండర్ల గడువు ముగిసింది. సోమవారం (నేడు) బిడ్‌లను తెరవనున్నారు.

నేడు బిడ్‌లు తెరుస్తాం...

జిల్లాలోని సుమారు 3,500 హెక్టార్లలోని జామాయిల్ కర్రకు గ్లోబల్ టెండర్లను ఆహ్వానించాం. ఈ నెల 8ని చివరితేదీగా నిర్ణయించాం. పలు అంతర్జాతీయ కంపెనీలు బిడ్‌లు దాఖలు చేశాయి. సోమవారం ఉదయం మా కార్యాలయంలో ఆన్‌లైన్ టెండర్లను తెరవ నున్నాం.

- మహబూబ్ బాషా, డీఎఫ్‌వో, నెల్లూరు

● 17 నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ● వెళ్లి, వచ్చే మార్గాల్లో పుణ్యక్షేత్రాల దర్శనం
● టికెట్, అద్దె ప్రాతిపదికన సర్వీసులు ● భక్తులకు రవాణా సంస్థ ఆఫర్లు

శబరిగిరి యాత్రకు పోదాం!



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వామి దర్శనానికి శబరిమలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యే కంగా బస్సులు నడపనుంది. చార్జీ, అద్దె ప్రాతిపదికన ఈ బస్సులు నడి పేందుకు సన్నద్ధమైంది. ఈ నెల 17వ తేదీన చార్జీ ప్రాతిపదికన మొద టి బస్సు నెల్లూరు ప్రధాన బస్టాండు నుంచి బయలుదేరుతుంది. వచ్చే ఏడాది జనవరి 7వతేదీ వరకు సర్వీసులు కొనసాగించేలా ఆర్టీసీ అధికా రులు ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్‌లోగానీ, నేరుగా బస్టాండ్లలోని రిజర్వే షన్ కేంద్రాల్లోగానీ సీట్లు బుక్ చేసుకోవచ్చు. శబరిగిరి యాత్రకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది.

చార్జీ ప్రాతిపదికన ఇలా..

చార్జీ ప్రాతిపదికన ప్రయాణించే వారి కోసం నెల్లూరు ప్రధాన బస్టాండు నుంచి బయలుదేరే బస్సు కాణిపాకం, భవాని, ఎరిమేలి, పంబ మీదుగా శబరిమలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కుర్తాళం, మధురై, చెన్నై, మేళ్మరు వత్తూర్ మీదుగా నెల్లూరు ప్రధాన బస్టాండుకు బస్సు చేరుకుం టుంది. ఈ ఐదు రోజుల యాత్రకు ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ బస్సులో రూ.4వేలు, అల్ట్రా డీలక్స్‌లో రూ.3900, ఎక్స్‌ప్రెస్‌లో రూ.3300 చార్జీ వసూలు చేస్తారు. చార్జీ ప్రాతిపదికన బస్సులు ఈ నెల 17, 18, 20, 22, 25, 26, 28 తేదీల్లో, డిసెంబరు 3, 4, 10, 11, 13, 17, 18, 20, 22, 25, 28 తేదీల్లో, 2025 జనవరి 3, 5, 7 తేదీలలో నెల్లూరు ప్రధాన బస్టాండు నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరుతాయి.



అద్దెకు బస్సులు

అయ్యప్ప భక్తులు కోరుకు న్న మార్గంలో పుణ్యక్షేత్రాలు దర్శిం చుకుంటూ శబరిమల యాత్ర సాగించ డానికి ఆర్టీసీ అధికారులు ప్యాకేజీ విధానం లో అద్దె ప్రతిపదికన బస్సులు ఇస్తున్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు ఒక కిలో మీటరుకు రూ.57, అల్ట్రా డీలక్స్ బస్సుకు రూ.61, ఎక్స్ ప్రెస్‌కు రూ.62, పల్లెవెలుగు బస్సుకు కిలోమీట రుకు రూ.62 చొప్పున వసూలు చేస్తారు. అద్దె ప్రాతిపదికన రోజుకు 420 కిలోమీటర్లు మాత్రమే లెక్కించ బడతా యని ప్రకటించారు.

టూర్‌ప్యాకేజ్ ఆఫర్లు ఇలా

- సూపర్ లగ్జరీలో ప్రయాణించే భక్తులకు ఆడియో, వీడియో సౌకర్యం.
- మొత్తం బస్సు బుక్ చేసుకుంటే ఏడుగురికి ప్రయాణం ఉచితం.
- బస్సును అద్దె ప్రాతిపదికన బుక్ చేసుకునే గురుస్వాములు, ఏజెంట్లకు రూ.2వేలు కమిషన్ ఇస్తారు. అయితే బస్సును కనీసం ఐదు రోజులకు బుక్ చేసుకోవాలి.



నెల్లూరు మున్సిపాలిటీ గురించి బ్రిటీష్ ప్రభుత్వం రూపొందించిన చట్టంలోని ఓ భాగం

నెల్లూరు పురపాలనకు 142 ఏళ్లు

● 1882లో మున్సిపాలిటీ ఏర్పాటు
● పల్లెలకు పన్ను మినహాయిస్తూ తొలి తీర్మానం
● కార్పొరేషన్‌లో తాజాగా బయటపడిన దస్త్రం

నెల్లూరు పురపాలక సంఘం 1882 ఫిబ్రవరిలో ఏర్పడింది. అంటే 142 ఏళ్ల క్రితం నుంచి నెల్లూరు మున్సిపల్ సేవలు ప్రజలకు అందు తున్నాయి. పల్లెటూరుగా ఉన్న నెల్లూరును అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం లోని కీలక అధికారి లార్డ్ రిప్పన్ మున్సిపాలిటీగా మార్పు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాలతోపాటు పలు ఆసక్తికర అంశాలు ఉన్న దస్త్రం ఒకటి తాజాగా కార్పొరే షన్‌లో బయటపడటంతో నెల్లూరు మున్సిపాలిటీ చరిత్ర వెలుగులోకి వచ్చింది. ఆ దస్త్రంలోని అంశాలు...

చరిత్ర

● **పదిమందితో కమిటీ**

142ఏళ్ల క్రితం ఏర్పా టైన నెల్లూరు మున్సిపాలి టీకి జీస్మిత్ ఎస్ స్వాయర్ అనే వ్యక్తి కీలక అధికారిగా వ్యవహరించారు. అప్పట్లో మున్సిపాలిటీ అధ్యక్షుడిగా వార్నర్‌సెట్వీన్ వ్యవహరిం చగా, ఉపాధ్యక్షుడిగా జోకే జయరామ నాయుడు పని చేశారు. వీరుకాక మరో 10 మంది సభ్యులతో బ్రిటీష్ ప్రభుత్వం కమిటీని నియమిం చింది. వీరి అధ్యక్షతన 1882 ఏప్రిల్‌లో తొలి సమావేశాన్ని నిర్వహించారు. 1881 డిసెంబరు 8వ తేదీన పల్లెలకు పన్ను మినహాయిస్తూ .. మున్సి పాలిటీలోకి వచ్చిన ప్రాం తాలకు మాత్రమే పన్ను వసూళ్లకు పరిధి విధించాలన్న సిఫార్సు ను తొలి సమావే శంలో ఆమోదించారు. పల్లెటూళ్లకు కూడా పన్ను వసూళు చేసే విధానం ఉండగా అప్ప టికే పేరుకు పోయిన బకాయిలన్నీ రద్దు చేశారు. తాజాగా నెల్లూరులో కలిసిన ప్రాంతాలకు మాత్రమే కొత్త పన్ను విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు ఆ దస్త్రంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం పేర్కొంది.



పన్ను మినహాయింపు కోరుతూ తొలి తీర్మానం



1882లోని నెల్లూరు మున్సిపాలిటీ దస్త్రం

● **ఆ మూడు సామాజిక వర్గాల వారే సభ్యులు**

శెట్టి, శాస్త్రి, నాయుడు సామాజిక వర్గాలకు చెందిన వారినే మున్సి పాలిటీలో సభ్యులుగా చేర్చుతూ ఎస్ స్వాయర్ గజిట్ విడుదల చేశా రు. నెల్లూరు మున్సిపాలిటీలో తీసుకుంటున్న చర్యలు, తీసుకోవాల్సిన నిర్ణయాలు, ప్రజలు అందించాల్సిన సేవలు తదితర ఆసక్తికర విష యాలు కూడా మున్సిపాలిటీ పాలకమండలి దస్త్రంలో పేర్కొన్నారు. తాజాగా వెలుగులోకి వచ్చిన అప్పటి బ్రిటీష్ నిర్ణయాలు అందరికీ ఆసక్తి కలిగిస్తున్నాయి.

- నెల్లూరు సిటీ, (ఆంధ్రజ్యోతి)

బాలల్ని బందిస్తే జైలే

● బాలకార్మిక రహిత జిల్లాయే లక్ష్యంగా అడుగులు
● మూడు శాఖలతో ప్రత్యేక టీం ఏర్పాటు
● జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు
● పట్టుపడితే కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం, ఏహెచ్‌టీయూ, లేబర్ డిపార్ట్‌మెంట్‌లు సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకున్నాయి. జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సైతం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం కృషి చేస్తున్నది. పిల్లల్ని పనికి వాడుకుంటున్న యజమానులపై పలు చట్టాల కింద కేసులు నమోదు చేస్తూ, బాలలను బానిసలుగా మారిస్తే శిక్షలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

● **చట్టాల ద్వారా కేసుల నమోదు**

పిల్లల్ని పనికి వినియోగించుకుటుఉన్న యాజమాన్యాలపై 79 జేజే యాక్ట్ 2015 ద్వారా కేసులు నమోదు చేసి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుం టున్నారు. పిల్లల చేత యాచన చేస్తున్నవారిపైన సెక్షన్ 76 జేజే యాక్ట్ 2015, ఎంప్లాయింగ్ బెగ్గింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తున్నారు. పిల్లల చేత వెట్టిచాకిరీ చేయించే వారిపైన వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం 1976, సెక్షన్ 16 కింద కేసు పెడుతున్నారు. బాల కార్మిక రహిత జిల్లాగా చేసేందుకు ప్రత్యేక బృందాలు ఇటీవల ముమ్మర తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నారు.



అధికారులు కాపాడిన చిన్నారులు

హెల్ప్‌లైనుకి సమాచారం ఇవ్వండి

బాల కార్మికులు కనిపిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నెం. 1098కి సమాచారం ఇవ్వండి. ఎక్కడైనా దుకాణాలు, కర్మాగారాలు, హేచరీస్‌లలో 18 ఏళ్లలోపు బాలల చేత పనులు చేయిస్తే యాజమాన్యంపైన సెక్షన్ 79, సెక్షన్ 3,4 సీఎల్ కింద కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తాం. బాలల చేత యాచన చేయించే వారిపై సెక్షన్ 76 కింద కేసులు నమోదు చేస్తున్నాం.

- డీ సురేష్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

సంవత్సరం	పాఠశాల వెళ్లే చిన్నారులు	కుటుంబ సభ్యులకు అప్పగించిన బాలలు	విద్యాసంస్థలకు పంపిన బాలలు	నమోదైన కేసులు
2022	168	168	0	96
2023	44	44	0	10
2024	44	43	1	4

ఇటీవల జరిగిన దాడుల వివరాలు

● కొన్ని హేచరీపైన దాడులు నిర్వహించిన ప్రత్యేక బృందం కొంతమంది బాలకార్మికులను ఒడిస్సా, అస్సోం రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి పని చేయిస్తున్నట్లు గుర్తించి వారిని హోంకి పంపించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

● వివిధ రకాల పనుల్లో పెట్టుకోవడానికి ఒడిస్సా రాష్ట్రం నుంచి చెన్నైకి రైలులో తరలిస్తుండగా 15 మంది పిల్లల్ని కాపాడి, బాలలను తరలిస్తున్న యజమానిపై ఆర్పీఎఫ్ పోలీసుస్టేషన్‌లో సెక్షన్ 146 - బీఎన్ఎస్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయించి చర్యలు తీసుకోవడమే కాకుండా, పిల్లల తల్లిదండ్రులకు అప్పగించారు.

● నెల్లూరు నగరంలోని ప్రధాన కూడళ్లలో పిల్లలచేత యాచన చేయిస్తున్న వారిపై వరుసగా దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో 'సాయి సచ్చరిత' శోభాయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని బాలాజీనగర్ సాయిదర్బార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయిమాలా ధారణ భక్తులు సాయిసచ్చరిత్ర గ్రంథాలతో ఊరేగింపు నిర్వహించారు. సాయిదర్బార్ మధు స్వామి అధ్యక్షతన ఈ శోభాయాత్ర పద్మావతినగర్ నుంచి ఆత్మకూరు బస్టాండు వరకు సాయినామ స్మరణ, తీన్‌మార్ బ్యాండ్‌తో సందడిగా సాగిం ది. పాబోలు రామసుబ్బయ్య పర్యవేక్షించారు.



పురపాలనలో సంస్కరణలు

అనుమతులకు సింగిల్ విండో విధానం

మంత్రి పొంగూరు నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పురపాలక శాఖలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుడుతు న్నట్లు ఆ శాఖ మంత్రి పొంగూరు నారాయ ణ తెలిపారు. నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం బిల్డర్స్ అసోసియే షన్ నేతలు, అధికారులతో మంత్రి సమా వేశం నిర్వహించారు. బిల్డర్లకు, లేవుట్‌దారు లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్ణీత వ్యవధిలోనే అనుమతులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. నిబంధ నలకు అనుగుణంగా 2014-19 సంవత్సరాల మధ్య భవన నిర్మాణా లకు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు ఇచ్చామని, అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ విధానాన్ని నిర్వీర్యం చేసి టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని అవినీతిమ యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ అప్రూవల్ సిస్టంపై అధ్య యనం చేసేందుకు సుమారు 20 రాష్ట్రాలకు అధికారులను పంపామని, వారు ఇచ్చే నివేదిక ఆధారంగా నూతన సంస్కరణలను తీసుకొస్తామని తెలిపారు. అనుమతులు మరింత సులభతరం చేసేందుకు సింగిల్ విండో విధానాన్ని తీసుకొస్తున్నామన్నారు. మున్సిపల్ శాఖ సర్వర్లతో అన్ని డిపార్ట్ మెంట్ల సర్వర్లను అనుసంధానించి వెబ్‌సైట్ ద్వారానే అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఐదు అంతస్థుల నిర్మాణాల్లో నిబంధనలు అతిక్ర మిస్తే లైసెన్స్ రద్దు చేయడమేకాక వారిపై క్రిమినల్ కేసులు బనాయిస్తామని మంత్రి హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర కమిషనర్ సూర్యతేజ, నుడా చైర్మన్‌గా ఎంపికైన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అమీర్‌జాన్ చిత్రానికి ప్రశంసలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేరళలోని వయనాడు తపోవ నంలో జరిగిన దక్షిణ భారత చిత్రకారుల ఆర్ట్ క్యాంప్‌లో నెల్లూరుకు చెందిన అమీర్‌జాన్ చిత్రానికి ప్రశంసలు లభించాయి. ఈ కార్యక్రమాన్ని ఇన్ ద లాఫ్ ఆఫ్ మదర్ నేచర్ సంస్థ నిర్వహించింది. ఈ ఆర్ట్ క్యాంప్‌లో అమీర్‌జాన్ అక్రిలిక్ రంగులతో విశ్వవీక్షణం చిత్రాన్ని ప్రద ర్శించారు.

తుఫాన్ హెచ్చరికతో గుబులు

కందుకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీ డన ప్రభావంతో రానున్న మూడు, నాలుగురోజులపాటు భారీ వర్షాలు కురిసే అవ కాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తు తం కందుకూరు ప్రాంతంలో సాగుచేసిన మినుము ప్రస్తుతం కల్లె (పూత) దశకు చేరింది. అలాగే సెప్టెంబరు ద్వితీయార్థం, అక్టోబరు ప్రథమార్థంలో తేలికనేలల్లో విస్తారంగా పొగనాట్లు పూర్తిచేశారు. మరోపక్క వందలాది ఎకరాలలో సాగుచేసిన మిరప తోటలు ప్రస్తుతం పూతదశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో నాలుగురోజుల పాటు భారీవర్షాలు కురిస్తే ఎలా అని రైతుల్లో గుబులు రేకెత్తిస్తోంది. ప్రస్తుతం భారీ వర్షాలు కురిస్తే మినుము పండాకు తెగులుతో దెబ్బతినే ప్రమాదం ఉందని, అలాగే తేలికనేల్లోని పొగతోటలు కూడా దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక ముసురువర్షాలు అయితే మిరపతోటలు పొదిగిపోతాయని చెబుతున్నారు. నల్లనేలల్లో పొగాకు, శనగ సాగుకి ఈ వర్షాలు ఉపయోగపడే అవకాశం ఉన్నా పొగ నారుమడులు దెబ్బతిని నారు ధరలు కొండెక్కి కూర్చునే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. అయితే నల్లనేలల్లో ఎప్పుడు వర్షం కురిసినా నాట్లు వేసేందుకు వీలుగా ఎరువులు ఎదబెట్టి భూములను సిద్ధం చేసి ఉన్నందున వర్షాలు కురిస్తే ఆ వెంటనే పొగనాట్లు ఊపందుకునే అవకాశం ఉంది.

ఏ ఫైల్ ఎక్కడుందో?

(5వ పేజీ తరువాయి)

ఎక్కడా కూడా ఈ విధానాన్ని అనుసరించడం లేదు. దీని మూలంగా ఫైళ్ల నిర్వహణ గందరగోళం గా మారుతోంది. కలెక్టరేట్‌కు వచ్చిన ఫైళ్లను ఎక్క డంటే అక్కడ పెట్టేస్తున్నారు. ఉన్నతాధికారులు ఆ ఫైల్ గురించి అడిగిన ప్పుడు ఉద్యోగులు కొన్ని గంటలపాటు వెతుకుతున్న దృశ్యాలు కనిపిస్తున్నా యి. దీని మూలంగా ఉద్యోగులపై పనిభారం పెరగ డమేకాక ఉన్నతాధికారుల కు కూడా ఇబ్బందిగా మారుతోంది. ఒక ఫైల్ కనిపించకపోతే మళ్లీ కింది స్థాయి నుంచి ఆ ఫైల్‌ను కలెక్టరేట్ వరకు చేర్చాలంటే సామాన్యులు ఎంత అవస్థ పడాల్సి ఉంటుందన్నది వర్ణణాతీతం. రాజకీయ, ఆర్థిక పలుకుబడి ఉన్న వారు ఉన్నతాధికారుల ద్వారా తమ ఫైళ్లను క్లియర్ చేసుకుంటుండగా సామా న్యులు మాత్రం కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

● **కలెక్టర్ ఆదేశించినా..**

కలెక్టరేట్‌లో ఈ గందరగోళ పరిస్థితిని గమనిం చిన కలెక్టర్ ఓ ఆనంద్ ఇటీవల ప్రక్షాళనకు పూను కున్నారు. అన్ని సెక్షన్ల అధికారులు, ఉద్యోగులకు వారి విధులపై స్పష్టమైన సందేశం ఇచ్చారు. పెండింగ్ ఫైళ్ల వివరాలన్నీ తన ముందుంచాలని ఆదేశించారు. అలానే ఇకపై ప్రతీ సెక్షన్‌లో మూవ్ మెంట్ రిజిస్టర్, పర్సనల్ రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. ఆ క్రమంలోనే కొన్ని సెక్షన్లలో ఇబ్బం దికరంగా మారిన ఉద్యోగులను బదిలీ కూడా చేశా రు. అయినప్పటికీ కలెక్టరేట్ పాలన గాడిన పడటం లేదు, పెండింగ్ ఫైళ్లకు మోక్షం లభించడం లేదు. పెండింగ్ ఫైళ్ల లెక్క తేలకపోవడం గమనార్హం.

నెల్లూరులోనూ 'మదనపల్లె'

(5వ పేజీ తరువాయి)

కూడా జల్లెడ పట్టారు. కానీ ఫలితం లేక పోయింది. ఈనెల 5న కోర్టులో ఎవిడెన్స్ ఇవ్వా ల్సి ఉన్నప్పటికీ ఫైల్ కనిపించకపోవడంతో ఆర్డీవో వాయిదా తీసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యం లో ముఖ్యమైన కేసుకు సంబంధించి ఫైళ్లు మాయమైన విషయాన్ని నెల్లూ రు ఆర్డీవో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ కార్యాలయంతో పాటు తహసీ ల్దార్ కార్యాలయంలో కూడా ఆర్‌సీ.జే. 4105/2016 ఫైల్ కనిపించడం లేదని కలెక్టర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ ఫైల్ కలెక్టర్ కార్యాలయంలో ఉంటే తమకు కాపీ అందజేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. వెంటనే జిల్లా రెవెన్యూ అధికారికి ఆదేశాలు ఇచ్చారు. కలెక్టరేట్‌లో వావిలేటిపాడు ఫైల్‌ను వెతికి ఆర్డీవోకు అందజేయాలని సూచించారు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఫైల్ వెతికే పని జరుగుతోంది. ఈ వ్యవహారం ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లోనే కాకుండా రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. వావిలేటిపాడులోని భూములకు సంబంధించి కాకాణి కుటుంబంపై గతంలోనే అనేక ఆరోపణలు వచ్చాయి. దళితుల భూములు కూడా ఆక్రమించారంటూ ఫిర్యాదులు రావడంతో గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఆ భూము లను కాకాణి కుటుంబం చెర నుంచి విడిపించి దళితులకు అప్పగించారు. ఇప్పుడు అదే తరహాలో లేఅవుట్లో ప్లాట్లు ఆక్రమించారం టూ మరికొందరు కోర్టును ఆశ్రయించారు. కాగా గతంలో జిల్లా కోర్టులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఫోర్జరీ కేసుకు సంబంధించిన ఫైళ్లు దొంగతనం జరగడం, ఇప్పుడు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయా ల్లో కాకాణి కుటుంబానికి సంబంధించిన భూవివాదం ఫైళ్లు మాయమవడం చర్చనీయాంశంగా మారింది.

విచారణ చేయిస్తాం

వావిలేటిపాడులోని భూవివాదానికి సంబంధించిన ఫైల్ కనిపించడం లేదని నెల్లూరు ఆర్డీవో లేఖ రాశారు. ఈ వివాదం కోర్టులో ఉన్న నేపథ్యంలో సదరు ఫైల్ కలెక్టరేట్‌లో ఉంటే ఇవ్వాలని డీఆర్వోకు సూచించాం. అసలు ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫైళ్లు ఎందుకు కనిపించడం లేదన్న దానిపై విచారణ చేయిస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- ఓ ఆనంద్, జిల్లా కలెక్టర్



దీపోత్సవంలో ప్రవచనం చేస్తున్న విజయానంద స్వామిజీ

వైభవంగా శివపార్వతుల కల్యాణం

● ముగిసిన కార్తీక లక్ష దీపోత్సవం ● శ్రీశైలం నుంచి రథం రాక
● వీఆర్సీ మైదానానికి తరలివచ్చిన భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి) : వేదమంత్రాలు, శివనామస్మరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఆదివారం రాత్రి శివపార్వ తుల కల్యాణం వైభవంగా జరిగింది. శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లి కార్జునస్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం జరగడంతో భక్తులు వీఆర్సీ మైదానానికి పోటెత్తారు. వీపీఆర్ ఫౌం డేషన్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న కార్తీక లక్ష దీపార్చన ఘనంగా ముగిసింది. మూడవరోజు మహా న్యాస రుద్రాభిషేకాలు, విశేష చండీ హోమాలు జరిగాయి. 500 మంది దంపతులతో సామూ హిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. సాయంత్రం దత్తపీఠం అవధూత విజయానంద స్వామిజీ ఆధ్వర్యంలో నాసిక్ త్రయంబకేశ్వర స్వామికి అభిషేకాలు, బాలరాముని మందరం లో పూజలు, ఆకాశదీపం అవగతం జరిగింది. తదుపరి లక్ష దీపార్చన ప్రారంభించి, భక్తులకు మం గళ శాసనాలు అందించారు. అనంతరం ఆయన అనుగ్రహప్రవచనంలో నెల్లూరులో జరుగుతున్న ఈ కార్తీక లక్షదీపార్చన కోటి దీపా ర్చనగా మారుతుందని తెలిపారు. మహా శివుడు ఆ దంపతులకు అలాంటి శక్తిసామర్థ్యాలు అంద జేస్తారని ఆశీర్వదించారు. నెల్లూరులో ఈ వేడుక లను శాశ్వతం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం శ్రీశైలం నుంచి రథంపై తరలివచ్చిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులకు కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తులు చేసిన శివనామ స్మరణలు మైదానమంతా మారుమోగాయి.

పోలేరమ్మకు పొంగళ్లు



పొంగళ్లు సమర్పిస్తున్న గ్రామస్థులు

సీతారామపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండుపల్లి పంచాయతీలోని ఓగురువాండ్లపల్లి లో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు భక్తి శ్రద్ధలతో పొంగళ్లు సమర్పించారు. గ్రామం నుంచి మహిళలు ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకుని పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కటారి వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, శ్రీనివాసులు, వెంటరత్నం పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యకర్తలకు ఘన సన్మానం

ఏఎస్ పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా స్థానిక హైస్కూల్‌లో ఆదివారం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా షేక్ జిలానిపాషా, అధ్యక్షుడిగా కంచర్ల వరప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులుగా ఇ శ్రీనివాసులు, యశోదమ్మ, కార్యదర్శులు, సభ్యులను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఏ మురళీధర్‌రావు, బి శివప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్వరాల విజృంభణ

● పడకేసిన పారిశుధ్యం ● పట్టించుకోని అధికార గణం



వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ఉదయగిరి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు చొప్పున జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. కొంతమందికి రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడంతో రక్తకణాలు తగ్గి ఇతర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్నారు. దీంతోపాటు పట్టణం, గ్రామం అనే తేడాలేకుండా ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తూ దోమలు విజృంభిస్తుండడంతో జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. వీధులు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిన పాపాన పోలేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికంగా చిన్నారులు, మహిళలు జ్వరాలతో బాధపడుతున్నారు. సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లోని పలు గ్రామాల్లో పలువురు జ్వరాలతో వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. మరికొందరికి రక్తకణాలు తగ్గడంతో నెల్లూరు, ఆత్మకూరు, వింజమూరు పట్టణాల్లో చికిత్స పొందుతున్నారు. జ్వరం తగ్గినా రోజుల తరబడి ఒళ్లు, కీళ్లనొప్పులు తగ్గకపోవడంతో ఏ పనీ చేయలేక పోతున్నామని జ్వరపీడితులు వాపోతున్నారు. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి, పలు ప్రైవేటు వైద్యశాలలకు రోజుకు 300 మంది రోగులు వస్తుంటే అందులో 70 శాతం మంది జ్వరపీడితులే ఉన్నారని ఆయా వైద్యశాలల వైద్యులు తెలుపుతున్నారు. వైద్యఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో తూతూమంత్రంగా లార్వా, జ్వరాల సర్వే నిర్వహిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టడంతోపాటు జ్వరాలను అదుపులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

రైతులందరికీ సంక్షేమ పథకాలు

● రవికుమార్, మండల వ్యవసాయాధికారి



వరికుంటపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి వి రవికుమార్ తెలిపారు.

? రైతులకు విత్తనాల సరఫరాలో ఎ లాంటి చర్యలు చేపడుతున్నారు.

! ప్రస్తుత సీజన్‌లో ప్రభుత్వం తరపున తెల్ల, ఎర్ర శనగల పంపిణీ జరుగుతుంది. అందుకుగాను రైతుల నుంచి గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు చేపడుతున్నాం.

? మార్కెట్ ధరల్లో వ్యత్యాసం ఉంటుందా.

! బయటి మార్కెట్‌లో ధర అధికంగా ఉంటుండడంతో ప్రభుత్వం 25శాతం రాయితీతో 20 కేజీల తెల్ల శనగలు రూ. 1815, ఎర్ర శనగలు రూ. 1410 వంతున అందచేస్తాం.

? రైతులకు ఎరువులు అందించే అవకాశం ఉందా.

! ప్రస్తుతం సొసైటీ కార్యాలయానికి సమీపంలో ఉండే రైతుసేవా కేంద్రాలకు ఎరువుల సరఫరా నిలిపివేయడం జరిగింది. మిగిలిన ప్రాంతాల్లో రైతుల అవసరం మేరకు అందిస్తాం.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో బ్రాహ్మణ సంఘాల ప్రముఖులు

కావలి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో స్థానిక ముసునూరు అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణంను వైభవంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన మహోత్సవంలో ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామికి మొక్కుకున్నారు. అనంతరం భక్తులకు వనసమారాధన అన్న సంతర్పణ గావించారు. ఉత్సవంలో బ్రాహ్మణ సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, బ్రాహ్మణ మహాసంఘం బాధ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించనున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, అనసూయమ్మ దంపతులు పాల్గొన్నారు.

కమనీయం దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణం



దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఉలవపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గామల్లేశ్వర స్వామి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకల్లో విగ్రహదాతలు చిట్టూరి సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు పోన్నూరు రామాంజనుయుల దంపతులు, భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు సురేంద్రరెడ్డి, కమిటీ సభ్యులు దేవరపల్లి దయాకర్‌రెడ్డి, పేర్ల వెంకటేశ్వర్లు, సన్నెబోయిన గోవిందరాజులు, కొడవలూరి శ్రీనివాసులు, బండ్ల శ్రీనివాసులు, ఎస్ హరిలు భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నవితరణ చేశారు. సాయంత్రం భవానీ మాలధారులు స్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

సీపీఎం పతాకావిష్కరణ

ఉదయగిరి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం సీపీఎం జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఉపాధిహామీ పనుల్లో కోతలు విధించడంతో పనులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు, భూములు స్వాధీనం చేసుకునేందుకు కూడా త్వరలో జీవో తీసుకొచ్చేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. అనంతరం సీతారం ఏచూరి, జక్కా వెంకయ్య, నాగూర్‌సాహెబ్, అమీర్‌సాహెబ్‌లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌కుమార్, మూల వెంకయ్య, కాకు వెంకటయ్య, ఎంపీటీసీ విజయమ్మ, కోడె రమణయ్య, కంచర్ల వెంకటేశ్వర్లు, నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి ఆనం



వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని, గత వైసీపీ ప్రభుత్వం రైతాంగాన్ని విస్మరించి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయలేదని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకం ద్వారా బిందు, తుంపర్ల సేద్య పరికరాలను, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో స్ప్రేయర్లను రైతులకు ఆయన అందజేశారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారు పొందిన వ్యవసాయ పరికరాల విలువ, ప్రభుత్వం చెల్లించిన రాయతీ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతుకు మేలు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యవసాయ రంగానికి కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నారని, అన్నదాతలు ఈ విషయాన్ని గమనించి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. గత ప్రభుత్వంలో జిల్లాలో వ్యవసాయశాఖ మంత్రి ఉన్నప్పటికీ రైతుల గురించి పట్టించుకోలేదన్నారు. 2022-23లో గత ప్రభుత్వం పామాయిల్ రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ నగదును కూడా కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 214 మంది రైతులకు రూ. 2.55 కోట్ల విలువైన డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలను రూ. 1.96 కోట్ల ప్రభుత్వ రాయతీతో పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత పదేళ్ల క్రితం ఆత్మకూరులో ఆగిపోయిన అభివృద్ధి మళ్లీ కూటమి ప్రభుత్వంలో మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి సత్యవాణి, ఆర్డీవో బి పావని, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నేతలు, అధికారులు, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి: సీపీఎం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

కావలిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని 18వ వార్డు ముస్లిం, గిరిజన కాలనీల్లో నిర్వహించిన ప్రజాపోరులో ఆయన పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలడిగి తెలుసుకున్నారు.

న్యూస్ బాక్స్

డ్రై ఫ్రూట్స్‌తో శివలింగం అలంకరణ

బిట్రగుంట, నవంబరు 10: బోగోలు రైల్వే ఎల్సీగేట్ 143 సమీపంలోని కామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటి శ్రవణానక్షత్ర సందర్భంగా స్వామివారి మూలవిరాట్ శివలింగానికి డ్రైఫ్రూట్స్‌తో చేసి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. షిర్డీసాయి మందిరంలో ఆకాశజ్యోతి వెలిగించారు.

శివాలయంలో వనభోజనాలు

అల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేటలోని శివాలయంలో కార్తీక మాసంను పురస్కరించుకొని మండల బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ఆదివారం వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 60ఏళ్లు నిండిన బ్రాహ్మణ వృద్ధ దంపతులకు పాద పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం వనభోజనాలను చేపట్టారు.

చట్టాలను పటిష్టం చేయాలి

అల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమాజంలో తూకాల్లో తేడాలు, ధరల్లో వ్యత్యాసం, కల్తీల జోరు అధికంగా ఉన్నా సంబంధిత అధికారులు పర్యవేక్షణ కొరవడిందని విమర్శించారు. ఈ సమస్యలతో నిత్యం వినియోగదారుడు నష్టపోతూనే ఉన్నాడని, ఏ దుకాణంలో కూడా రశీదులు ఇవ్వడం లేదన్నారు. పౌర సరఫరాధికారులు స్పందించి చట్టాలను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ నేతల సంబరాలు

వింజమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు నన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పాత బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ నేతలు టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచెర్ల వెంకటనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు బేగా మధుయాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ముంతా ఉమా మహేశ్వరరావు, శీను, రమేష్, ఆర్ఎస్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో ఇంటర్నేషనల్ అకౌంటింగ్ డే

ఉలవపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటర్నేషనల్ అకౌంటింగ్ డే నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎల్ సుధారాణి ప్రకటనలో తెలిపారు. అకౌంట్ అనేది వ్యాపార రంగానికే చెందిగా కాకుండా జీవన విధానంలో వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి అన్వయించుకోవాలని సూచించారు. అకౌంటింగ్ నైపుణ్యాలను పెంచుకుంటే కెరీర్ అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవచ్చో వాణిజ్యశాస్త్ర విభాగం ఇన్‌చార్జి ఎస్‌హరిత వివరించారు.

హోమియో వైద్యుడు మోహన్‌రెడ్డి మృతి

కావలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) తేలుకాటుకు హోమియో వైద్యం, పాము కాటుకు నాటు వైద్యం అందించే మోహన్‌రెడ్డి (70) ఆదివారం కావలిలో గుండెపోటుతో మృతి చెందారు. సంకలవారితోటకు చెందిన ఈయన కావలి పరిసర ప్రాంతాల ప్రజలకు ఉచితంగా తేలు, పాముకాటు మందును కొన్నేళ్లుగా అందజేశారు. కొన్ని వేల మందికి వైద్యం అందించిన మోహన్‌రెడ్డి మృతి చెందటం విషాదకరం అని వాపోయారు.

హైందవ శంఖారావం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల బాధ్యులు

కావలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధార్మికసంస్థలు ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో సంఘం బాధ్యులు జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆర్ఎస్ఎస్ కార్యకారిణి సభ్యులు యుగంధర్ హైందవ సంఘటిత ఆవశ్యకతను వివరించారు. హిందువులు చైతన్యవంతులై మేల్కొనక పోతే ఆలయాలు వాటి ఆస్తులు కనుమరుగై పోతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు భరత్, కట్టుబోయిన బ్రహ్మానందం, అంచిపాకల కమల, ఆర్ఎస్ఎస్ ప్రాంతీయప్రముఖులు టంగుటూరి బాలమురళీ, శివప్రసాద్, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ఇంటూరు రమణయ్య, గునుపూడి సుబ్బరాయుడు, లక్ష్మీరాజ్యం, విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షులు వేదగిరి సూర్యనారాయణ చార్యులు, ఉపాధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



అంకభూపాలపురంలో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

వలేటివారిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంకభూపాలపురంలో ఆది వారం టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి ప్రెగడ శ్రీనివాసులు మాట్లాడారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో నేతలు శ్రీనివాసులు, యువ నాయకులు ప్రెగడ మోహన్‌కుమార్, చెంచు శ్రీనివాసులు, బక్కమంతుల ప్రసాద్, సైదులు, సురేష్, లాజరు, అంకయ్య పాల్గొన్నారు.

●కందుకూరు: పట్టణంలోని 24వ వార్డులో ఆదివారం వార్డు అధ్యక్షుడు మదిర మధు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండేళ్లపాటు ఐదు లక్షల ప్రమాదబీమా సౌకర్యంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : మండలంలోని నందిపాడులో ఆదివారం మాజీ ఎంపీపీ శీకుర్తిల రవీంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ సభ్యత్వం అండగా నిలుస్తుందన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల మధు, మాజీ సర్పంచు హజరత్తయ్య, బత్తల నరసింహారావు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థులు రాణించాలి



క్రీడా, సాంస్కృతిక పోటీలకు తరలివెళుతున్న విద్యార్థులు

ఉదయగిరి రూరల్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగే క్రీడా, సాంస్కృతిక పోటీలకు ఎంపిక కావ డం అభినందనీయ మని అసోసియేట్ జి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ద్వితీయ, తృతీ య సంవత్సరం మొదటి సెమిస్టర్ చదువుతున్న 22మంది విద్యార్థులను పోటీలకు పంపించినట్లు, క్రీడల్లో విద్యార్థులు రాణించాలని కోరారు. అనంతరం ప్రత్యేక వాహనంలో విద్యార్థులు తరలివెళ్లారు. కార్యక్రమంలో అధి కారి టి గోపికృష్ణ, ఎన్ఎస్ఎస్ అధికారి జి రమేష్, అధ్యాపకులు దుర్గాప్రసాద్, రమణ పాల్గొన్నారు.

కాలువ పూడికతీత ప్రారంభం



కాలువ పూడికతీతను ప్రారంభిస్తున్న వంటేరు

జలదంకి, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కావలి కాలువ పరిధిలోని సోమవరప్పాడు మేజర్‌కాలువ పూడికతీత పనులకు కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి రూ.2లక్షల సొంత నిధులను వెచ్చిస్తున్నారు. కాలువ ఆయకట్టు పరిధిలోని బ్రాహ్మణక్రాక, సోమవరప్పాడు, క్రిష్ణాపాడు గ్రామాల పొలాలు ఉన్నాయి. పూడికతో నిండిపోవడంతో సోమశిలజలాలు పొలాలకు అందడం లేదని రైతులు వంటేరు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన సొంత నిధులతో పూడికతీత పనులు చేపడతానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆదివారం భారీ ఎక్స్‌వేటర్‌ను తెప్పించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మేకల శ్రీనాథ్‌రెడ్డి, జిలుమూడి వినయ్‌రెడ్డి, వేణురెడ్డి, దగుమాటి శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.

చప్టాకు మరమ్మతులు చేపట్టాలి

● వాహనదారుల ఆందోళన



గండికట్ల చెరువు వద్ద ధ్వంసమైన చప్టా

కొండాపురం, నవబంరు 10 (ఆంధ్రజ్యోతి): కొమ్మి పంచాయతీ గండికట్ల చెరువు వద్ద ఏర్పాటు చేసిన చప్టా పూర్తిగా ధ్వంసమైంది. 10ఏళ్ల కిందట నిర్మించిన ఈ చప్టా గుంతలు పడటంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావలి నుండి కొండాపురం వరకు ఈ రహదారిపై నిత్యం వందలాది ద్విచక్రవాహనదారులు, కార్లు, బస్సులు తిరుగుతుంటాయి. పగటిపూట వెళ్లే వాహనదారులకు గుంతలు కనిపెట్టి జాగ్రత్తగా ప్రయాణం చేస్తారు. రాత్రిపూట వేళ్లే వాహనదారులు ఎదురుగావచ్చే వాహన వెలుతురుకు గుంతలు కనిపించక ప్రమాదాలకు గురి అవుతున్నారు. అధికారులు స్పందించి చప్టాకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



తోకల మహేష్ (ఫైల్)

కందుకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కందుకూరు- సింగరాయకొండ రోడ్డులోని గాయత్రీ కళాశాల సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన తోకల మహేష్ (30) దుర్మరణం చెందాడు. కందుకూరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న మహేష్ సీటీఆర్‌ఐ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద డ్యూటీ కోసం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న మహేష్ తనముందు వెళ్తున్న ట్రక్కు ఆటోను ఓవర్‌టేక్ చేసి వెళ్లేందుకు కుడివైపుకు రాగా వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు అతన్ని ఢీకొట్టింది. దీంతో అతను రోడ్డుపై పడిపోగా కారు చక్రం అతని తలపైకి ఎక్కినట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా హాస్పటల్‌కు తరలించాడు. మృతుడు మహేష్ కందుకూరు మాజీ ఏఎంసీ చైర్మన్ తోకల కొండయ్య సోదరుని కుమారుడు. కాగా, రోడ్డు ప్రమాదంలో తోకల మహేష్ మృతిచెందాడన్న సమాచారంతో స్వగ్రామం మోపాడులో తీవ్ర విషాదచాయలు నెలకొన్నాయి. మహేష్‌కు భార్య, రెండేళ్ల పాప, ఆరునెలల బాబు ఉన్నారు.

ఘనంగా అటవీ అమరవీరుల సంస్మరణ దినం



నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

ఉదయగిరి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అటవీ క్షేత్రాధికారి బీఎస్ కుమార్‌రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొని అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి కె మురళి, కె వెంకటప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీరాములు, చిన్న వెంకటయ్య పాల్గొన్నారు.

టాటా ఏసీ ఆటో, మోటారు బైక్ ఢీ

● మామ, కోడలికి గాయాలు

కావలి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంక్‌రోడ్డులో రోడ్డు క్రాస్ అవుతుండగా ఆదివారం టాటా ఏసీ ఆటో, మోటారు బైక్ ఢీ కొన్న సంఘటనలో ఇస్లాంపేటకు చెందిన అక్షయకు గాయాలయ్యాయి. ఆమె మామతో కలిసి షాపింగ్ చేసుకుని మోటారు బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరుతుండగా ఒంగోలు వైపు నుండి పట్టణంలోకి వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమెకు రక్తగాయాలయ్యాయి. కోడలిని 108 వాహనంలో మామ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కార్తీక దీపం విశిష్టతను తెలుసుకోండి



కార్తీక దీపం విశిష్టత గురించి చెబుతున్న ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్

లింగసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపం విశిష్టతను తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవాసమితి దుత్తలూరు అధ్యక్షులు ప్రసాద్ అన్నారు. ఆదివారం లింగసముద్రంలో ఆయన సమితి సభ్యులతో కలిసి కార్తీకదీపం విశిష్టత, అంతరార్థం గురించి, భగవద్గీత జ్ఞాన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు పెంచలరత్నం, నరసింహులు, నాగమ్మ, రమణయ్య, రమణమ్మ, ప్రేమ్‌కుమార్, మధుప్రియ, మాల కొండారెడ్డి, మమత పాల్గొన్నారు.

శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయం



లింగసముద్రం పంచాయతీ కార్యాలయం

లింగసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయం స్లాబు పైకప్పు శిథిలావస్థకు చేరింది. వర్షం వచ్చినపుడు వాననీరు ఉరుస్తోందని ఈ సమస్యతో సర్పంచు, కార్యదర్శి, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. అలాగే కార్యాలయ రికార్డులు, కంప్యూటరు, ఇతర సామగ్రి తడిచిపోతున్నాయని వాపోతున్నారు. 1995లో నిర్మించిన ఈ భవనానికి కనీసం మరమ్మతులు కూడా చేపట్టక పోవడంతో ఈ సమస్య నెలకొందని చెబుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ఉలవపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న బియ్యం ఆటోను ఆదివారం ఉదయం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. బియ్యంను ఉలవపాడుకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు పట్టుకునేందుకు వెళ్లగా డ్రైవర్ ఆటోను వదిలి పారిపోయాడని పట్టుబడిన బియ్యానికి సంబంధించిన సమాచారాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీకి అందజేసినట్లు ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు.